బుధవారం
23-4-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 211
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడి

30 మంది పర్యాటకుల మృతి

మృతుల్లో ఇద్దరు విదేశీయులు

కశ్మీర్/న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. పర్యాటకులే లక్ష్యంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో 30 మంది పర్యాటకులు మృతిచెందగా పెద్దసంఖ్యలో గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు విదేశీయులు ఉన్నట్లు సమాచారం. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో పర్యటిస్తున్న పర్యాటకులపై ఉగ్రవాదులు మంగళవారం ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారు. ఉగ్రదాడిలో ఏడుగురు టెర్రరిస్టులు పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో వచ్చి... పర్యాకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనపై కేంద్రహోంమంత్రి అమిత్‌షా ఢిల్లీలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ప్రధాని మోదీకి దాడి వివరాలు వెల్లడించారు. అనంతరం ఆయన హుటాహుటిన కశ్మీరు చేరుకున్నారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేర్కొనే పహల్గాంలోని బైసరన్ ప్రాంతాన్ని ముష్కరులు లక్ష్యంగా చేసుకున్నారు. ఈ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉంది. ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం పర్యాటకులపై అత్యంత సమీపం నుంచి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. పెద్దసంఖ్యలో పర్యాటకులకు బుల్లెట్ గాయాలయ్యాయి. 'నా భర్త తలకు గాయమైంది. ఈ దాడిలో అనేక మంది గాయపడ్డారు' అని ఓ బాధిత మహిళ పీటీఐ

- మిగతా 2 లో

26న పోప్ అంత్యక్రియలు

వాటికన్ సిటీ: పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు ఈనెల 26వ తేదీన జరగనున్నాయి. ఇటలీ కాలమానం ప్రకారం శనివారం ఉదయం 10 గంటలకు అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు వాటికన్ ప్రకటన తెలిపింది. కీలక కార్డినళ్ల సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు వెల్లడించింది. రాజధాని రోమ్‌లోని కార్డినళ్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. పోప్ భౌతిక కాయాన్ని బుధవారం సెయింట్ పీటర్స్ బసిలికాకు తరలించి, ప్రజల సందర్శనార్థం ఉంచాలని సమావేశం నిర్ణయించింది. పోప్ మృతికి సంతాప సూచికంగా తొమ్మిది

- మిగతా 2 లో

వ్యూహాత్మక బంధం బలోపేతం

జెడ్డా: భారత ప్రధాని మోదీకి సౌదీ ఎర్రతివాచీ పరిచింది. మోదీ విమానం తమ గగనతలంలోకి ప్రవేశించిన వెంటనే రాయల్ సౌదీ ఎఫ్-15 యుద్ధ విమానాలు ఆయనకు ప్రత్యేకంగా స్వాగతం పలికాయి. రెండు పక్కల మూడు చొప్పున మొత్తం ఆరు యుద్ధ విమానాలు ... మోదీ విమానాన్ని స్వాగనంపిన వీడియోలు వైరలయ్యాయి. కాగా, మోదీ రెండు రోజుల సౌదీ పర్యటన సందర్భంగా ఆరు అవగాహన ఒప్పందాలపై సంతకాలు జరుగనున్నాయి. ఈ పర్యటనతో భారత్-సౌదీ మధ్య స్నేహ సంబంధాలు - వ్యూహాత్మక బంధం మరింత బలోపేతం

- మిగతా 2 లో

హీరో మహేష్ బాబుకు ఈడీ నోటీసులు

విశాలాంధ్ర-హైదరాబాద్: టాలీవుడ్ ప్రముఖ నటుడు మహేష్ బాబుకు ఈడీ షాక్ ఇచ్చింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ సంస్థలైన సురానా డెవలపర్స్, సాయి సూర్య డెవలపర్స్‌పై తనిఖీల్లో భాగంగా లభించిన ఆధారాల ప్రకారం కంపెనీలకు చేసిన వాణిజ్య ప్రకటనలకు మహేష్ బాబు రూ.5.9 కోట్లు పారితోషికంగా తీసుకున్నట్టు ఈడీ అధికారులకు తెలిసింది. అందులో రూ.2.5 కోట్లు అక్రమ పద్ధతిలో తీసుకున్నట్టు వారికి ఆధారాలు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఇంటర్‌లో బాలికల హవా

- మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో 66.89 శాతం, 71.37 శాతం ఉత్తీర్ణత
- విద్యార్థులకు సీఎం, డిప్యూటీ సీఎం అభినందనలు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో ఇంటర్ ఫలితాలు విడదలయ్యాయి. బాలికలిదే పై చేయిగా ఉంది. మొదటి సంవత్సరంలో 66.89 శాతం మంది, ద్వితీయ సంవత్సరంలో 71.37 శాతం మంది చొప్పున ఉత్తీర్ణులయ్యాయి. ఈ ఫలితాలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంగళవారం ఇంటర్ బోర్డు కార్యాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఇంటర్ బోర్డు అధికారులతో కలిసి విడుదల చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 4,88,4430 లక్షల మంది హాజరు కాగా 73.83 శాతం మంది బాలికలు, 57.83 శాతం మంది బాలురు ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన 5,08,582 మందిలో 74.21 శాతం మంది బాలికలు, 57.31 శాతం మంది బాలురు ఉత్తీర్ణులయ్యారు. వీరందరికీ ఉప ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. జపాన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సైతం ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యారంగాభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. తప్పులకు తావులేకుండా పారదర్శకంగా, విజయవంతంగా ఇంటర్

- మిగతా 2 లో

ప్రపంచ స్థాయిలో 'గద్దర్' అవార్డులు: భట్టి

2 లో

కొత్త ఆవిష్కరణలు... సుస్థిర విధానాలు

- జపాన్‌లో పర్యటనలో సీఎం రేవంత్
- హిరోషిమాను సందర్శించిన తెలంగాణ బృందం
- పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలపై చర్చ
- ఆటోమోటివ్... మొబిలిటీ కారిడార్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం కొత్త ఆవిష్కరణలు, సుస్థిర విధానాలు, శాంతియుత వాతావరణానికి కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు నేతృత్వంలోని తెలంగాణ అధికారుల బృందంతో కలిసి సీఎం రేవంత్ జపాన్‌లోని హిరోషిమా ప్రి ఫెక్చర్‌ను సందర్శించారు. హిరోషిమా డిప్యూటీ గవర్నర్‌తో సమావేశమయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హిరోషిమా ప్రభుత్వ ఆతిథ్యానికి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శాంతితో పాటు సాంకేతిక పురోగతిలో హిరోషిమా ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించిందని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు తెలంగాణ, హిరోషిమా కలిసి పని చేయగలిగే రంగాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. వ్యర్థాల నుంచి ఇంధనం లాంటి క్లీన్ టెక్నాలజీ, మునిసిపాలిటీలలో వ్యర్థాలు, మురుగు నీటి శుద్ధి, పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు, అర్బన్ ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హైదరాబాద్‌లో విపత్తుల నివారణ డిజైన్‌లు, భూగర్భ మెట్రో ఇంజనీరింగ్, స్మార్ట్ సిటీ సొల్యూషన్స్, పారిశ్రామిక సహకారం, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్, అధునాతన ఉత్పత్తుల తయారీకి హిరోషిమా-తెలంగాణ ఆటోమోటివ్ అండ్ మొబిలిటీ కారిడార్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను ప్రస్తావించారు. వీటితో పాటు విద్య, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో తెలంగాణలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల

- మిగతా 2 లో

ఎల్‌ఆర్‌ఎస్ గడువు పెంచబోం

- భూభారతి చట్టంపై లోతుగా అధ్యయనం చేయాలి
- మే మొదటి వారంలోగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి కావాలి
- కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు పనిచేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ గడువు ఈనెల 30తో ముగుస్తుందని, దీనిని పొడిగించే ఆలోచన లేదని చెప్పారు. మరో వారం మాత్రమే ఉందని.... ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీని వినియోగించుకోవాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ అమలులో కలెక్టర్ల పనితీరును పొంగులేటి అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు, ఎల్‌ఆర్‌ఎస్ తదితర అంశాలపై సచివాలయం నుంచి మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిష్ఠాత్మకమైన ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి చట్టం అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్లకు పొంగులేటి సూచించారు. భూభారతి చట్టం సక్రమ అమలు బాధ్యత కలెక్టర్లదేనని, దీనిపై లోతుగా అధ్యయనం చేయాలని

- మిగతా 2 లో

సివిల్స్ తుది ఫలితాలు

వచ్చేశాయ్

ప్రథమ ర్యాంకుతో సత్తా చాటిన శక్తి దూబె

న్యూఢిల్లీ: అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ - 2024 తుది ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాలను యూపీఎస్సీ మంగళవారం మధ్యాహ్నం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. శక్తి దుబే తొలి ర్యాంకుతో సత్తా చాటగా... హర్షిత గోయల్ (2), అర్చిత్ పరాగ్ (3), షా మార్గి చిరాగ్(4), ఆకాశ్ గార్గ్ (5), కోమల్ పునియా(6), ఆయుషీ బన్సల్(7), రాజ్‌కృష్ణ ఝా(8), ఆదిత్య విక్రమ్ అగర్వాల్ (9), మయాంక్ త్రిపాఠి(10) ర్యాంకుల్లో మెరిశారు.

మెరిసిన తెలుగు తేజాలు

సివిల్స్ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి సత్తా చాటిన విద్యార్థుల్లో ఇ.సాయి శివాని 11వ ర్యాంకుతో మెరవగా... బన్నా వెంకటేశ్‌కు 15వ ర్యాంకు, అభిషేక్ శర్మ 38, రావుల జయసింహారెడ్డి 46, శ్రవణ్‌కుమార్ రెడ్డి 62, సాయి చైతన్య జాదవ్ 68, ఎన్.చేతనరెడ్డి 110, చెన్నంరెడ్డి శివగణేశ్‌రెడ్డి 119, చల్లా పవన్ కల్యాణ్ 146, ఎన్.శ్రీకాంత్ రెడ్డి 151,

- మిగతా 2 లో

పార్లమెంటే సుప్రీం

- దీనికి అతీతంగా ఏదీ లేదు
- మరోసారి ధన్కర్ ప్రేలాపన

న్యూఢిల్లీ: దేశ సర్వోన్నత న్యాయస్థానంపై కాషాయ మూకలు దాడులు చేస్తున్నాయంటూ ఇండియా కూటమి పక్షాలు ధ్వజమెత్తుతున్న వేళ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వక్ఫ్ సవరణ చట్టంపై విచారణ... రాష్ట్ర కేబినెట్‌లు సిఫార్సు చేసిన బిల్లుల విషయంలో ఇటీవల సుప్రీం కోర్టు వెలువరించిన ఆదేశాల నేపథ్యంలో ఉపరాష్ట్రపతి ధన్కర్‌తో పాటు బీజేపీ ఎంపీలు న్యాయవ్యవస్థ అధికారాలను ప్రశ్నిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేయడం... దీనిని ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండించిన సంగతి తెలిసిందే. తాజాగా ధన్కర్ మరోసారి న్యాయవ్యవస్థ తీరుపై ఘాటు వ్యాఖ్యలు చేయడం...మళ్లీ దేశ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మంగళవారం ఆయన దిల్లీ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఇటీవల సుప్రీంకోర్టుపై తాను చేసిన వ్యాఖ్యలపై ప్రశ్నిస్తూ విమర్శలు చేసిన వారిపై ఆయన మండిపడ్డారు. రాజ్యాంగ అధికారిగా తాను మాట్లాడే ప్రతి మాట అత్యున్నత జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటుందన్నారు. దేశంలో పార్లమెంటు ప్రజాస్వామ్యం అత్యున్నతమైనదని, దానిని మించిన అధికార వ్యవస్థ మరోటి లేదని అన్నారు.పార్లమెంటు అత్యున్నత స్థానం కలిగిన సంస్థ అని. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులే రాజ్యాంగ రూపురేఖలను నిర్ణయించే హక్కును కలిగి ఉంటారని తెలిపారు. రాజ్యాంగంపై వారికే తుది హక్కు ఉంటుందన్నారు. ఎవ్వరూ దానికంటే పై స్థాయిలో ఉండలేరని ధన్కర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ఎలా ఉండాలో, అందులో ఎలాంటి

- మిగతా 2 లో

'హైదరాబాద్' ఎమ్మెల్సీ ఎన్నికలకు

సర్వం సిద్ధం

- రెండు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- 200 మంది పోలీసులతో బందోబస్తు

విశాలాంధ్ర-హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా స్థానిక సంఘాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైనట్లు రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మొత్తం 112 మంది ఓటర్లు ఉన్నారని, 23వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని చెప్పారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సిబ్బందితో పాటు అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి కేంద్రంలో నలుగురు చొప్పున సిబ్బంది ఉంటారని, 144 సెక్షన్ అమలులో ఉంటుందని అధికారి తెలిపారు. 200-250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 500 మంది అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉంటారని చెప్పారు. పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా స్వేచ్ఛగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. పోలింగ్ రోజు ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులకు మినహా జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. ఆ ఉద్యోగులందరూ జూన్ 14 అంటే రెండో శనివారం విధులకు హాజరు కావాలని అనురాగ్ చెప్పారు. సమావేశంలో ఎన్నికల అదనపు కమిషనర్ అలివేలు మంగతాయారు, హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్ రవి పాల్గొన్నారు.

రాజకీయ ఖైదీలను విడిచిపెట్టండి

గొలుసులతో కట్టేసుకొని కొలంబియా వర్సిటీ వద్ద నిరసన

న్యూయార్క్: న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటీ వద్ద విద్యార్థులు ఆందోళ చేశారు. తమ రాజకీయ ఖైదీలను బేషరతు విడుదలకు డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. నినాదాలిచ్చారు. 10 మంది ప్రదర్శనకారులు తమకు తాముగా కొలంబియా వర్సిటీ గేట్లకు గొలుసులతో కట్టేసుకొని నిరసన తెలిపారు. పలస్తీనా విద్యార్థి కార్యకర్తలు ఇద్దరిని ఇమ్మిగ్రేషన్ & కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ (ఐసీఈ) నిర్బంధించడాన్ని వ్యతిరేకించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు గేటు వద్ద ధర్నా నిర్వహించారు. కొలంబియా స్కూల్ ఆఫ్ జనరల్ స్టడీస్‌లో ఫిలాసఫీ అండర్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన మోసీన్ మద్వానీని ఐసీఈ గత వారం కస్టడీలోకి తీసుకుంది. అలాగే స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్ గ్రాడ్యుయేట్ మహమూద్ ఖలీల్‌ను ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ అధికారులు గతనెలలో నిర్బంధించారు. ఈ ఇద్దరు కార్యకర్తలు కొలంబియాలోని పలస్తీనా అనుకూల ప్రదర్శనలను నిర్వహించారు. మద్వానీ, ఖలీల్ విడుదలకు ఆందోళనకారులు డిమాండ్ చేశారు. 'మా రాజకీయ ఖైదీలు అందరినీ విడుదల చేయండి', 'మాకు న్యాయం కావాలి. అది ఎలాగో మీరు చెప్పండి' మోసీన్ మద్వానీని తక్షణమే విడుదల చేయండి' అన్న ప్లకార్డులతో ప్రదర్శనకారులు నినాదాలు చేశారు. లూసియానా, జెనాలోని నిర్బంధ కేంద్రం నుంచి ఖలీల్ రాసిన రాతలను చదవి వినిపించారు. ఈ నిరసన క్రమంలో జరిగిన ఉల్లంఘనలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కొలంబియా అధికార ప్రతినిధి చెప్పారు. ఇది చిన్నపాటి ఆటంకం అని, విద్యార్థులు యధావిధిగా తరగతులకు హాజరయ్యారని, అన్ని కార్యకలాపాలు షెడ్యూల్ ప్రకారం జరిగాయన్నారు. ఈ నిరసనతో చాలా మందిని అదుపులోకి తీసుకున్నట్లు న్యూయార్క్ పోలీసులు తెలిపారు. అయితే ఎంత మందిని అరెస్టు చేశారు. వారిపై తీసుకునే చర్యలు ఏమిటో వెల్లడించలేదు. కాగా, కొలంబియా గేట్లను నిరసనకారులు గొలుసులతో కట్టేసుకొని నిరసన తెలుపడటం ఈ నెలలో రెండవ సారి జరిగింది.

బీరుట్‌పై ఇజ్రాయిల్ దాడిలో ఇస్లామియా నేత మృతి

బీరుట్: లెబనాన్ రాజధాని బీరుట్‌లోని దక్షిణ భాగంలో ఇజ్రాయిల్ మంగళవారం దాడులు జరిపింది. ఈ దాడుల్లో హమాస్‌కు మిత్ర సంఘమైన జమా ఇస్లామియా నాయకుడు హుస్సేన్ అటౌయి హతమయ్యారు. ఈ మేరకు లెబనాన్ పౌర రక్షణ శాఖాధికారి వెల్లడించారు. 'బీరుట్‌కు దక్షిణం వైపు 20 కిమీల దూరంలో ఉన్న కోస్తా పట్టణం దమౌర్‌లో ఓ కారు లక్ష్యంగా ఇజ్రాయిల్ డ్రోన్ దాడి చేసింది. ఆ వాహనంలో నుంచి ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంద'ని అధికారి తెలిపారు. మృతుడిని జమా ఇస్లామియా సాయుధ విభాగాధికారి హుస్సేన్‌గా గుర్తించినట్లు చెప్పారు. లెబనాన్‌పై ఆదివారం జరిపిన వైమానిక దాడుల్లో హెజ్బుల్లా నేతలు ఇద్దరిని హతమార్చినట్లు ఇజ్రాయిల్ ప్రకటించింది.

కక్ష్యలోకి ద.కొరియా నిఘా ఉపగ్రహం

సియోల్: దక్షిణ కొరియా నాల్గవ నిఘా ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. ఐదు సైనిక నిఘా ఉపగ్రహాల్లో నుంచి నాల్గో ఉపగ్రహాన్ని ఫ్లోరిడాలోని అమెరికా అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించి, నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా చేర్చినట్లు దక్షిణ కొరియా రక్షణ శాఖ మంగళవారం వెల్లడించింది. స్పేస్ ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా కేప్ కనావెరల్ స్పేస్ ఫోర్స్ సెంటర్ నుంచి ఈ ప్రయోగం జరిగినట్లు తెలిపింది. ప్రయోగించిన 15 నిమిషాల్లోగా నిర్ణీత కక్ష్యలోకి ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టినట్లు పేర్కొంది. తమ సాయుధ దళాలను మరింతగా బలోపేతం చేసుకోవడం కోసం, స్వతంత్రంగా నిఘా సామర్థ్యం పెంచుకునేందుకు ఈ ఉపగ్రహాలు దోహదమవుతాయని మంత్రిత్వశాఖ వెల్లడించింది.

చైనా-ఈక్వెడార్ వ్యూహాత్మక బంధం

జిన్‌పింగ్

బీజింగ్: చైనా, ఈక్వెడార్... సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య దేశాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. తమ ద్వైపాక్షిక సంబంధాలను మరింతగా పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. ఈక్వెడార్ అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికైన డానియల్ నోబాకు జిన్‌పింగ్ శుభాకాంక్షలు తెలుపుతూ పంపిన సందేశంలో ఈ మేరకు పేర్కొన్నారు. తమ రెండు దేశాల మధ్య రాజకీయపరంగా లోతైన అవగాహన ఉందని, రెండు దేశాలు పరస్పరం నమ్మకంతో వివిధ రంగాల్లో ఫలప్రదమైన సహకారంతో ముందుకెళుతున్నాయని వెల్లడించారు. ఈ మధ్య సహకారాభివృద్ధిని కాంక్షించారు. ఈ ఏడాదితో తమ దేశాల దౌత్య బంధానికి 45 సంవత్సరాలు అవుతాయన్నారు. తమ మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు, రెండు దేశాల ప్రజలకు మెరుగైన ప్రయోజనాలు అందించేందుకు నోబాతో కలిసి పని చేసేందుకు సిద్ధమని జిన్‌పింగ్ తెలిపారు. అయితే ఈక్వెడార్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మారియా జోసె పింటోకు శుభాకాంక్షలు తెలుపుతూ చైనా ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్ కూడా ఒక సందేశం పంపారు.

నేడు బ్రిటన్, అమెరికాతో శాంతి చర్చలు: జెలెన్‌స్కీ

కీవ్: బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా దేశాలతో శాంతి చర్చలు జరపనున్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. ఈ చర్యలు బుధవారం బ్రిటన్ రాజధాని లండన్‌లో జరుగుతాయన్నారు. బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్‌తో ఫోన్ సంభాషణ అనంతరం ఆయన ఈ మేరకు 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'నిర్మాణాత్మకంగా ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాం. బేషరతుగా కాల్పుల విరమణకు కట్టుబడ్డాం. వాస్తవిక, సుదీర్ఘ శాంతి స్థాపనే లక్ష్యం' అని జెలెన్‌స్కీ వెల్లడించారు.

బేషరతుగా కాల్పుల విరమణ జరిగినప్పుడే శాంతి సాధనకు మొదటి అడుగు పడగలదని ఆయన నొక్కి చెప్పారు. యూరోపియన్ సెక్యూరిటీ ఫార్మాట్ల పరిధిలో కలిసి పనిచేయడంపై స్టార్మర్‌తో చర్చించినట్లు జెలెన్‌స్కీ పేర్కొన్నారు.

లెనిన్ ఆశయ సాధన కోసం యువత నడుం బిగించాలి: హరినాథరెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: రష్యన్ విప్లవ సేనాని, సమ సమాజ నిర్మాత లెనిన్ ఆశయసాధనకు యువత పాటుపడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ రెడ్డి అన్నారు. మంగళవారం తిరుపతి బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయం వద్ద లెనిన్ 155వ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరినాథ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థి దశ నుండే మార్క్సిజాన్ని అధ్యయనం చేసిన లెనిన్ ప్రపంచంలోనే మొట్టమొదటి కమ్యూనిస్టు దేశాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. ప్రజల్లో అంతరాలు లేకుండా సమసమాజాన్ని నిర్మించిన యోధుడు లెనిన్ అని కొనియాడారు. సామ్రాజ్యవాదాన్ని బలంగా వ్యతిరేకించడమే కాకుండా సామ్రాజ్యవాద వ్యతిరేక సిద్ధాంతాన్ని రచించి ప్రపంచ కమ్యూనిస్టు సిద్ధాంతాలకు బీజం వేశారని చెప్పారు. ఆయన స్ఫూర్తితోనే ప్రపంచ వ్యాప్తంగా చాలా కమ్యూనిస్టు ఉద్యమాలు, పోరాటాలు పుట్టుకువచ్చాయని అన్నారు.

హీరో మహేష్ బాబుకు ఈడీ నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

లభించాయి. దీంతో రియల్ ఎస్టేట్ సంస్థలో అక్రమాలు జరుగుతున్నాయని ఈడీ అధికారులు ఆరోపించారు. అసలు విషయం తెలియక ఈ సంస్థలో అనేక మంది పెట్టుబడులు పెట్టారన్నారు. ఇదే క్రమంలో మహేష్ బాబుకు ఈడీ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈనెల 27న విచారణకు హాజరు కావాలని ఆదేశించారు.

సివిల్స్ తుది ఫలితాలు వచ్చేశాయ్

(మొదటిపేజీ తరువాయి)

నెల్లూరు సాయితేజ 154, కొలిపాక శ్రీకృష్ణసాయి 190వ ర్యాంకులతో అదరగొట్టారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో మొత్తం 1056 ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి పోస్టుల భర్తీకి గతేడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించిన యూపీఎస్సీ... ఇందులో అర్హత సాధించిన వారికి సెప్టెంబర్ 20 నుంచి 29వ తేదీ వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. మెయిన్స్‌లో సత్తా చాటిన వారికి జనవరి 7 నుంచి ఏప్రిల్ 17వరకు దశల వారీగా వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించి తాజాగా తుది ఫలితాలు ప్రకటించింది. ఈ ఫలితాల్లో 1,009 మందిని ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్, సెంట్రల్ సర్వీసెస్ గ్రూప్ ఎ, గ్రూప్ బి సర్వీసులకు ఎంపిక చేయగా... వీరిలో జనరల్ కేటగిరీలో 335 మంది, ఈడబ్ల్యూఎస్ నుంచి 109, ఓబీసీ నుంచి 318, ఎస్సీ కేటగిరీలో 160, ఎస్టీ కేటగిరీ నుంచి 87 మంది చొప్పున ఉన్నారు. సివిల్ సర్వీసెస్ నిబంధనలు అనుసరించి 230 మందిని రిజర్వు జాబితాలో ఉంచింది. ఈ ఫలితాలకు సంబంధించి ఏదైనా సమాచారం కావాలనుకొనేవారి కోసం యూపీఎస్సీ క్యాంపస్‌లోని పరీక్ష హాల్ వద్ద కౌంటర్ ఏర్పాటు చేసినట్లు యూపీఎస్సీ తెలిపింది. 2024 సివిల్స్ పరీక్ష రాసిన అభ్యర్థులు... తమ పరీక్షలు, నియామకాలకు సంబంధించి ఏదైనా సమాచారం లేదా స్పష్టత కావాలంటే పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య స్వయంగా వచ్చి గానీ, 23385271, 23381125, 23098543 ఫోన్ నంబర్ల ద్వారా గానీ సంప్రదించవచ్చని సూచించింది. సివిల్స్‌లో అభ్యర్థులు సాధించిన మార్కుల జాబితాను 15 రోజుల్లోగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు యూపీఎస్సీ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది.

ఇంటర్‌లో బాలికల హవా

(మొదటిపేజీ తరువాయి)

ఫలితాలను విడుదల చేసిన అధికార బృందాన్ని కూడా సీఎం అభినందించారు.

ములుగు, ఆసిఫాబాద్ భేష్: సీతక్క

ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకి మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన తన సొంత జిల్లా ములుగు మొదటి స్థానంలో... తాను ఇంచార్జీగా ఉన్న ఆసిఫాబాద్ జిల్లా రెండో స్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. వెనుకబడిన జిల్లాలు, గిరిజన ప్రాంతాలుగా పేరున్న ఈ రెండు జిల్లాల విద్యార్థులు సత్తా చాటడం సంతోషంగా ఉందని, ఇందుకు సహకరించిన ఆయా జిల్లా కలెక్టర్లు, డీఈవోలు, ఇతర అధికారులకు మంత్రి అభినందనలు తెలిపారు. ములుగు కలెక్టర్, ఐటీడీఏ అధికారులు, డీఈవోను కలెక్టర్ కార్యాలయంలో మంత్రి సన్మానించారు.

26న పోప్ అంత్యక్రియలు

(మొదటిపేజీ తరువాయి)

రోజుల పాటు సంతాప దినాలు పాటిస్తున్నారు. వీటిని నవెండియలెస్ అంటారు. పోప్ అంత్యక్రియలు, ఆయన మృతి చెందిన రోజు నుంచి నాలుగు లేక ఆరో రోజులలో జరగాలి. దీంతో 26న అంత్యక్రియలు నిర్వహించనున్నారు. పోప్ భౌతికకాయం ఫొటోలను వాటికన్ తొలిసారి విడుదల చేసింది. అంతిమ సంస్కారాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన భార్య మెలోనియా హాజరు కానున్నారు. ఇదిలావుంటే, దాదాపు 135 మంది కార్డినల్లు కలిసి నూతన పోప్‌ను ఎన్నుకుంటారు. వీరిలో భారతీయులు కూడా ఉన్నారు. పోప్ అంత్యక్రియల తర్వాత సిస్టీన్ ఛాపెల్‌లో పాపల్ కాంక్లేవ్ నిర్వహిస్తారు. పోప్ ఎన్నికలో భారత్ తరఫున కార్డినల్లు ఫిలిప్ నెరి ఫెర్రావ్, క్లీమిస్ బసెలియోస్, ఆంథోనీ పూల, జార్జ్ జాకబ్ కూవకాడ్ పాల్గొంటారు.

ప్రపంచ స్థాయిలో 'గద్దర్' అవార్డులు: భట్టి

విశాలాంధ్ర-హైదరాబాద్: 'గద్దర్ సినిమా అవార్డుల' కార్యక్రమాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అట్టహాసంగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందన్నారు. ప్రసాద్ సినీ ల్యాబ్‌లో మంగళవారం నిర్వహించి గద్దర్ అవార్డుల జ్యూరీ సమావేశానికి భట్టి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయి అవార్డుల ప్రదానోత్సవాల తరహాలో గద్దర్ సినిమా అవార్డుల కార్యక్రమం జరపాలన్నారు. 'తెలంగాణ రాష్ట్రంలో గద్దర్ పుట్టడం మన అదృష్టం. అలాంటి మహానుభావులు దశాబ్దానికి ఒకరు పుడతారు. తెలంగాణ సంస్కృతి, గుండె చప్పుడును గద్దర్ విశ్వవ్యాప్తం చేశారు' అని భట్టి అన్నారు. గత పది సంవత్సరాలు రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ నిరాదరణకు గురైందన్నారు. 2011లో చలనచిత్ర అవార్డుల పంపిణీ కార్యక్రమం నిలిచిపోయిందని గుర్తుచేశారు. తెలంగాణ సంస్కృతి. భావజాలాన్ని ప్రపంచ స్థాయిలో గద్దర్ ప్రచారం చేశారని, చిన్నపిల్లలు నుంచి వృద్ధుల వరకు ఆయనను అనుకరిస్తారని భట్టి తెలిపారు. సింగరేణి ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర సాధన డిమాండ్‌తో గద్దర్ పాదయాత్ర చేసి ప్రత్యేక రాష్ట్రానికి నాంది పలికారన్నారు. సమాజికాభివృద్ధి, విలువలు ప్రోత్సహించే మీడియాను కాపాడుకునే బాధ్యత పాలకులపై ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. సినీ రంగానికి చేయూతనివ్వాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సినీ పరిశ్రమకు కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టిన వ్యక్తుల పేరిట అవార్డులు ఇస్తున్నామని, ఇవి భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటాయని భట్టి విక్రమార్క అన్నారు.

నక్సల్స్ అంతానికి పంతమొద్దు

- తక్షణమే శాంతి చర్చలు జరపాలి
- కేంద్రానికి చాడ వెంకటరెడ్డి హితవు

విశాలాంధ్ర-హైదరాబాద్: నక్సల్స్ అంతానికి పంతం పెట్టుకోవద్దని, వారితో వెంటనే శాంతి చర్చలు జరపాలని, సామారస్యంగా చర్చించినప్పుడు ఎలాంటి సమస్య అయినా పరిష్కారం కాగలదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కేంద్రానికి హితవు పలికారు. బూటకపు ఎన్‌కౌంటర్లు నిలిపివేయాలని కోరారు. నక్సల్స్ ఏరివేత లక్ష్యంగా చత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులోని ములుగు, కర్రెగుంటలో సీఆర్పీఎఫ్ బలగాల మోహరింపును వ్యతిరేకించారు. వామపక్ష భావజాలంపై మోదీ ప్రభుత్వం యుద్ధం ప్రకటిస్తోందన్నారు. నక్సలిజం అంతానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పంతం పెట్టుకున్నారని, ఇందుకోసమే బూటకపు ఎన్‌కౌంటర్లలో వందల మంది చనిపోతున్నారని చాడ వెంకటరెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. సిద్ధాంతాన్ని నమ్ముకున్న మావోయిస్టులు చాలా మంది ఇప్పటికే లొంగిపోయారని, మిగిలిన వారు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించారని, దీనికి కేంద్రప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మావోయిస్టులతో తక్షణమే శాంతి చర్చలు జరపాలని... పంతాలకు పట్టింపులకు పోకుండా సామరస్యంగా చర్చలు జరపాలని సూచించారు. జనజీవన స్రవంతిలోకి రావాలని మావోయిస్టులను సీపీఐ కోరిందని తెలిపారు. మావోయిస్టుల విషయంలో మానవీయత కోణంలో ఆలోచించాలని కేంద్ర ప్రభుత్వానికి చాడ వెంకటరెడ్డి హితవు పలికారు.

ఎల్ఆర్ఎస్ గడువు పెంచబోం

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. ఈ చట్టాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేసే నాలుగు మండలాల్లోని 56కుగాను 16 గ్రామాల్లో ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై 5,905 దరఖాస్తులు వచ్చాయని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో 1,076, నారాయణపేట జిల్లా మద్దూర్‌లో 233, కామారెడ్డి జిల్లా లింగంపేటలో 810, ములుగు జిల్లా వెంకటాపురంలో 3,786 చొప్పున దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈనెల 30లోగా రెవెన్యూ సదస్సులు ముగియాలని కలెక్టర్లకు సూచించారు. మే మొదటి వారంలో హైదరాబాద్ మినహా మిగిలిన 28 జిల్లాల్లోని ఒక్కో మండలాన్ని ప్రయోగాత్మక మండలంగా తీసుకొని భూభారతి చట్టాన్ని అమలు చేస్తామన్నారు. 28 మండలాల్లోని తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, మరో ఇద్దరు అధికారులకు భూభారతి చట్టంపై వర్క్‌షాపు నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని 605కుగాను 159 మండలాల్లో భూభారతిపై అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. సీసీఎల్ఏ స్థాయిలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను కూడా ప్రయోగాత్మక (పైలట్) మండలాల్లోని రెవెన్యూ సదస్సులలో చేర్చాలని మంత్రి సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను మే మొదటి వారంలోగా పూర్తిచేయాలని, నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్లను పొంగులేటి ఆదేశించారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు చొప్పున ఎంపిక చేయాలని, 200 దరఖాస్తులకు ఒక గెజిటెడ్ అధికారిని నియమించి అర్హులకే ఇండ్లు అందేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా ఉంటేనే డబ్బులు విడుదల చేయాలని పొంగులేటి సూచించారు. నిర్మాణ దశలను బట్టి లబ్ధిదారులకు వారి ఖాతాలోనే నేరుగా డబ్బులను ప్రతి సోమవారం జమ చేయాలన్నారు. తక్కువ ధరకు స్టీల్-సిమెంట్ ఇచ్చేలా పరిశ్రమల శాఖామంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో త్వరలో సమావేశమవుతామని చెప్పారు. ఆదిలాబాద్, జగిత్యాల, నిజామాబాద్ వనపర్తి మంచిర్యాల గద్వాల మొత్తం 11 జిల్లాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ఆశించిన స్థాయిలో లేదని పొంగులేని శ్రీనివాసరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజీ జ్యోతి బుద్ధప్రకాశ్, ఎంఏయూడీ మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్, హౌసింగ్ కార్పోరేషన్ ఎండీ గౌతమ్, సీసీఎల్ఏ డైరెక్టర్ మకరంద్ పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలు... సుస్థిర విధానాలు

(మొదటిపేజీ తరువాయి)

మధ్య సంబంధాలు, పరిశోధనలకు సహకారం, తెలంగాణ సంస్కృతి, శాంతి, పర్యాటకం, పీస్ పార్క్, సాంస్కృతిక ప్రదర్శనలు, బౌద్ధ వారసత్వానికి సహకరించాలని కోరారు.

హిరోషిమా అసెంబ్లీని సందర్శించిన సీఎం

సీఎం రేవంత్ నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ హాల్‌ను సందర్శించింది. ఈ బృందానికి అసెంబ్లీ స్పీకర్ తకాషి నకమోటో, వారి శాసన సభ్యుల బృందం ఘనంగా స్వాగతం పలికింది. ముఖ్యమంత్రితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు జయేష్ రంజన్, వి.శేషాద్రి, అజిత్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి అసెంబ్లీని సందర్శించారు. అక్కడి శాసన సభ్యుల సమావేశాన్ని ఉద్దేశించి సీఎం రేవంత్ మాట్లాడుతూ హిరోషిమాకు రావటం గౌరవంగా ఉందన్నారు. హిరోషిమా అంటే ఆశ, ప్రజలు కలిసికట్టుగా పని చేస్తే ఏదైనా సాధ్యమని ప్రపంచానికి నిరూపించిన నగరంగా అయన అభివర్ణించారు. హిరోషిమా మాదిరిగానే ప్రజల ఆశలు, ఆకాంక్షలు, పోరాటానికి చిహ్నం తెలంగాణ అని, దూరదృష్టితో విజయం సాధించిన రాష్ట్రమని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ శాంతి, స్థిరత్వం, సమృద్ధి వంటి విలువలను పంచుకుందామని హిరోషిమా ప్రభుత్వానికి పిలుపునిచ్చారు. పెట్టుబడులకు

కాకుండా పరస్పర సహకారం, భాగస్వామ్యం గురించి మాట్లాడటానికి వచ్చామని, కలిసికట్టుగా మెరుగైన, పచ్చని, సమగ్రమైన ప్రపంచాన్ని నిర్మిద్దామని అన్నారు. ఇప్పటికే 50 కి పైగా జపాన్ కంపెనీలు తెలంగాణలో అద్భుతంగా పని చేస్తున్నాయని, మరిన్ని కంపెనీలను మంత్రి స్వాగతించారు. క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ప్రిసిసన్ మ్యానుఫాక్చరింగ్, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో గొప్ప అవకాశాలున్నాయని తెలిపారు. తెలంగాణాను సందర్శించి, రాష్ట్ర ప్రగతిని స్వయంగా చూడాలని హిరోషిమా ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలను మంత్రి ఆహ్వానించారు. తెలంగాణ దేశానికి గేట్ వే, ప్రపంచానికి విస్తరించే వేదికగా ఉంటుందన్నారు. హిరోషిమా-హైదరాబాద్, జపాన్-తెలంగాణ మధ్య బలమైన సంబంధాల వారధిని నిర్మిద్దామన్నారు. అసెంబ్లీ సందర్శన తర్వాత తెలంగాణ ప్రతినిధి బృందం హిరోషిమా చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం శాసన సభ్యుల బృందం రేవంత్ రెడ్డి బృందాన్ని గాంధీ మెమోరియల్, హిరోషిమా పీస్ మెమోరియల్ పార్క్, అణుబాంబు డోమ్ వద్దకు తీసుకువెళ్లింది.

గాంధీ విగ్రహానికి నివాళి

జపాన్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిరోషిమాలోని మహాత్మా గాంధీ విగ్రహాన్ని సందర్శించారు. భారత జాతిపిత, విశ్వ శాంతి దూత మహాత్ముడికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు ఉన్నారు. ప్రసిద్ధ హిరోషిమా శాంతి స్మారకాన్ని సందర్శించారు. 1945 రెండో ప్రపంచ యుద్ధంలో హిరోషిమాపై జరిగిన అణుబాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. నాటి అణుబాంబు విధ్వంసంలో నిలిచిన ఏకైక శిథిలం అటామిక్ బాంబ్ డోమ్‌ను కూడా సందర్శించారు.

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడి

(మొదటిపేజీ తరువాయి)

వార్తా సంస్థకు ఫోన్‌లో తెలియజేసింది. ఆ మహిళ తన వివరాలు వెల్లడించనప్పటికీ... ఆసుపత్రికి తరలించాలని వేడుకున్నారు. బైసరన్‌లో కాల్పుల శబ్దం వినిపించడంతో వెంటనే అప్రమత్తమై భద్రతా బలగాలను అక్కడకు తరలించినట్లు స్థానిక పోలీసులు చెప్పారు. గాయపడిన వారిని హెలికాప్టర్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. కొంతమంది పహల్గాం ఆసుపత్రిలో చేరారని, వారి ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు. 38 రోజుల పాటు కొనసాగే అమర్‌నాథ్ యాత్ర జులై 3 నుంచి ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా లక్షల మంది యాత్రికులు రెండు మార్గాల్లో ఇక్కడకు చేరుకుంటారు. అనంత్‌నాగ్ జిల్లాలో పహల్గాం మార్గంలోనే 48 కి.మీ మేర ఉండగా... 14కి.మీ మార్గం గందేర్బల్ జిల్లా నుంచి ఉంటుంది. ఈ నేపథ్యంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడికి తెగబడటం ఆందోళన కలిగిస్తోంది.

రాష్ట్రపతి, ప్రధాని ఖండన

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోదీ తీవ్రంగా ఖండించారు. సౌదీ పర్యటనలో ఉన్న ఆయన... కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడారు. దాడి ఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని, తక్షణమే ఘటనాస్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షించాలని చెప్పారు. ముష్కరులను వదిలేది లేదని, కోర్టు ముందుకు తీసుకొచ్చి శిక్షిస్తామని అన్నారు.

ముష్కరులను వదిలిపెట్టం: అమిత్‌షా

'పర్యాటకులపై దాడి తీవ్రంగా బాధించింది. ఇందులో పాల్గొన్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. నేరస్థులపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటాం. ఘటన గురించి మోదీకి వివరించాను. సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించాను. అత్యవసర భద్రతా సమీక్ష కోసం శ్రీనగర్ వెళ్తున్నాను' అని అమిత్ షా ట్వీట్ చేశారు. కాగా, పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఖండించారు. దీనిని హేయమైన చర్యగా అభివర్ణించారు. దాడికి పాల్పడినవారు మానవ మృగాలని, ఘటనను ఖండించేందుకు మాటలు రావడం లేదని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

పార్లమెంటే 'సుప్రీం'

(మొదటిపేజీ తరువాయి)

సవరణలు చేయాలో నిర్ణయించుకునే పూర్తి హక్కు ఎంపీలకు ఉందన్నారు. దీని కంటే పైన ఎవరూ లేరన్నారు. 'ఎన్నికైన ప్రజాప్రతినిధులు జవాబుదారీతనంగా ఉండాలి. ఎమర్జెన్సీ విధించిన ప్రధాని అయినా సరే. ప్రజలకు రక్షణ కల్పించేందుకే ప్రజాస్వామ్యం. రాజ్యాంగపరమైన అంశాల్లో ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్స్. పార్లమెంట్ కంటే అత్యుత్తమమైనది ఉందని రాజ్యంగంలో ఎక్కడా లేదు. పార్లమెంటే సుప్రీం' అని ధన్కర్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ సమయం గురించి కూడా ప్రస్తావించారు. "ఎన్నికైన ప్రజా ప్రతినిధులు అన్నింటికీ జవాబుదారీగా ఉంటారు. అత్యవసర పరిస్థితిని విధించిన ప్రధానమంత్రి(ఇందిరా గాంధీ)ని కూడా జవాబుదారీగా ఉంచారు. ప్రజాస్వామ్యం అనేది ప్రజల కోసం మాత్రమే. అది ఎన్నికైన ప్రతినిధులకు రక్షణ కల్పించే ఓ భాండాగారం." అన్నారు.

రాష్ట్ర గవర్నర్ పంపిన బిల్లులకు రాష్ట్రపతి నిర్ణీత గడువులోపు సమ్మతి తెలపాలని సుప్రీంకోర్టు గడువు నిర్ణయిస్తూ ఇటీవల తీర్పునిచ్చింది. దీనిపై ధన్కర్ మాట్లాడుతూ... "రాష్ట్రపతికి గడువు నిర్దేశించేలా న్యాయవ్యవస్థ వ్యవహరించడం తగదు. ప్రజాస్వామ్యశక్తులపై అణుక్షిపణిని సుప్రీంకోర్టు ప్రయోగించరాదు. ఇప్పుడు.. శాసనాలు చేయగలిగే జడ్జీలు మనకు ఉన్నారు! కార్యనిర్వాహక విధులూ వారే నిర్వర్తించేస్తారు. సూపర్ పార్లమెంటులా వ్యవహరిస్తారు. వారికి మాత్రం ఎలాంటి జవాబుదారీతనం ఉండదు. ఎందుకంటే దేశ చట్టాలు వారికి వర్తించవు" అన్నారు. ఇదే అంశంపై బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే చేసిన వ్యాఖ్యలు మరింత వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. "ఒకవేళ సుప్రీంకోర్టు చట్టాలు చేస్తే గనుక.. పార్లమెంట్ భవనాన్ని మూసివేయాలి" అని ఎంపీ వ్యాఖ్యానించారు. అయితే బీజేపీ నేతల వ్యాఖ్యలను ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి.

పూర్తి న్యాయం చేయాల్సిన బాధ్యత సుప్రీంకోర్టుదే: సిబల్

ధన్కర్ వ్యాఖ్యలపై రాజ్యసభ ఎంపీ, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "చట్టాలను ఆమోదించడానికి పార్లమెంటుకు ప్లీనరీ అధికారం ఉంది. రాజ్యాంగాన్ని అర్థం చేసుకుని పూర్తి న్యాయం చేయాల్సిన బాధ్యత సుప్రీంకోర్టుకు ఉంది (ఆర్టికల్ 142)" అని స్పష్టం చేశారు. "కోర్టు చెప్పినదంతా మన రాజ్యాంగ విలువలకు అనుగుణంగా ఉంటుంది. జాతీయ ప్రయోజనాల ద్వారా మార్గనిర్దేశం చేయబడుతుంది" అని సిబల్ అన్నారు.

వ్యూహాత్మక బంధం బలోపేతం

(మొదటిపేజీ తరువాయి)

కాగలవని మోదీ ఆకాంక్షించారు. జెడ్డా విమానాశ్రయానికి చేరుకున్న మోదీకి ఆత్మీయ స్వాగతం లభించింది. సౌదీ గాయకుడు 'అయ్ వతన్' పాట ద్వారా స్వాగతం పలికారు. భారత సంతతి ప్రజలు విమానాశ్రయం వద్దకు చేరుకొని 'సారే జహా సే అచ్చా' పాట పాడి తమ దేశభక్తిని చాటుకున్నారు. రక్షణ, వాణిజ్య, పెట్టుబడి, ఇంధన రంగాల్లో తమ రెండు దేశాల మధ్య సహకారం పెరిగిందని, ప్రాదేశిక శాంతి, సామరస్యం, సుస్థిరత పెంపొందించడానికి కట్టుబడి ఉన్నట్లు మోదీ అంతకుముందు వెల్లడించారు. ఆయన జెడ్డాలో రెండవ వ్యూహాత్మక భాగస్వామ్య మండలి సమావేశంలో పాల్గొన్నారు. అయితే మోదీ సౌదీలో పర్యటించడం ఇది మూడవసారి అయినప్పటికీ జెడ్డా నగరాన్ని మొదటిసారి సందర్శించారు. సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఆహ్వానం మేరకు మోదీ అక్కడకు వెళ్లారు. భారత్‌కు ప్రధానులుగా ఉన్న వారు గత 70 ఏళ్లలో మూడుసార్లు మాత్రమే సౌదీలో పర్యటిస్తే... మోదీ ఒక్కరే గత ఎనిమిదేళ్లలో మూడు సార్లు ఆ దేశానికి వెళ్లడం గమనార్హం.

భూభారతితో భూ సమస్యల పరిష్కారం

విశాలాంధ్ర ప్రతినిధి–పెద్దపల్లి,సింగరేణి: నూతన ఆర్వోఆర్ చట్టం భూ భారతితో భూ సమస్యల పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం సెంటినరీ కాలనీ సింగరేణి కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో ఆయన జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా భూ సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం 2025 అమల్లోకి వచ్చిందని, ముందుగా రాష్ట్రంలోని 4 మండలాలలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ధరణిలో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్ , రామగిరి తహసీల్దార్ సుమన్, రైతులు, వివిధ వర్గాల ప్రజలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

విశాలాంధ్ర– తొర్రూర్ : వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ అన్నారు. మంగళవారం తొరూర్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలుసూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బందితోపాటు క్షేత్రస్థాయి సిబ్బందిని ప్రజలకు అందుబాటులో ఉండి, వడ దెబ్బకు గురి కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎవరైనా వడ దెబ్బకు గురైతె వారికి వెంటనే ప్రాథమిక చికిత్స చేసిన వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంనకు తరలించాలని ఆదేశించారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా సిబ్బంది విధులకు హాజరై ఆరోగ్య సేవలు అందించాలన్నారు. అదేవిధంగా యు పి హెచ్ సి లో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించి ప్రతిరోజూ హాస్పిటల్ కు వచ్చి హాజరు పట్టిక లో సంతకం చేసిన తరువాత మూమేంటు రిజిస్టర్లో టూర్ ఎక్కడికి వెల్లిది వ్రాసి వెళ్ల వలెనని ఆదేశించారు. ట్రునాట్ మిషన్లు పరిశీలించి దానికి సంబంధించిన సామాగ్రిని వెంటనే కనుగోలు చేసి అతి త్వరలోనే పనులు ప్రారంభించాలని వైద్యాధికారిని డాక్టర్ జ్వలిత ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్వలిత, దంత వైద్యు రాలు డాక్టర్ మీరాజ్ హెన, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ నందన, డిప్యూటీ సిబ్బంది కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ కుసుమ విద్యా సాగర్,వనాకర్ రెడ్డి డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్, సూపర్ వైజర్స్ కమల, మేరీ , రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.

పేదలకు సన్న బియ్యం పంపిణీ

విశాలాంధ్ర–వనపర్తి : జూబ్లీ హిల్స్‌లో నివాసం ఉండే ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు ఉన్నత వర్గాల ప్రజలు తినే సన్న బియ్యాన్ని సామాన్య ప్రజలు సైతం తినాలి అనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రములోని 3.10 కోట్ల మంది ప్రజలకు ఒక్కొక్కరికి నెలకు 6 కిలోల చొప్పున ఉచితంగా సన్న బియ్యం ఇవ్వడం జరుగుతుందని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు. మంగళవారం రేవల్లి మండలములోని పర్వతాలు అనే లబ్ధిదారుని ఇంట్లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలసి సహపంక్తి భోజనం చేశారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అందులో భాగంగానే చౌక ధర దుకా ణం ద్వారా పేద ప్రజలకు సన్న రకం బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని పర్వతాలును శాసన సభ్యులు ప్రశ్నించగా సన్న బియ్యం అన్నం ఎంతో రుచికరంగా ఉందని ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసిల్దార్ లక్ష్మి, ఇతర మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాయిప్రకాష్‌కు వైద్యుల నివాళి

విశాలాంధ్ర బ్యూరో –ములుగుజిల్లా : వెంకటాపురం మండల చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు చీడం సాయిప్రకాష్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఏటూరునాగారం సామాజిక వైద్యశాల వైద్యులు, సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు. వెంకటాపురం గ్రామానికి చెందిన చీడెం సాయిప్రకాష్ మృతి వార్తనువిని చాలామంది వృద్ధులు, గర్భిణులు, వికలాంగులు దుఃఖ సాగరంలో మునిగితేలారు. సాయి ప్రకాష్ బ్లడ్ బ్యాంక్, రక్త నిధికి అత్యవసర సమయాలలో పేషెంట్లకు కావలసిన రక్త నిధి, క్యాంపులను, ఏర్పాటుచేసి వెంకటాపురం మండలంలోని, ఒక మంచి సామాజిక సేవకుడిగా గుర్తింపు పొందాడు. స్వచ్ఛంద సంస్థ, కోవిడ్ సమయాలలో ఎంతోమంది గర్భిణులకు, వికలాంగులకు,వృద్ధులకు, తన స్వచ్ఛంద సంస్థ ద్వారా,క్యాంపులు ఏర్పాటు చేసి,ఎంతోమందికి రక్తాన్ని అందించి,ప్రాణదాతగా మారాడు. ఈనెల 15న కిడ్నాప్‌కు గురైన సాయి ప్రకాష్ మృతి చెందిన వార్త వెంకటాపురం, ఏటూరునాగారం విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఆసుపత్రి సూపెర్డింట్ సురేష్ కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భూభారతి చట్టంపై అవగాహన పెరగాలి :ఎమ్మెల్సీ

విశాలాంధ్ర,కొమురం భీం. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న కొత్త చట్టం భూ భారతితో రైతుల భూ సమస్యలకు పరిష్కారం చూపుతుందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. జిల్లాలో జైనూర్, లింగాపూర్,మండలంలో రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో మాట్లాడుతూ,భూ సంబంధిత సమస్యలతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని అటువంటివి తలెత్తకూడదనే ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చిందన్నారు. భూ సమస్యల మార్పులు చేర్పులు, మ్యుటేషన్, ఇతర సమస్యలకు భూభారతి చట్టం పరిష్కారంచూపుతుందన్నారు. ఈ చట్టం రైతులకే మాత్రమే కాదని, ఆఫీసర్లకు కూడా ధైర్యం ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జాయింట్ కలెక్టర్ డేవిడ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మేడారం మహా జాతర పనులు పూర్తిచేయాలి: మంత్రి

విశాలాంధ్ర బ్యూరో–ములుగుజిల్లా : వచ్చే సంవత్సరం ఫిబ్రవరి మాసంలో జరిగే మేడారం శ్రీ సమ్మక్క సారక్క మహా జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం చేపట్టే పనులు శ్వాస్వతంగా నిలిచేలా పనులు పూర్తి చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ – శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మహా జాతరకు ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.145 కోట్లు కేటాయించనున్నదని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధ్యక్షతన 2026 సంవత్సరంలో జరగనున్న మేడారం మహా జాతరను పురస్కరించుకొని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ గతంలో లాగా జాతరకు, రెండు నెలల ముందు పనులు ప్రారంభించి హడావుడిగా, పనులు పూర్తి చేయకుండా, కనీసం ఆరు నెలల సమయం తీసుకుని పూర్తి నాణ్యత పనులు ముగించాలని సూచించారు. వచ్చే సంవత్సరంలో మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరతో పాటు గోదావరి పుష్కరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ దివాకర్ టి.ఎస్., ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్ రెవిన్యూ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ములుగు డిఎస్పి రవీందర్, ఆర్డీఓ వెంకటేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, ఎఫ్ డి ఓ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలి

ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 80.12 శాతం సాధించి,రాష్ట్రంలో ములుగు జిల్లాను విద్యార్థులు మొదటి స్థానంలో ఉత్తమ ఫలితాలు సాధించడం హర్షించదగ్గ విషయం అని విద్యార్థిని, విద్యార్థులకు శుభాకాంక్షలు,జిల్లా యంత్రాం గానికి అభినందనలు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ – శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కతెలిపారు. మంగళ వారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జరిగిన సమావేశంలో మంత్రి ఇంటర్మీడియట్ లో ఉత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా కలెక్టర్ తో పాటు విద్యాశాఖ అధికారులను అభినందించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర జిల్లా –బ్యూరో మహబూబాబాద్: రైతు సంక్షేమం, భూ సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వ ముఖ్య లక్ష్యం మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి – చట్టం 25, అవగాహన సదస్సు మంగళవారం భూపతిపేట గ్రామ రైతువేదికలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మంచారి, రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి తదితరులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ తెలంగాణ గీతం ఆలపించి, పిపిటి, చదివి వినిపించి రైతులకు భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం – 2025పై అవహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న భూ భారతి నూతన ఆర్వోఆర్ చట్టమని, దాని ప్రకారం దరఖాస్తు చేసుకున్న భూ సమస్యలు కలిగిన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ గత ధరణి పోర్టల్ ద్వారా తాను కూడా స్వయంగా నష్టపోయానని, మన ప్రభుత్వం సామాన్య రైతులకు, ప్రజలకు న్యాయం జరిగే విధంగా ఉండేందుకు ముఖ్యమంత్రి ఈ భూభారతి నూతన రెవెన్యూ చట్టం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రైతులు, మహిళలకు, యువతకు, అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తుందన్నారు. చట్టం ద్వారా రైతులకు సామాన్య ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. రైతు ఆకుల రమేష్ అడిగిన ప్రశ్నలకు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ సమాధానం చెప్పి భూభారతి చట్టం ద్వారా సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, ఏడిఏ శ్రీనివాస్, స్థానిక తహసిల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ వీరస్వామి, సంబంధిత అధికారులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అధికారం లేకున్నా ప్రజల పక్షాన బీఆర్ఎస్

విశాలాంధ్ర –కారేపల్లి : అధికారం లేకున్నా కేసిఆర్ సారధ్యంలోనే బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షానే నిలబడుతుందని వైరా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ బాణోత్ చంద్రావతి అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ రజోత్సవ సభను నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల ప్రజలు,పార్టీ కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు.పార్టీ అధినేత,మాజీ సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని వీక్షించేందుకు సభా వేదిక ఇప్పటికే అన్ని పనులు పూర్తికావస్తున్నాయని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ 420 హామీలు,డిక్లరేషన్‌ల పేరుతో అధికారంలోకి వచ్చి వాటి అమలు మరిచి నేడు చెతికిల పడిందన్నారు. హామీలు అమలుకు నోచుకోలేదని, పొంతనలేని వాగ్దానాలు చేసి కొద్దికాలంలోనే ప్రజలలో అబాసుపాలు అయిందన్నారు. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనపై ప్రజలు ఇంకా డైలమాలో ఉన్నారని పేర్కొన్నారు. పథకాల పేరుతో కాలయాపన చేయడం తప్పితే వాటిని అమలు చేయడంలో పాలకులకు శ్రద్ధ లేదన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది బి ఆర్ఎస్ పార్టీ అని అలాంటి పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ప్రపంచ గమనాన్ని మార్చిన మహనీయుడు లెనిన్

విశాలాంధ్ర –ఖమ్మం : సిద్ధాంతం, ఆచరణ, పోరాటంతో ప్రపంచ గమనాన్ని మార్చిన మహనీయుడు విఐ లెనిన్ అని ఆయన మార్గం నేటికి ఆదర్శనీయమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. మార్క్స్ భావజాలంలోని విప్లవ సారాంశాన్ని సిద్ధాంతంగా కార్యచరణ రూపంలోకి తీసుకు వచ్చిన మహా మేధావి లెనిన్ అన్నారు. విఐ లెనిన్ 155వ జయంతి సందర్భంగా స్థానిక గిరిప్రసాద్ భవన్లో మంగళవారం లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ లెనిన్ కార్మిక, ఉత్పాదిక వర్గాలను సైద్ధాంతి కంగా, రాజకీయంగా చైతన్యం చేసి సాయుధులను చేశారన్నారు. అక్టోబర్ విప్లవం విజయవంతం తర్వాత కేవలం రష్యాకు – పరిమితం కాకుండా ప్రపంచ సోషలిస్టు పునర్నిర్మాణం, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నిర్మాణంపై దృష్టి సారించారని హేమంతరావు తెలిపారు. మారిన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో లెనిన్ మార్గం, ఆచరణ మరోమారు ఎజెండాపైకి వచ్చిందన్నారు. ఆర్థిక అంతరాలు పెరిగి సంపద అతి కొద్ది మంది చేతుల్లో పోగుపడుతున్న సమయంలో ప్రజలను చైతన్యం చేయాల్సిన బాధ్యత వామపక్ష లౌకిక –శక్తులపై ఉందన్నారు. సమాజాన్ని చీల్చే దిశగా మతోన్మాదం పెచ్చరిల్లుతుందని ఇటువంటి ప్రత్యేక పరిస్థితుల్లో ప్రజల పక్షాన పోరాడటమే లెనిన్కు ఇచ్చే సరైన నివాళి అన్నారు. నివాళు లర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, యర్రాబాబు, ఎస్కె జానిమియా, జిల్లా కార్యవర్గ –సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కె. శ్రీనివాస్, యానాలి సాంబశివరెడ్డి, ఎస్కె సైదా, చావా వెంకట్రావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కర్రెగుట్టను కేంద్రబలగాలు చుట్టుముట్టటాన్ని తక్షణమే ఆపాలి

విశాలాంధ్ర –బ్యూరో పెద్దపల్లి. కర్రెగుట్ట ను భారీగా కేంద్ర బలగాలు చుట్టుముడుతున్న వార్తలు వస్తున్నాయని ఈ ముట్టడిని ఆపాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. మావోయిస్టులు ఒకవైపు శాంతి చర్చలమైన ఆలోచిస్తున్న తరుణంలో కాల్పుల విషయం కోసం ప్రయత్నం జరుగుతున్న సమయంలో మావోయిస్టులపై దాడులు ఎన్కౌంటర్లు పూనుకోవడానికి తక్షణమే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు ఆదివాసులను మరణకాండ గురిచేస్తూ లక్షల ఎకరాల భూములలో ఖనిజ సంపదలను వనరులను స్వదేశీ విదేశీ పెట్టుబడిదారులకు అతి సౌకగా కట్టబెట్టడాన్ని జరుగుతున్న కుట్రను వ్యతిరేకించాలన్నారు. ఆదివాసిపై జరుగుతున్న మనోహమాన్ని వ్యతిరేకిస్తూ చత్తిస్గడ్ భాస్కర్ అమూల్ చర్ల తదితర ప్రాంతాల్లో ఆదివాసుల ముందుకు వచ్చారు. తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారని వారిని ఆదుపులోకి తీసుకొని, ఆదివాసులు 1/70 పె సా 2006 అటవీ హక్కుల చట్టం అటవీ హక్కుల బురియ కమిషన్లు వారు కోరుతున్నారు. వారి భూములను అడవులను అటీ సంపదను ఖనిజలను కార్పొరేట్లకు కట్టుబెట్టాడాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీనిని కేంద్ర ప్రభుత్వం పరిగణించకుండ వారిపై ఉక్కుపాదం మోపుతున్నది ఆశిస్తూ నిర్బంధాన్ని మరింత తీవ్రతం చేస్తున్నది కాదు ఆదివాసులు కూడా ఈ దేశ పౌరులే ఈ దేశ మూలవాసులు వారు అన్ని రకాలుగా వెనుకబాటుకు గురవుతున్నారు. ఆదివాసులు ఎలాంటి కలుముష లేని, కులమత విద్వేషం లేని, మూలవాసులైన ఆదివాసులపై కేంద్ర ప్రభుత్వం మోదీ –షాలు, అప్రకటిత యుద్ధం కొనసాగించడానికి తక్షణమే ఆపాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు.

కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర బ్యూరో – కొత్తగూడెం : ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో కొత్తగూడెం లోని కృష్ణవేణి కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి అగ్రస్థానంలో నిలిచారు. మంగళవారం ఇంటర్ మొదటి ఫలితాలు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో కొత్తగూడెం కృష్ణవేణి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు గాను %=%. భువన కృతి 468, బి. పవిత్ర 468 మార్కులతో రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానం లొ నిలిచారు. అదేవిధంగా ఇదే కళాశాలకు చెందిన ఎన్. చందన 467 మార్కులు సాధించి రెండవ స్థానాన్ని దక్కించు కుంది. ఈ దఫా ఫలితాల్లో విద్యార్థినులదే పైచేయిగా గెలిచింది. అదేవిధంగా ఇదే కళాశాలకు చెందిన బి. అనన్య 465, కె. పూజస్వి, 465, ఎండీ. ఆలియా నజ్రీన్ 465, కె. ఆర్య 465, యం. పరీష్ చౌదరి 465, పి. అఖిల్ 465, యం. లక్ష్మీ సాయి వర్ధన్ 465, రాష్ట్ర స్థాయిలో మార్కులు సాధించి కొత్తగూడెం కృష్ణవేణి కళాశాల పూర్వ వైభవాన్ని మరోసారి చాటి చెప్పారు. ఇంటర్ బైపీసీ ఫలితాల్లో సైతం ఈ కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ప్రతిభ చాటారు. బైపీసీలొ మొత్తం 440 మార్కులకు గాను జి. ప్రశస్త– 437, ఎన్. కరుణశ్రీ – 437, ఎండీ. ఆయేషా – 436, ఎండీ. జనేరా తమీన్ – 435, ఎస్ కె. తౌఫిక్ 434, బి. హేమశ్రీ –434, రాగిణి పాశ్వాన్ – 433, బి. సాయి కీర్తన – 432, ఎం.రూనే – 432, డి భవిత – 431, ఎస్ కె. అలిఫా– 431, జి స్పందన – 430, టి. పూజ – 430 మార్కులు సాధించారు. బైపిసి గ్రూపులో కూడా ఈ కళాశాలకు చెందిన ప్రశస్త, కరుణశ్రీ, అయేషా, జునేరా తమిమ్ లు మంచి మార్పులతో రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలిచారు. అదే విధంగా సీనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూపులో 1000 మార్కులకు గాను హాసిని – 994, ఏ. ప్రేమాంబిక – 993, ఎస్. సాయి సంజన 993, వై. స్ఫూర్తి –993, అత్యధిక మార్పులు సాధించి రాష్ట్రస్థాయి రికార్డును సృష్టించాడు. సీనియర్ బైపీసీ లో కూడా ఇదే కళాశాలకు చెందిన విద్యార్థిని అగ్రగామిగా నిలిచింది. 1000 మార్కులకు గాను బి. జ్యోత్స్న – 994 మార్కులు సాధించింది. ఇంటర్ ఫలితా లలో రాష్ట్రస్థాయిలో మార్కులు సాధించడమే కాకుండా ఇటీవల ప్రకటించిన జేఈఈ మెయిన్స్ – 2025 ఫలితాల్లో కూడా ఈ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఏ. శ్రీమ జాతీయ స్థాయిలో 132వ ర్యాంకు సాధించడం తొ ఈ కళాశాలకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు లభించింది. కాగా విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించెందుకు కృషిచేసిన అధ్యాపక బృందానికి యాజమాన్యం మనసారా కృతజ్ఞతలు తెలియచేసారు. రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను డైరెక్టర్లు మాచవరపు కోటేశ్వరరావు, గొల్లపూడి జగదీశ్, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కళాశాల డీన్ జి. రామారావు, ఏవో వై. వెంకట రమణ, అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందనలు తెలిజేశారు. ముస్ముందు మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షిస్తూ కళాశాలలో స్వీట్లు పంచి పండగ వాతావరణాన్ని తలపూంచారు. జిల్లా కేంద్రం కొత్తగూడానికి ఈ కళాశాల మరోసారి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తేవడంతో పట్టణ ప్రముఖుల్లో హర్షం వ్యక్తమౌతుంది.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వేలాదిగా తరలి రావాలి

విశాలాంధ్ర–నేరేడుచర్ల : ఈనెల 27న వరంగల్లో ఎల్కతుర్తిలో కేసీ ఆర్ సారధ్యంలో బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రజతోత్సవ సభకు హుజూర్నగర్ నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలి రావాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఒంటెద్దు నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం నేరేడుచర్లలో చలో వరంగల్ గోడ పెయింటింగ్ ప్రదర్శించారుయ. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అరిబండి సురేష్ బాబు, డిసిసిబి డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, సీనియర్ నాయకులు చెన్నబోయిన సైదులు,మాజీ మున్సిపల్ చైర్మన్ చందమల్ల జయబాబు, మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సైదులు, ఉపాధ్యక్షులు వస్కుల సుదర్శన్, రాపోలు నవీన్ కుమార్, పల్లెపంగు నాగరాజు,పంగ శ్రీను, పిచ్చి రెడ్డి, ఇంజమూరి రాజేష్, చిట్యాల శ్రీను, హుస్సేన్, ఆర్ సైదులు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రతిభ చాటిన ఆఫియా

విశాలాంధ్ర – కొత్తగూడెం అర్బన్ : కొత్తగూడెం జిల్లాలోని మైనారిటీ గురుకుల కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ప్రతిభ చాటారు. మంగళవారం ప్రకటించిన ఇంటర్ ఫలితల్లో కొత్తగూడెం మైనార్టీ గురుకులంలో జూనియర్ ఇంటర్ ఎంపీసీ చదువుతున్న చంద్రుగొండ మండలానికి చెందిన ఆఫియా 466 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటింది. సామాన్య కుటుంబంలో పుట్టిన అఫియా గడచిన ఏడాది టెన్త్ ఫలితాల్లో కూడా మండల టాపర్ గా నిలిచింది. ఇంటర్‌లో ఏకంగా రాష్ట్రస్థాయి ఫలితాలు సాధించటంతో జిల్లా వ్యాప్తంగా ముస్లిం మైనారిటీ వర్గాల నుంచి అభినందనలు వ్యక్త మౌతున్నాయి. అలాగే సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే షాబీర్ పాషా, ఉర్దూఘర్ అధ్యక్షులు నయీమ్ ఖురేషి, జిల్లా ముస్లిం సంఘాల నాయకులు ఎస్ఏ రబ్, జుబెర్ సాహెబ్ ఫారుఖ్ యజ్దాని, అబిద్ హుస్సేన్ తదితరులు ఆఫియాతోపాటు విద్యార్థులను అభినందించారు. చంద్రుగొండకు చెందిన లారీ డ్రైవర్ ఎంఏ. జావిద్, షాహిన్ దంపతులకు చెందిన రెండో కుమార్తె అయిన అఫియా రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించడంతో గ్రామస్తులతోపాటు కళాశాల ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు. విడుదల చేసిన ఇంటర్ ఫలితల్లో కొత్తగూడెం మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థుల ఎంపీసీ ఇంటర్మీడియట్ జూనియర్‌లో ఎండి. ఆఫియా కు 470 మార్కులకు గాను 466 సాధించింది స్టేట్‌లో మూడవ విద్యార్థిగా నిలిచింది. ఇదే కళాశాలకు చెందిన అంజూమ్ కౌసర్ 463/470, ఫస్ట్ బైపిసిలో స్టేట్ ర్యాంకు సాధించారు. కొత్తగూడెం మైనార్టీ గురుకుల కళాశాలలో మొత్తం మూడు స్టేట్ ర్యాంకులు సాధించగా, మొదటి సంవత్సరంలో 29 మంది 400 పైగా మార్కులు సాధించడం గమనార్హం.ఇంటర్ ఎంపీసీగ్రూప్ సీనియర్‌లో 11 మంది విద్యార్థులు 900 పైగా మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ చెప్పారు. రెండో సంవత్సరం ఎంపీసీ లో టీ.శ్వేత :983/1000, 2.ఎస్.కే తాజ్మ :973/1000 రాష్ట్ర స్థాయి మార్కులు సాధించారు. బైపీసీలో ఎస్. యామిని సుప్రియ 955/1000, శ్రీజ 952/1000, ముబీనా:948/1000 మార్కులు సాధించి కొత్తగూడెం మైనార్టీ గురుకులం ప్రతిష్టలు నిలబెట్టారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు రాష్ట్ర మైనార్టీ గురుకులాల సెక్రటరీ తాఫ్సీర్ ఇక్బాల్ తోపాటు జిల్లా మైనార్టీ అధికారి సంజీవరావు, అకాడమిక్ కోఆర్డినేటర్ అఫ్రోజ్, ఆర్. ఎల్.సి.అరుణకుమారి, ప్రిన్సిపాల్ బీపాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్పొరేషన్ ఏర్పాటుకు గెజిట్ జారీ

విశాలాంధ్ర – కొత్తగూడెం : కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుకు తుది అంకం ముగిసింది. కార్పొరేషన్ కు ఆమోదం తెలుపుతూ రాష్ట్ర గవర్నర్ మంగళవారం గెజిట్ జారీ చేసారు. నియోజకవర్గ పరిధిలోని కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలు, సుజాతనగర్ మండల పరిధిలోని కోమటిపల్లి, నిమ్మలగూడెం, మంగపేట, నాయకులగూడెం, సుజాతనగర్, నర్సింహసాగర్, లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీలను కలుపుతూ కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన కృషి తుది అంకానికి చేరినాట్లయింది. ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఆమోద తీర్మానం చేసిన చేసింది. ఈ తీర్మానంపై రాష్ట్ర గవర్నర్ మంగళవారం గెజిట్ జారీచేశారు. గెజిట్ జారీతో దాదాపు కార్పొరేషన్ ఏర్పాటు ప్రక్రియ పూర్తయినట్లే, త్వరలో ప్రభుత్వం నుంచి జివో జారీ కానుంది. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుపై గెజిట్ జారీ కావడంతో కొత్తగూడెం నియోజకవర్గ ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోంది. కార్పొరేషన్ ఏర్పాటుపై పట్టుబట్టి సాధించిన శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావుకు ప్రజల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్కకు, జిల్లా ఇంచార్జి మంత్రి కోమటి రెడ్డికి, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావుకు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్కు, ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి : సీపీఐ

విశాలాంధ్ర – కొత్తగూడెం క్రైమ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం 'మహాలక్ష్మి'పథకంతో నష్టపోయిన ఆటో, రవాణా రంగ కార్మికులకు ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు,సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా కోరారు. నష్ట నివారణగా ప్రతి కార్మికుడికి నెలకు రూ.12వేలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని చాతకొండ క్రాస్ రోడ్డులో ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నూతన అడ్డా ఏర్పాటు చేశారు. అడ్డా ప్రారంభం సందర్భంగా ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించిన అనంతరం జరిగిన కార్మికుల సమావేశంలో అయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు తరహాలో రవాణారంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జరుగుతున్న పోరాటాలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందనీ విమర్శించారు. ప్రజల సంక్షేమానికి అవసరమయ్యే చట్టాలు కాకుండా ఇబ్బందులకు గురిచేసే చట్టాలను తీసుకువస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రభుత్వం భీమా సౌకర్యం, పెన్షన్ పథకాలు అమలుచేసి కార్మికులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య, ఏఐటిసి జిల్లా కార్యదర్శి గెద్దాడి నగేష్, మాజీ కౌన్సిలర్లు భూక్యా శ్రీనివాస్, బోయిన విజయ్ కుమార్, పి. సత్యనారాణ చారి, గుత్తుల శ్రీనివాస్, మిర్యాల రాము, యూనియన్ జిల్లా కార్యదర్శి మర్రి కృష్ణ, ఉపాధ్యక్షులు ఆరెల్లి కృష్ణ, నాయకులు గాబ్రియేల్, ఎస్డి పాషా, గోవర్ధన్, సాయి, నరేష్, బాబూరావు, శ్రీనివాస గౌడ్, విజ్జి, బాబు రావు, చాతకొండ ఆటో కార్మికులు పాల్గొన్నారు.

సంపాదకీయం

తీవ్రవాదం ఎదుర్కోవడంలో దిశా రాహిత్యం

కశ్మీర్‌లో మంగళవారం మధ్యాహ్నం మళ్లీ తీవ్రవాదుల తూటాలు పేలాయి. 30 మంది మరణించారని అధికారులు ప్రకటించారు. కానీ మరో ఇద్దరిని తీవ్ర గాయాలతో అనంత నాగ్ ఆసుపత్రిలో చేర్పించారని అందువల్ల మృతుల సంఖ్య పెరగొచ్చునని అనుమానిస్తున్నారు. మరో ఇద్దరిని దగ్గరలోని వైద్య కేంద్రానికి తీసుకెళ్లారని వారి పరిస్థితి మెరుగ్గానే ఉందని చెప్తున్నారు. కాల్పులు జరిపిన వారు తీవ్రవాదులు అంటున్నారు. దక్షిణ కశ్మీర్ లోని పెహల్గాం లోని బైసరం పచ్చిక బయళ్లలో ఒక రిసార్టు దగ్గర తీవ్రవాదులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారంటున్నారు. ఈ ప్రాంతానికి అయితే కాలి నడకన వెళ్లాలి లేదా గుర్రం మీద వెళ్లాలి. పహల్గాం పర్యాటక కేంద్రం. అక్కడ స్వచ్ఛమైన జలాలతో కూడిన సరస్సులు, విశాలమైన పచ్చిక బయళ్లు ఉంటాయి. ప్రతి వేసవిలోనూ వేలాది మంది పర్యాటకులు పహల్గాం వస్తుంటారు. పైగా ఇది పర్యాటనం చురుకుగా సాగే సమయం. అదీగాక అమర్ నాథ్ యాత్రకు వెళ్లే వారు తమ పేర్లు నమోదు చేసుకునే సమయం ఇది. జులై మూడు నుంచి 38 రోజులపాటు అమర్ నాథ్ యాత్ర సాగుతుంది. ఈ దాడి దుర్మార్గమైందని షరా మామూలుగా ప్రకటనలు వెలువడుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో టెలిఫోన్లో మాట్లాడారట. అమిత్ షా కశ్మీర్ పయనమయ్యారట. ఆయన ఈ కిరాతకమైన దాడి జరిగిన ప్రదేశానికి వెళ్తారో తెలియదు కానీ అధికారులతో సమీక్షా సమావేశం మాత్రం నిర్వహిస్తారు. కొద్ది రోజుల కిందే అమిత్ షా కశ్మీర్ లో పర్యటించి ఉన్నతాధికారులు, భద్రతా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో ఎలాంటి కట్టుదిట్టాలు చేయాలనుకున్నారో, ఏ మేరకు చేశారో తెలియదు కాని మంగళవారం ఘోరం మాత్రం జరిగిపోయింది. ఇటీవలి కాలంలో పౌరుల మీద జరిగిన తీవ్రవాద దాడుల్లో ఇది ఘోరమైందని చెప్తున్నారు. హోం మంత్రి అమిత్ షా దాడి చేసిన తీవ్రవాదులను వదిలిపెట్టేదే లేదంటున్నారు. పోలీసు డైరెక్టర్ జనరల్ తోనూ, ఇతర భద్రతా అధికారులతోనూ మాట్లాడానని ఆయన అన్నారు. సాధారణంగా కశ్మీరీలు పర్యాటకులకు మనఃస్ఫూర్తిగా స్వాగతం పలుకుతారు. పర్యాటకులు పెరిగే రోజుల్లో ఘాతుకాలు జరగడం కేంద్ర ప్రభుత్వ నిర్వహణా లోపం కిందే లెక్క. పర్యాటకుల భద్రత నిస్సందేహంగా ప్రభుత్వ బాధ్యత. భవిష్యత్తులో ఇలాంటి కిరాతకాలు జరగనివ్వం అన్న గట్టి భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత. దాడులకు పాల్పడడం తీవ్రవాదుల పిరికితనానికి ప్రతీక లాంటి ఊకదంపుడు ప్రకటనలు పాలకుల అసమర్థతకు చిహ్నం.

తీవ్రవాదుల కుతంత్రాలు ఎన్నటికీ సఫలం కావు లాంటి రొడ్డ కొట్టుడు మాటలు సాక్షాత్తు ప్రధానమంత్రి మోదీ నోటి నుంచి రావడం ఆయన 56 అంగుళాల ఛాతీకి ప్రతీక కాదు. అసమర్థకు అది స్పష్టమైన సంకేతం. తీవ్రవాదులను శిక్షిస్తాం, బాధితులకు సహాయం చేస్తాం లాంటి మాటలేవీ ప్రభుత్వం సమర్థకు నిదర్శనమూ కాదు, బాధితులకు న్యాయం చేసినట్టు కాదు. తీవ్రవాదుల చేతిలో అమాయక జనం బలైపోతున్నప్పుడు వారికి న్యాయం కలగ జేయడం అంటే తీవ్రవాదుల మీద చర్య తీసుకోవడం మాత్రమే మార్గం కాదు. భవిష్యత్తులో ఇలాంటివి జరగనివ్వబోం అని చెప్పడం కంటి తుడుపు మాటలకన్నా మించినవి ఏమీ కావు. ఈ కిరాతకమైన దాడుల వెనక ఉన్న వారిని వదిలిపెట్టబోం, సహించబోం లాంటి మాటలు ట్విట్టర్ ద్వారా పలికినంత మాత్రాన ఒరిగేదేమీ ఉండదు. తీవ్రవాదులు ప్రధానమంత్రి ట్విట్టర్ ను చూసి దాడులకు తెగబడరు. ఆ హెచ్చరికలను వారు పట్టించుకోరు. ఈ దాడుల వెనక ఉన్న వారిని శిక్షిస్తాం అని ప్రకటించడం మోదీ మాటలు ఎవరిని ఉద్దేశించినవో సులభంగానే గ్రహించవచ్చు. "లోపలికి చొరబడి దాడి చేస్తాం" లాంటి హుంకరిపులు కేవలం తాటాకు చప్పుళ్ల కిందే మిగిలిపోతున్నాయి. ప్రతి దాడినీ పాకిస్థాన్ కు అంటగట్టడం నిష్ప్రయోజనకారం. పాక్ పాత్ర ఉందని ప్రతి సారీ చెప్పడం, తగిన సాక్ష్యాధారం చూపించలేక పోవడం మన హుంకరింపులలోని డొల్ల తనానికి మాత్రమే ప్రతీక. తీవ్ర వాదులను ప్రోత్సహించడం పాకిస్థాన్ నైజం కావచ్చు. అందులో ఎంతో కొంత వాస్తవమూ ఉండొచ్చు. అలాంటి ప్రోత్సాహం ఇదివరకే అనేక సార్లు అనుభవంలోకి వచ్చినప్పుడు చేసిందేముంది కనక! ఈ తీవ్రవాదం దశాబ్దాలుగా కొనసాగుతోంది. కశ్మీర్ కు వర్తించే 370వ అధికరణంవల్లే అక్కడ తీవ్రవాదం పెచ్చరిల్లిపోతోందని ఆ అధికరణాని రద్దు చేసే బిల్లు ప్రవేశపెట్టే సమయంలో హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఆ అధికరణం రద్దు తరవాత తీవ్రవాదం గణనీయంగా తగ్గిన సూచనలెక్కడా లేవు. ఆ అధికరణాన్ని రద్దు చేసి ఆరేళ్లు కావొస్తోంది. తీవ్రవాద సంఘటనలు ఆగిపోయాయని చెప్పడానికి దాఖలాలే లేవు. పౌరుల మీద, భద్రతా దళాల మీద అడపాదడపా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. 370వ అధికరణమే తీవ్రవాదానికి కారణం అయి ఉంటే గత ఆరేళ్ల కాలంలో తీవ్రవాదం తగ్గి ఉండాలిగదా! తీవ్రవాదుల మీద మరింత కఠినమైన చర్యలు తీసుకుంటామని మోదీ కన్నెర చేసి చెప్తున్నారు. ఆ సంకల్పం నెరవేరిన దాఖలాలు ఎందుకు కనిపించడం లేదు అని ప్రశ్నించే వారు లేరనుకుంటే ఎలా! పుల్వామాలో తీవ్రవాదుల దాడిలో 40 మంది జవాన్లు అమరులైనప్పుడు ఆ సమాచారం అందించడానికి అప్పటి కశ్మీర్ గవర్నర్ ఎంత ప్రయత్నించినా మోదీ అందుబాటులోకి రాలేదు. అప్పుడు ఆయన జిమ్ కార్బెట్ జాతీయ పార్కులో తిరుగుతూ ఏదో డాక్యుమెంటరీ షూటింగ్ లో ఉన్నారు. ప్రధానమంత్రి హోదాలో అలాంటి షూటింగుల్లో పాల్గొనకూడదని ఎక్కడా లేదు. కానీ మరి గవర్నర్ కు కూడా అందుబాటులో లేకపోవడం విశ్రాంతే ఎరుగను అని ప్రధాని చెప్పే మాటలకు విలువేముంటుంది? ఇప్పుడు మోదీ సౌదీ అరేబియా పర్యటనలో ఉన్నారు. ప్రజల ప్రాణాలపై ఆయనకు సుతి మెత్తని భావాలే ఉంటే ఆ పర్యటన తక్షణం రద్దు చేసుకుని తిరిగి రాలేదుగా. స్వయంగా పరిస్థితిని పరిశీలించి తన సామర్థ్యాన్ని నిరూపించుకున్న నిదర్శనాలే లేవుగా! పహల్గాం కిరాతక దాడికి బాధ్యులైన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వారి మీద కఠినమైన చర్య తీసుకుంటాం, ఈ దాడికి పాల్పడిన వారు కఠినమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది అని అమిత్ షా గంభీరమైన ప్రకటనలు చేస్తున్నారు. అంటే తీవ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ఆయన ఎంచుకున్న మార్గం ఎంతటి నిరుపయోగమైందో ఎన్నిసార్లు రుజువు కావాలి? కశ్మీర్ తీవ్రవాదుల ఆగడాలు పాకిస్థాన్ గుప్పెట్లో ఉన్నాయని, వారిని విడిచిపెట్టే సమస్య లేదని పదే పదే ప్రకటించడం చూస్తే తీవ్రవాదాన్ని ఎదుర్కోవడానికి మోదీ ప్రభుత్వానికి కొత్త ఆలోచనలే లేవనిపిస్తోంది.

నిబద్ధత గల కమ్యూనిస్టు పుప్పాలదొడ్డి వెంకటేశ్వర్లు

బి.సురేంద్ర కుమార్

నిబద్ధత గల కమ్యూనిస్టు నాయకులు పుప్పాలదొడ్డి బండమీద వెంకటేశ్వర్లు. కమ్యూనిస్టు విలువలకూ, త్యాగానికి, ఆదర్శాలకూ, నిలువెత్తు నిదర్శనం ఆయన విప్లవ రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. తన జీవన గమనంలో జనమే తప్ప వ్యక్తిగతంలేని అలుపెరగని కమ్యూనిస్టు ఎర్ర సూరీడాయన. భూస్వాములు, పెత్తందార్లకు సింహస్వప్నం. పేద ప్రజల గుండెల్లో ఓ నమ్మకం, తమకు కష్టం వస్తే వెంకటేశ్వర్లు ఉన్నాడనే ఓ ధైర్యం. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పూర్వపు పత్తికొండ తాలూకా కారుమంచి ఫిర్కా (ప్రస్తుతం ఆస్పరి మండలం, ఆలూరు నియోజకవర్గం) పుప్పాలదొడ్డి గ్రామంలో పక్కీరప్ప, నాగమ్మ దంపతులకు జన్మించారు. ఆయన 5 వ తరగతి వరకు వారి తల్లిగారి గ్రామమైన అలారుదీన్నేలో 6, 7 తరగతులు మండల కేంద్రమైన దేవనకొండలో చదువుకున్నారు. పుప్పాలదొడ్డి ఓ చిన్న గ్రామం. కైరుప్పల, పుప్పాల దొడ్డి, చెన్నంపల్లి గ్రామాలు కలసి కైరుప్పల గ్రామ పంచాయతీ. కైరుప్పల చాల పెద్ద గ్రామం. ఆ గ్రామంలో రెడ్డి, కరణములు ఆధిపత్యం ఉండేది. ఆ గ్రామంలో భూస్వాములు, పెత్తందార్లకు వేలాది ఎకరాల భూమి ఉండేది. వర్షం వస్తే ఆ మూడు గ్రామాల్లోని రైతులు, కూలీలు భూస్వాములు,పెత్తందార్ల పొలాలలో మొదట విత్తనం వేయాలి. మా పొలాల్లో విత్తనం వేసుకోవాలి పదును పోతుంది అని రైతులు, కూలీలు తమగోడు వెళ్లబోసుకున్నా అలా కుదరదని తమ పొలాల్లో విత్తనం పూర్తి కావలసిందేనని హుకుం జారీ చేసేవారు. ఇది సహించలేని వెంకటేశ్వర్లు రైతులతో, కూలీలతో దండుకట్టి భూస్వాములు, పెత్తందార్లు పొలాల్లో వెట్టిచాకిరి చేయబోరని రైతులకు ఎర్రజెండా అండగా ఉంటుందని భూస్వాములు, పెత్తందార్లుతో తెగేసి చెప్పారు. అందుకు ఆగ్రహించిన భూస్వాములు, పెత్తందార్ల కుటుంబాలు వెంకటేశ్వర్లు అడ్డు తొలగించుకోవాలని పోలీసుల సహకారంతో అక్రమకేసులు బనాయించడం మొదలు పెట్టారు.

42 సంవత్సరాల వయసులోనే భూస్వాములు, పెత్తందార్లు చేతుల్లో హత్యకు గురైన కమ్యూనిస్టు యోధుడు పుప్పాల దొడ్డి బండమీద వెంకటేశ్వర్లు. ఆయనను 23.04.1984 న కైరుప్పల గ్రామములో భూస్వాములు, పెత్తందార్లు (వర్గ శత్రువులు) హత్య చేశారు. వెంకటేశ్వర్లు హత్య జరిగినప్పుడు ఒక్కసారిగా పత్తికొండ తాలూకా ఉలిక్కిపడింది. కారుమంచి ఫిర్కాలోని గ్రామాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. 1960-80 వ దశకంలో కారుమంచి ఫిర్కా ప్రాంతంలో భూస్వాములు, పెత్తందార్లు పేద ప్రజల పట్ల చాలా దుర్మార్గంగా ప్రవర్తించేవారు. అది సయించలేని వెంకటేశ్వర్లు ఎర్రజెండా చేతబట్టి అ ప్రాంతంలో పేద ప్రజలను ఐక్యం చేశారు. కైరుప్పల గ్రామంలో చిక్క ఈరన్న, బంట్రోతు నరసమ్మ, టీచర్ సుల్లన్న, గొల్ల కేసవయ్య, బిల్లేకల్లు గ్రామంలో తెలుగు బాలన్న, హరిజన బీమన్న, వలగొండ గ్రామంలో కొండమీద సంజన్న, డి.కోటకొండ గ్రామంలో దుబ్బ రాముడు, ములుగుందం గ్రామంలో దస్తగిరి, దొడగొండ గ్రామంలో నల్లన్న, బైలుపత్తికొండ గ్రామంలో తిక్కయ్య లతో కలసి కమ్యూనిస్టు పార్టీని కారుమంచి ఫిర్కాలో రూపకల్పన చేశారు. వెంకటేశ్వర్లు కమ్యూనిస్టు పార్టీలో సభ్యులు కాక ముందు ఆ ప్రాంతంలో భూస్వాములు, పెత్తందార్లు పేదలపై చేసే అన్యాయాలను, అక్రమాలను ఎదిరించాడు, ఇది తప్పు అని భూస్వాములును,పెత్తందార్లును ప్రశ్నించడాన్ని జీర్ణించుకోలేని భూస్వాములు దేవనకొండ పోలీసు స్టేషన్‌లో వెంకటేశ్వర్లుపై అక్రమ కేసు బనాయించారు. వెంకటేశ్వర్లును అరెస్టు చేయడానికి దేవనకొండ ఎస్ఐ రోషన్ పుప్పాలదొడ్డి గ్రామానికి వెళ్లి బలవంతంగా వెంకటేశ్వర్లును అరెస్టు చేయడానికి ప్రయత్నించారు. ఎస్ఐపైన వెంకటేశ్వర్లు తిరగబడి యస్.ఐ.ని కింద పడవేసి బాగా కొట్టి వెళ్ళిపోయారు. ఎస్ఐపైన చేయిచేసుకుంటావా అని పోలీస్ డిపార్టుమెంటు చాలా సీరియస్ యాక్షన్ తీసుకోవాలని భావించింది. ఈ తరుణంలో వెంకటేశ్వర్లును వెతకసాగింది.

ఆ సమయంలో వెంకటేశ్వర్లు చెల్లెలు గ్రామమైన హోసూరు గ్రామంలో తలదాచుకొని పత్తికొండలోకి వస్తు ఉంటే పత్తికొండ పట్టణంలోని కమ్యూనిస్టు పార్టీ నాయకులు డాక్టరు నాగప్ప ఇంటి దగ్గర అప్పటి కమ్యూనిస్టు పార్టీ కర్నూలు జిల్లా కార్యదర్శి వై. స్వామిరెడ్డి, పత్తికొండ తాలూకా కార్యదర్శి చదువుల రామయ్య, నలక దొడ్డి బత్తిన అంజినేయులు, డాక్టరు నాగప్పలు వున్నారు. వారిలో యస్.ఐ అరెస్టు చేయడానికి వస్తే యస్ఐని కొట్టినట్టు చెప్పగా వై.స్వామి రెడ్డి, చదువుల రామయ్యలు పత్తికొండ సి.ఐ. కి మా పార్టీ కార్యకర్త పైన దేవనకొండ యస్.ఐ.రోషన్ అక్రమ కేసు బనాయించారు అని యస్.ఐ. పైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. దాంతో పత్తికొండ సి. ఐ. దేవనకొండ యస్.ఐ.ని స్వామి రెడ్డి, చదువుల రామయ్య, వెంకటేశ్వర్లు సమక్షంలో తప్పుడు కేసు ఎందుకు పెట్టారు అని మందలించి రాజీ చేశారు. యవ్వనంలోనే కమ్యూనిస్టుగా మారాడు. పత్తికొండ తాలూకా కేంద్రంగా చేసుకొని పార్టీ కార్యక్రమాలలో పాల్గొంటు పనిచేసేవారు. ఆ రోజుల్లో పత్తికొండ తాలూకాలోని తుగ్గలి, మద్దికెర, పత్తికొండ, దేవనకొండ, గోనెగండ్ల ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పత్తికొండ తాలూకా కార్యదర్శిగా, సీపీఐ జిల్లా సమితి సభ్యులుగా పనిచేశారు. నిజాయితీ, నిబద్ధత ఆత్మవిశ్వాసంతో ప్రజల కొరకు పని చేసిన నిఖార్సైన విప్లవకారుడు వెంకటేశ్వర్లు. ఆయన జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శనీయం. భౌతికంగా మన మధ్య లేకపోయినా చరిత్ర పుటలలో సజీవంగా నిలిచిపోయే వ్యక్తులు కొందరే ఉంటారు. అలాంటి అరుదైన వ్యక్తులలో వెంకటేశ్వర్లు ఒకరు. ఆయన ఆశయ సాధన కోసం అంకిత భావంతో పనిచేస్తూ ముందుకు సాగడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి. ఆయన హత్యకుగురై 41 సంవత్సరాలైనా నేటికీ ప్రజల హృదయాలలో బతికే వున్నారు.

(నేడు 41వ వర్ధంతి సభ సందర్భంగా)

సీనియర్ న్యాయవాది
సెల్. నెం:9395361735

వ్యవహారిక భాషోద్యమంలో ఆంధ్ర విశ్వకళాపరిషత్

డాక్టర్ జీకేడీ ప్రసాదరావు

ఆంధ్ర విశ్వకళాపరిషత్ అవతరణలో మొదటి విభాగం తెలుగు భాషా, సాహిత్యాలు. ఆ తర్వాతే తత్త్వశాస్త్రం, అర్థశాస్త్రం మిగతా శాఖల ఏర్పాటు జరిగింది. అందుకే ఆంధ్ర విశ్వ కళాపరిషత్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వ్యవహారిక భాషోద్యమం గురించి ప్రస్తావన తీసుకురావలసి వచ్చింది. వ్యవస్థాపక ఉపకులపతి 'కవిత్వతత్త్వవిచారం' ఆధునిక శాస్త్రవిమర్శ పద్ధతిలో గ్రంథం రాశారు. తెలుగు భాషకు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్ వ్యవస్థాపనకు అవినాభావ సంబంధం వుంది. తెలుగు వ్యవహారిక భాషోద్యమం ఇక్కడ ప్రజల సామాజిక, రాజకీయ, సాంస్కృతిక నేపథ్యాల నుంచి పుట్టుకొచ్చింది. ఈ ఉద్యమకర్త గిడుగు రామ్మూర్తి పంతులు ప్రాచీన, ఆధునిక తెలుగు భాషల మీద పట్టుగల భాషాశాస్త్రవేత్త. ఈయన ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందినవాడు. పుట్టుక శ్రీకాకుళం జిల్లా. తన భాషా ఉద్యమ కార్యక్రమాలన్నీ విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి నుంచి నిర్వహించారు. ప్రభుత్వ, న్యాయ వ్యవహారాల కోసం మద్రాసుకి ఎక్కువగా రాకపోకలు నిర్వహించేవారు. సవర జాతిని విద్యావంతుల్ని చేయడం కోసం ఆయన ఆ భాష నేర్చుకొని నిఘంటువు కూడా రాశారు. విద్యకు దూరంగా వున్న ప్రజలకు ప్రయోజనం చేకూర్చేందుకు ఆయన జీవితాంతం కృషి చేశారు. ఈ నేపథ్యంలోనే గిడుగు రామ్మూర్తి పంతులు కాకినాడ సభలో వ్యవహారిక భాష లౌకిక భాష వంటిదని ప్రకటించారు. తెలుగు కావ్యాన్ని కూడా సంస్కృత పండితుల మెప్పుకోసం రాసే కవులను ఆయన నిరసించారు. "ఇక్కడి సామాన్య ప్రజానీకం మాట్లాడే భాషను పండితులు మాకు చెప్పడం లేదు." అనే సి.పి.బ్రౌన్ మాటలను గిడుగు రామ్మూర్తి పదేపదే చెప్పారు. "ఊరి బయట చిన్నచిన్న గుడిసెలే కడజాతివాళ్ళ బడులు, అక్కడే వాళ్ళు అక్షరాలు నేర్చుకోవాలి. వారికి గ్రాంథిక రూపాలు నేర్పడంలో ఎంత కాలం వ్యర్థం చేస్తున్నారో నేను గమనించాను" అని 1906లో పరీక్షల పరిశీలన ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన యేట్స్ అన్నారు. ఆయన పరిశీలనలో అట్టడుగు ప్రజానీకానికి చదువును దూరం చేస్తున్న కుట్ర బయటపడింది.

గురజాడ అప్పారావు 1892 లో రాసిన 'కన్యాశుల్కం' నాటకంతో తెలుగు సమాజాన్ని సంస్కరించే ప్రయత్నం చేశారు. దీనితో పాటు తెలుగు భాషా, సాహిత్యాలను సంస్కరించారు. 1910 లో రాసిన 'ముత్యాల సరాలు' గేయకావ్యం, 1912 లో రాసిన 'లవణరాజు కల' కావ్యం తెలుగు సమాజానికి సంస్కరణ దృష్టి అలవాటు చేసింది. ఈ రచనలన్నీ ప్రజల భాషలోనే సాగాయి. ప్రజల్ని ఆధునికత వైపు ప్రభావితం చేశాయి. ఈ సాహిత్యం సామాజిక, రాజకీయ, సాంస్కృతిక ఉద్యమాలకు మద్దతుగా నిలిచాయి. దీనికి ఒక దశాబ్దం ముందే డా.కట్టమంచి రామలింగారెడ్డి రచించిన "ముసలమ్మ మరణం" 1900 లో అచ్చయింది. ఈ చంపూ కావ్యం తెలుగు సాహిత్యంలో కొత్త ఒరవడిని సృష్టించింది. సీపీ బ్రౌన్ రాసిన 'అనంతపురం చరితము' నుంచి ముసలమ్మ అనే ఒక గ్రామ మహిళ త్యాగమయ గాథను మూలంగా తీసుకున్నారు. ఈ కావ్యంలో ఆధునిక భావజాలంతో సంఘసంస్కరణ వస్తువుగా వుంది. ఆ తర్వాత పాతికేళ్లకు సి.ఆర్. రెడ్డిని మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర విశ్వ కళాపరిషత్‌కు ఉపకులపతిగా నియమించింది. భాషా, సాహిత్య ఉద్యమాలకు ఆంధ్ర విశ్వద్యాలయం విజ్ఞాన వేదికగా అవతరించింది.

ఎ.వి.ఎన్. కళాశాల ప్రిన్సిపాల్ పి.టి. శ్రీనివాస అయ్యంగార్ సలహా మేరకు యేట్స్ గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి పంతులుతో చర్చించిన తర్వాత శిష్ట వ్యవహారికం అమల్లోకి వచ్చింది. యేట్సు అధ్యక్షతన పి.టి. శ్రీనివాస అయ్యంగార్ తెలుగు రిఫార్మ్ సొసైటీని స్థాపించారు. మద్రాసు స్కూల్ ఫైనల్ బోర్డు కార్యదర్శి 1912 సెప్టెంబర్ 21 న తొలిసారిగా వ్యవహారిక తెలుగులో పరీక్షలు రాసుకోవచ్చని ఆదేశించారు. గ్రాంథికవాదుల కుట్రతో ప్రభుత్వం ఉత్తర్వులు ఉపసంహరించుకుంది. 1936లో సాహిత్య పరిషత్తు, తాపీ ధర్మారావు 'జనవాణి' పత్రికల్లోనూ వ్యవహారిక భాషను సమర్థిస్తూ వ్యాసాలు ప్రచురించారు. భాషాపరంగా సమాజంలో వచ్చిన మార్పును, స్పృహను, సామాజిక చైతన్యాన్ని గమనించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీగ్విన్ సంఘాన్ని నియమించింది. ఈ సంఘం శిష్ట వ్యవహారికంలో రచనలు సాగించడానికి ఒక ప్రభుత్వ అధీనసంస్థ అవసరమని భావించింది. పరిపాలన భాషగా వాడుకభాష వుండాలని ఆంధ్రప్రదేశ్ అధికార భాషాకమిషన్ పేర్కొంది.

భాషా ఉద్యమాలు సంఘసంస్కరణకు ఊతమిచ్చాయి. గిడుగు రామ్మూర్తి పంతులు నిర్వహించిన వ్యవహారిక భాషోద్యమాన్ని గురజాడ అప్పారావు సమర్థించారు. ఆయన సాహిత్యంలో వాడిన భాష వ్యవహారిక భాషోద్యమ విజయానికి అండగా నిలబడింది. అంటరానితనం నిషేధం, బాల్య వివాహాల నిర్మూలన, వితంతు పునర్వివాహాలు, వరకట్నం, కన్యాశుల్కం మొదలయిన సామాజిక దురాచారాలను నిర్మూలించే కార్యక్రమాలకు వ్యవహారిక భాషే సరైంది. అలాగే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాపనకు దోహదం చేసింది. సరిగ్గా వ్యవహారిక భాషోద్యమం వేడిగా సాగుతున్న సమయంలోనే ఇది జరిగింది. ఆ తర్వాత గిడుగు వేంకటరామ్మూర్తి పంతులకు 1938 లో కళాప్రపూర్ణ గౌరవ డాక్టరేటును సైతం ప్రదానం చేసింది. ఈ నేపథ్యంలో 1955 లో తెలుగును అధికార భాషగా అమలు చేయాలని శాసనసభ తీర్మానించింది. వావిలాల గోపాలకృష్ణయ్య అధ్యక్షునిగా ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం ఏర్పడింది. తర్వాత ఈ సంఘం తెలుగు అకాడమి ఏర్పాటుకు సిఫార్సు చేసింది.



దీనికి మొదటి అధ్యక్షునిగా పీవీ నరసింహారావు నియమితులయ్యారు. శాసన నిర్మాణంలో శిష్ట వ్యవహారిక భాష అవసరమని నిర్ణయించారు. విశ్వవిద్యాలయాల్లో దీనిపై శిక్షణ కార్యక్రమాలు జరగాలన్నారు.

పురిపండా అప్పలస్వామి వాడుక భాష అమలు గురించి ఆంధ్ర విశ్వ కళాపరిషత్ అకడమిక్ కౌన్సిల్‌లో 11 జనవరి 1971 లో రెండు తీర్మానాలు ప్రవేశపెట్టారు. తెలుగులో పిహెచ్.డి. కోసం సమర్పించే పరిశోధన వ్యాసాలు శిష్ట వ్యవహారికంలో రాసుకోవచ్చని తీర్మానించారు. అన్ని స్థాయిల్లో తెలుగు పరీక్ష పత్రాలకు సమాధానాలు వ్యవహారిక భాషలో రాయవచ్చని, అన్ని తరగతులకు పాఠ్య పుస్తకాలుగా వ్యవహారిక భాషలో వున్న గ్రంథాలు కూడా నిర్ణయించవచ్చని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన మేరకు నాటి ప్రభుత్వం ఉపకులపతి ఎమ్మార్ అప్పారావు అధ్యక్షతన ఒక అధ్యయన సంఘాన్ని నియమించింది. ఈ సంఘం 1973 జులై 5 న నివేదిక సమర్పిస్తూ, శిష్ట వ్యవహారిక భాష అమలుకు సిఫార్సు చేసింది. అటు శ్రీగ్విన్ కమిటీ, ఎమ్మార్ అప్పారావు కమిటీ రెండింటి సిఫార్సుల ఫలితంగా తెలుగుభాషకు సంబంధించి ప్రామాణిక భాష శిష్ట వ్యవహారికం అన్నారు. దీనిని పురిపండా అప్పలస్వామి ఆంధ్ర విశ్వ కళాపరిషత్ అకడమిక్ కౌన్సిల్‌లో ప్రతిపాదించారు. తర్వాత ఈ నిర్ణయం అమల్లోకి వచ్చింది. నాటి విద్యా విషయక వ్యవహారాల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్ణయాలు, అభిప్రాయాల కోసం ప్రభుత్వాలు ఎదురు చూసిన సందర్భాలు చాలానే వున్నాయి. ఇతర సబ్జెక్టులకు సంబంధించి అంతర్జాతీయ విద్య, పరిశోధన, ఉపాధి దృష్ట్యా పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యలో యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ ఇంగ్లీషు మాధ్యమాన్ని నిర్దేశిస్తూ నియమావళి విడుదల చేసింది. ఈ నిర్ణయాన్ని దేశవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాలు అమలు చేశాయి.

1975 లో అప్పటి ఉప కులపతి డాక్టర్ ఎం.ఆర్. అప్పారావు ఆంధ్ర విశ్వ కళాపరిషత్ శిష్ట వ్యవహారిక భాష వాడకం మీద గల నిషేధాన్ని ఎత్తేశారు. ఎవరికి ఇష్టమైన భాషలో వారు రాసుకోవచ్చని అనుమతించారు. సజీవ భాషతోనే విజ్ఞానం సాధించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. నాడు ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా ఇటువంటి నిర్ణయాలు వెలువడ్డాయి. ఈ నిర్ణయాలే శాసనాలుగా అవతరించి తెలుగు భాషా వికాసానికి తోడ్పాటు అందించాయి. మొదటి నుంచి భాషా, సాహిత్యాలతో ఆంధ్ర విశ్వవిద్యాలయం పెనవేసుకుని పయనిస్తూనే వుంది. ఈలోపల తెలుగు అకాడమీ మూడు సంపుటాలుగా పరిపాలన పదకోశం విడుదల చేసింది. వీటి తయారీలో ఆంధ్ర విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించింది. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం కూడా వెంట నడిచింది. యుజిసి సతీష్‌చందర్ కమిటీ సిఫార్సు మేరకు 1980 లో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు పరిశోధన విధానాలపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. దీనిలో వ్యవహారిక భాషలో సిద్ధాంత వ్యాసాల్ని సమర్పించుకోవచ్చని తీర్మానించారు. దీంతో తెలుగు భాష, సాహిత్యం, జానపద కళలను అధ్యయనం చేసి ఎంతోమంది పరిశోధక విద్యార్థులు వ్యవహారిక భాషలో సిద్ధాంత వాస్యాలు రాసి పిహెచ్.డి. డిగ్రీలు పొందారు. తెలుగు వాఙ్మయాన్ని సుసంపన్నం చేశారు. వ్యవహారిక భాష అమల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించింది.

తెలుగు వ్యవహారిక భాష ప్రజల భాషగా రాజ్యమేలుతుంది. అధికార భాషగా ప్రజలతోనే మమేకమై పోయింది. వార్తా పత్రికలు, ఎలక్ట్రానిక్ మాధ్యమాలు, సినిమా, టీవీ మాధ్యమాలు వ్యవహారికంలో, మాండలికంలో వాడుతున్నాయి. శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని భాషను జీర్ణం చేసుకుంది. నాడు వ్యవహారిక భాష అధికార భాషగా అమలు జరగడం కోసం గిడుగు రామ్మూర్తి పంతులు తన జీవితాన్ని అంకితం చేశారు. అయితే ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మొదటిగా వ్యవహారిక భాష అమలు జరగాలని ఆయన పరితపించారు. కాని అది జరగలేదు. గిడుగు మరణం తర్వాత ఆయన ఉద్యమ త్యాగాన్ని గుర్తించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం వ్యవహారిక భాషను అమలు చేయడానికి ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఆయన త్యాగాన్ని భాషా, సాహిత్యవేత్తలు కూడా గుర్తించారు. అందుకే ఆయన పుట్టిన రోజును తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నారు. గిడుగు వేంకట రామ్మూర్తి పంతులు ప్రతి అడుగును విజయపథంవైపు ప్రోత్సహించి ఆంధ్ర విశ్వవిద్యాలయం కీర్తి వహించింది. నాడు భాషా, కవితా ఉద్యమాలకు ఆంధ్ర విశ్వవిద్యాలయమే వేదికగా కొనసాగింది. విశాఖపట్నం సాహితీవేత్తల వేదికగా పేరొందింది. అభ్యుదయ కవిత్వోద్యమం, విప్లవ కవిత్వోద్యమం ఇక్కడే పుట్టాయి. ప్రజల భాషను గెలిపించడంలో, గిడుగువారి ఆశయాన్నే కాదు, గురజాడ ఆకాంక్షల్ని నెరవేర్చడంలోనూ ఆంధ్రవిశ్వవిద్యాలయం విశేషమైన కృషి చేసింది.

ఆంధ్ర విశ్వ కళాపరిషత్ కాలంతో పాటు అంతర్జాతీయ ఖ్యాతి పొందింది. ఇక్కడ దేశీయ విద్యార్థులే గాక, 59 దేశాల విదేశీ విద్యార్థులు వేలల్లో చదువుతున్నారు. అరబ్బులు, ఆఫ్రికన్లు, యూరోపియన్లు, పశ్చిమాసియా, ఇంకా చుట్టుపక్కల దేశాల విదేశీ విద్యార్థులు అందరూ ఇక్కడ చదువుకుంటున్నారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ఒక నమూనా ప్రపంచంగా వర్థిల్లుతోంది. నాటి వందల్లో విద్యార్థులు నేడు వేలల్లోకి పెరిగిపోయారు. నాటి మేధావుల కృషి ఈ రోజు ఎందరో మేధావుల్ని ప్రపంచమంతా విస్తరింపజేసింది. తెలుగు భాష విభాగంతో మొదలయిన ఈ విశ్వవిద్యాలయం ఇప్పుడు విదేశీ భాషలు, అన్ని సామాజికశాస్త్రాలు, అడ్వాన్స్ సైన్స్‌స్, ఇంజనీరింగ్, డిజిటల్, కృత్రిమ మేధలతో పాటు సకల శాస్త్రాల్లో బోధన, పరిశోధనలు నిర్వహిస్తుంది. ఈ క్రమంలో అంతర్జాతీయంగా కీర్తి పతాక ఎగురవేసిన ఆంధ్ర విశ్వవిద్యాలయం నేడు వందేళ్ల పండుగకు సిద్ధం కావడం ఎంతో ఆనందదాయకం.

ఫ్యాకల్టీ, జర్నలిజం అండ్ మాస్‌కమ్యూనికేషన్,
ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం
మొబైల్ : 9393111740

ప్రమాదంలో నగరాలు

డా.జ్ఞాన్ పాఠక్

భారతదేశ నగరాలు, ప్రజలు, ఆర్థిక వ్యవస్థ అత్యంత ప్రమాదంలో ఉన్నాయని ఆసియా, పసిఫిక్ ప్రాంత యునైటెడ్ నేషన్స్ ఎకనామిక్ అండ్ సోషల్ కమిషన్ 81వ సమావేశం నివేదిక తెలియజేసింది. ఈ కమిషన్ సమావేశం ఇటీవల జరిగింది. ముఖ్యంగా నగరాలు నీటి సమస్యను ఎదుర్కోనున్నాయి. నీటి సమస్యేకాకుండా అనేక సంక్షోభాలను పరిష్కరించలేనంతగా ఎదుర్కోనున్నాయని కమిషన్ నివేదిక వెల్లడించింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో రాజకీయాలు ఎంతమాత్రం నగరాలను పరిరక్షించుకోలేని స్థాయికి చేరవచ్చు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు, ప్రణాళిక, కార్యాచరణ మధ్య ఏమాత్రం సంబంధంలేకుండా ఉన్నది. పట్టణ, నగర ప్రాంతాలలో పెనుమార్పులు సంభవిస్తాయి.

దేశమంతటా అసాధారణమైన సంక్షోభం ఎర్పడే అవకాశంఉంది. ఆసియా, పసిఫిక్ ప్రాంతాలలో పట్టణప్రాంతాలు అభివృద్ధినుంచి విధ్వంసంవైపు వెళ్లనున్నాయి. భారతదేశంలోని అనేక ప్రాంతాలకు సంక్షోభం విస్తరిస్తుంది. అందువల్ల తక్షణం ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రభుత్వాలు పూనుకోవాలి. ఇండియా జీడీపీలో 70శాతం పట్టణాలనుంచే వస్తుంది. 2036 నాటికి 40శాతం ప్రాంతం పట్టణప్రాంతాలుగా పెరిగిపోతుంది. 2047నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే సుస్థిరమైన పట్టణీకరణ, అభివృద్ధి జరగాలి.

స్వీయరక్షణ దేశంగా పట్టణప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ప్రభుత్వం చెబుతోంది. తీసుకునే చర్యలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు సంబంధంలేకుండా ఉంది. ఈ అంశాన్ని 2020లోనే ఐక్యరాజ్యసమితి గణాంక కమిషన్ ధృవీకరించింది. ఉపగ్రహ చాయాచిత్రాలను ఆధారం చేసుకుని కమిషన్ సమావేశం నివేదిక రూపొందించి విడుదల చేసింది. పట్టణీకరణ పరిధిలో నగర కేంద్రాలలో చదరపు కిలోమీటర్‌కు 1500 మంది నివసిస్తున్నారు. వీరంతా శాశ్వతంగా నివాసాలు ఏర్పరచుకుని ఉంటున్నారు. ఒక్కొక్క పట్టణంలో కనీసం 50,000మంది జనాభా ఉంటున్నారు. పట్టణ, నగర శివారప్రాంతాలలో చదరపు కిలోమీటరుకు 300మంది నివసిస్తున్నారు. ఇది అత్యంత సాంద్రతగల ప్రాంతం అవుతోంది. భారతదేశంలో 2025 నాటికే పట్టణప్రాంతాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో జనాభా15.5శాతం మాత్రమే నివసిస్తున్నారు. పట్టణాలు, శివారు ప్రాంతాలలో 44.8శాతం నివసిస్తున్నారు. నగరాలు, శివారు ప్రాంతాలలో 39.8శాతం నివసిస్తున్నారు. ప్రభుత్వాలు స్వయంగా అందచేసే సమాచారానికి క్షేత్రస్థాయిలో పరిశీలించి అందచేస్తున్న ఈ సమాచారానికి ఏ మాత్రం పొంతనలేదు. 2011 జనాభా గణన చూసినట్లయితే పట్టణప్రాంతాలలో 31.8శాతం మాత్రమే ఉన్నారు. ఆసియా-పసిఫిక్ ప్రాంత పట్టణ, నగరాలు, గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు గరిష్టంగా అంటే 2051నాటికి 5.2బిలియన్లమంది ఉంటారు. భారతదేశం ఇప్పటికే అత్యధిక జనాభా-1.42 బిలియన్ల మంది ఉన్నారు. ఈ ప్రాంతంలో జనాభా తీవ్ర పరిస్థితులనే ఎదుర్కొనే అవకాశం ఉంది. జనాభా ప్రాతిపదికగా చూసినప్పుడు ఢిల్లీ అతిపెద్ద నగరాలలో రెండవస్థానంలో ఉంది. జనాభా ఎక్కువగాఉన్న 10 నగరాలలో ముంబై 9వస్థానంలో ఉన్నది. ఈ కమిషన్ విడుదల చేసిన నివేదికలో 5 విధానపరమైన సిఫారసులున్నాయి. విధ్వంసాన్ని చక్కదిద్దడానికి సుస్థిర పట్టణ అభివృద్ధికి ప్రాంతీయ సహకారం పెంపొందాలి. బహుళస్థాయిలో సమగ్ర జాతీయ పట్టణ విధానాలను మెరుగుపరచాలి. నిర్ధారణ ఆధారంగా పట్టణప్రాంత విధానాలను అభివృద్ధిపరచాలి. విస్తీర్ణానికి సంబంధించిన ప్రణాళిక సమగ్ర సామాజిక విధానాలను పటిష్టపరచాలి. పట్టణప్రాంతాలలో నిధులకు సంబంధించి విభిన్నమైన నూతన విధానాలను అనుసరించాలి.

మహారాష్ట్రలో తాగునీటి కష్టాలు

ముంబై: ఒకవైపు ఎండలు మండిపోతుంటే... మరోవైపు నీటి కష్టాలు మొదలయ్యాయి. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క బిందె నీటి కోసం మహిళలు రెండు, మూడు కిలోమీటర్ల మేర నడిచి... పొలాల్లో ఉన్న బావి నీటిని తెచ్చుకుంటున్నారు. దగ్గరలోని చేతిపంపులు అడుగంటడంతో ప్రజలు పొల్లాల్లో ఉన్న బావులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతదూరం నుంచి నీటిని తెచ్చుకోలేని వాళ్లు కొద్దిపాటి నీటికే రూ.60తో కొనుక్కొంటున్నట్లు బోరిచివారి గ్రామ సర్పంచ్ తెలిపారు. సరైన రోడ్లు లేక, వాహనాలు లేక ఎండలో రోజూ 7-8 కిలోమీటర్ల మేర నడిచి నీటిని తెచ్చుకోవాలంటే తానెంతో ఇబ్బందిపడుతున్నట్లు ఓ మహిళ మీడియాకు చెప్పారు.

శిక్షణా విమానం కూలి పైలట్ మృతి

అమ్రేలీ: గుజరాత్‌లోని అమ్రేలీ జిల్లాలో విమాన ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో శిక్షణ పొందుతున్న ట్రైనీ పైలెట్ ప్రాణాలు కోల్పోయాడు. ప్రైవేట్ ఏవియేషన్ అకాడమీకి చెందిన శిక్షణ విమానం మంగళవారం మధ్యాహ్నం ప్రమాదానికి గురైంది. ఓ రెసిడెన్షియల్ ఏరియాలోని చెట్టుపై ఆ శిక్షణ విమానం కూలింది. దీంతో మంటలు వ్యాపించాయి. ఆ తర్వాత ఓపెన్ ప్లాట్‌లోకి దూసుకెళ్లింది. అమ్రేలీ పట్టణంలోని గిరియా రోడ్డు ప్రాంతంలో ఉన్న రెసిడెన్షియల్ ఏరియాలో ప్రమాదం సంభవించింది. అక్కడికక్కడే ట్రైనీ పైలెట్ చనిపోయినట్లు అమ్రేలీ ఎస్పీ సంజయ్ ఖరత్ తెలిపారు. పైలట్ ఒంటరిగా విమానం నడుపుతున్నట్లు తెలిసింది. అమ్రేలీ విమానాశ్రయం నుంచి ఆ ఎయిర్‌క్రాఫ్ట్ టేకాఫ్ తీసుకున్నది. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. విమాన ప్రమాదం గురించి తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపుచేశారు.

'మీ నాన్న లాగే నిన్నూ చంపేస్తాం'

సిద్ధిఖీ తనయుడికి 'డి' కంపెనీ బెదిరింపులు

ముంబై: మహారాష్ట్ర మాజీ మంత్రి, ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీని కొన్ని నెలల క్రితం లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ దారుణంగా హత్య చేసింది. తాజాగా ఆయన కుమారుడు జీషాన్ సిద్ధిఖీకి బెదిరింపులు రావడం కలకలం సృష్టిస్తోంది. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆయనకు మెయిల్స్ పంపుతూ బెదిరింపులకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జీషాన్ సిద్ధిఖీకి బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. అందులో 'నీ తండ్రి లాగానే నిన్నూ చంపేస్తాం' అని ఉంది. అలా కాకూడదంటే రూ.10 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆరు గంటలకు ఒక బెదిరింపు మెయిల్ పంపిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి... దర్యాప్తు చేస్తున్నాం. ఈ బెదిరింపులపై జీషాన్ మాట్లాడుతూ 'డి' అనే కంపెనీ నుంచి ఈ మెయిల్ వచ్చిందని తెలిపారు. గతేడాది అక్టోబరులో ముంబైలో బాబా సిద్ధిఖీ హత్య జరిగింది. తన కుమారుడి కార్యాలయంలో ఉండగా కొందరు దుండగులు ఆయనపై కాల్పులకు పాల్పడ్డారు. ముగ్గురు దుండగులు ఆరు రౌండ్ల కాల్పులు జరపడంతో బాబా సిద్ధిఖీ ప్రాణాలు కోల్పోయారు. దుండగులు ఆయనపై కాల్పులు జరుపుతున్న సమయంలో నవరాత్రి ఊరేగింపులో బాణసంచా కాలుస్తుండటంతో కాల్పుల శబ్దం బయటకు వినిపించలేదు. ఈ ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ హత్య తామే చేశామని లారెన్స్ బిష్ణోయ్ ముఠా ప్రకటించింది. ఈ కేసులో దాదాపు 20 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన షూటర్‌గా అనుమానిస్తున్న శివకుమార్ సైతం పోలీసులకు చిక్కాడు. బిష్ణోయ్ గ్యాంగ్‌తో తనకు సంబంధం ఉందని అతడు విచారణలో అంగీకరించాడు. అన్మోల్ బిష్ణోయ్ సూచనల మేరకే ఈ హత్య చేసినట్లు అంగీకరించాడని పోలీసు వర్గాలు వెల్లడించాయి

ఎయిర్‌టెల్ చేతికి అదానీ డేటా నెట్‌వర్క్ స్పెక్ట్రమ్

న్యూదిల్లీ: ప్రముఖ టెలికాం నెట్‌వర్క్ భారతీ ఎయిర్‌టెల్, తన అనుబంధ సంస్థ భారతీ హెక్సాకామ్ కలిసి అదానీ గ్రూప్‌తో ఒప్పందం చేసుకుంది. అదానీ డేటా నెట్‌వర్క్‌కు చెందిన 26 గిగాహెర్జ్ బ్యాండ్‌లోని 400 మెగాహెర్జ్ స్పెక్ట్రమ్‌ను వినియోగించుకునేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. తద్వారా ఎయిర్‌టెల్ తన 5జీ సామర్థ్యాలను, నెట్‌వర్క్ కెపాసిటీని పెంచుకోనుంది. నియంత్రణ సంస్థల ఆమోదానికి లోబడి ఈ లావాదేవీ పూర్తి కానుంది. ఈ ఒప్పందానికి సంబంధించిన ఆర్థిక వివరాలు తెలియాల్సి ఉంది. 2022లో నిర్వహించిన స్పెక్ట్రమ్ వేలంలో అదానీ డేటా నెట్‌వర్క్స్ 400 మెగాహెర్జ్ స్పెక్ట్రమ్‌ను రూ.212 కోట్లకు దక్కించుకుంది. మొత్తం ఆరు సర్కిళ్ల పరిధిలో ఉన్న ఈ స్పెక్ట్రాన్ని ఒప్పందంలో భాగంగా ఎయిర్‌టెల్ వినియోగించుకోనుంది. గుజరాత్ (100 మెగాహెర్జ్), ముంబై (100 మెగాహెర్జ్), ఆంధ్రప్రదేశ్ (50 మెగాహెర్జ్), రాజస్థాన్ (50 మెగాహెర్జ్), కర్నాటక (50 మెగాహెర్జ్), తమిళనాడు (50 మెగాహెర్జ్)లోని స్పెక్ట్రమ్‌ను ఎయిర్‌టెల్ వాడుకోనుంది. అదనపు స్పెక్ట్రమ్ వల్ల అధిక వేగంతో కూడిన డేటాను వినియోగదారులకు అందించడంతో పాటు నెట్‌వర్క్ సామర్థ్యాన్ని మరింత పెంచుకుని నాణ్యమైన సేవలను వినియోగదారులకు అందించడంలో ఎయిర్‌టెల్‌కు ఇది దోహదపడుతుంది.

న్యాయవ్యవస్థ దుర్వినియోగం

రాజకీయ స్వార్థంతో వ్యవహరించారు

బీజేపీ-కాంగ్రెస్ మాటల యుద్ధం

న్యూదిల్లీ: న్యాయవ్యవస్థ విషయంలో బీజేపీ-కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం సాగుతోంది. రాజకీయ స్వార్థంతో న్యాయవ్యవస్థను దుర్వినియోగం చేశారంటూ బీజేపీ-కాంగ్రెస్ పార్టీలు పరస్పర ఆరోపణలకు దిగాయి. కాంగ్రెస్ హయాంలో ఉన్నత న్యాయవ్యవస్థలో నియామకాలను తప్పుబడుతూ బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే వ్యాఖ్యానించగా... న్యాయ ప్రక్రియ, కోర్టులు ,న్యాయమూర్తులను రాజకీయ స్వార్థానికి వినియోగించిన నిస్సిగ్గు చరిత్ర ఆర్ఎస్ఎస్, జనసంఘ్, బీజేపీదని కాంగ్రెస్ దీటుగా స్పందించింది. ఉన్నత న్యాయవ్యవస్థలో నియామకాలపై కాంగ్రెస్ పై దాడి చేయడానికి దుబే మాజీ రాజ్యసభ సభ్యుడు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బహరుల్ ఇస్లాంను ఉదహరిస్తూ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. "కాంగ్రెస్ 'రాజ్యాంగాన్ని కాపాడండి' గురించి ఆసక్తికరమైన కథ. బహరుల్ ఇస్లాం సాహిబ్ 1951లో అసోంలో కాంగ్రెస్‌లో చేరారు. బుజ్జగింపు పేరుతో, కాంగ్రెస్ అతన్ని 1962లో రాజ్యసభ సభ్యుడిని చేసింది. ఆరు సంవత్సరాల తరువాత 1968లో అతని సేవకు గుర్తుగా మళ్లీ రాజ్యసభకు పంపింది. కాంగ్రెస్ అతని కంటే పెద్ద సాధువును కనుగొనలేకపోయింది. రాజ్యసభకు రాజీనామా చేయకుండానే 1972లో అతన్ని హైకోర్టు న్యాయమూర్తిగా నియమించారు. ఆ తర్వాత 1979లో అతన్ని అసోం హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా నియమించారు. 1980లో పదవీ విరమణ చేశారు. కానీ ఆయన్ను అదే ఏడాది డిసెంబర్‌లో నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించారు. 1977లో అతను ఇందిరా గాంధీపై ఉన్న అన్ని అవినీతి కేసులను గొప్ప అంకితభావంతో పరిష్కరించారు. దీంతో సంతోషంగా,కాంగ్రెస్ అతన్ని సుప్రీంకోర్టు నుండి పదవీ విరమణ చేయించింది. 1983లో కాంగ్రెస్ నుంచి మూడోసారి రాజ్యసభ సభ్యుడిని చేశారు. నేను ఏమీ అనకూడదా?" అని దూబె వ్యాఖ్యానించారు.

దీనిపై కాంగ్రెస్ మీడియా,ప్రచార విభాగాధిపతి పవన్ ఖేరా మాట్లాడుతూ... దూబె గుమన్ మాల్ లోధా పేరు విని ఉండకపోవచ్చు. విన్నప్పటికీ ఆ పేరు చెప్పకపోవచ్చునన్నారు. "ఆయన (లోధా) 1969 నుండి 1971 వరకు జనసంఘ్ రాజస్థాన్ అధ్యక్షుడిగా ఉన్నారు. 1972 నుండి 1977 వరకు రాజస్థాన్ శాసనసభ సభ్యుడిగా, అనేక కమిటీలకు అధిపతిగా ఉన్నారు. ఆ తర్వాత, జనతా పార్టీ ప్రభుత్వంలో జనసంఘ్ దయతో, 1978లో రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి అయ్యారు. విషయం అక్కడితో ముగియలేదు. 1988లో గుమన్ మల్ గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు" అని ఖేరా 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఆయన జనసంఘ్, బీజేపీ టికెట్లపై మూడుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారని ఖేరా ఎత్తి చూపారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాజీనామా చేయవలసి వచ్చి రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేయమని కోరిన మరో సంఘటన మరింత తీవ్రమైంది. ఈ సంఘటన స్వతంత్ర భారతదేశంలో న్యాయమూర్తులను రాజకీయంగా ఉపయోగించుకోవడానికి 'అతిపెద్ద అత్యంత సిగ్గుచేటు ఉదాహరణ' అని ఆయన అన్నారు. జూన్ 30, 1966న కే సుబ్బారావు భారతదేశ తొమ్మిదవ ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. కానీ కొన్ని నెలల తర్వాత ఏప్రిల్ 11, 1967న జనసంఘ్ ,స్వతంత్ర పార్టీ ఆయనను రాష్ట్రపతి అభ్యర్థిగా కోరుకోవడంతో జనసంఘ్ ఒత్తిడి మేరకు రాజీనామా చేశాడని ఖేరా పేర్కొన్నారు. 'సుబ్బారావు ఏప్రిల్ 11, 1967న భారత ప్రధాన న్యాయమూర్తి పదవికి రాజీనామా చేసి ఎన్నికల బరిలోకి దిగారు. అయితే, ఆయన అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయారు. జనసంఘ్ ప్రణాళికలు నెరవేరలేదు. జాకీర్ హుస్సేన్ ఆయనను భారీ తేడాతో ఓడించారు' అని కాంగ్రెస్ ఖేరా పేర్కొన్నారు. 'విషయం అక్కడితో ఆగలేదు. అది రంజన్ గొగోయ్ వరకు వెళుతుంది... ఈ రోజుల్లో ద్వేషపూరిత సంఘి తన అల్లుడిని కాపాడటానికి రామమందిరంపై నిర్ణయాన్ని ఎలా ప్రకటించాడనే దాని గురించి వీడియో కూడా వైరల్ అవుతోంది' అని ఆయన ఆరోపించారు. "న్యాయ ప్రక్రియ, కోర్టులు, న్యాయమూర్తులను ఆర్ఎస్ఎస్, జనసంఘ్, బీజేపీ చేసిన 'సిగ్గులేని రాజకీయ ఉపయోగం' చరిత్ర పుటలలో నమోదు చేయబడింది" అని ఖేరా అన్నారు.

విధులకు తిరిగి రండి

ఆందోళన చేస్తున్న టీచర్లకు సీఎం మమత విజ్ఞప్తి

కోల్‌కతా: సుప్రీం కోర్టు తీర్పు తర్వాత ఉద్యోగాలు కోల్పోయి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులను తిరిగి పనిలోకి రావాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారం కోరారు. ప్రభుత్వం మీ జీతాలు 'రక్షిస్తుంది' అని వారికి హామీ ఇచ్చారు. సాల్ట్‌లేక్‌లోని పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ (డబ్ల్యూఎస్ఎస్‌సీ) ప్రధాన కార్యాలయం వెలుపల వేలాది మంది ఉపాధ్యాయులు తమ రాత్రిపూట నిరసనలు కొనసాగించారు. 'ఎవరు కళంకితులు, ఎవరు కాదో మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మీకు మీ ఉద్యోగం ఉందా లేదా, మీరు మీ జీతాలు సకాలంలో పొందుతున్నారా అనే దాని గురించి మాత్రమే మీరు ఆందోళన చెందాలి. కళంకిత ఉపాధ్యాయులను గుర్తించే జాబితా ప్రభుత్వం, కోర్టుల వద్ద ఉంది. 'మీ ఉద్యోగాలు ప్రస్తుతానికి సురక్షితంగా ఉన్నాయి. మీకు మీ జీతాలు లభిస్తాయని మేము హామీ ఇస్తున్నాం. దయచేసి మీ పాఠశాలలకు తిరిగి వెళ్లి తరగతులు ప్రారంభించండి. నిన్న రాత్రి నుండి నేను దీని గురించి చాలాసార్లు మాట్లాడాను. 'మేము మీతో ఉన్నాం' అని మిద్నాపూర్‌లో జరిగిన ఒక పరిపాలనా కార్యక్రమంలో బెనర్జీ అన్నారు. ఉద్యోగాలు కోల్పోయిన గ్రూప్-సి, గ్రూప్-డి సిబ్బంది కోసం సుప్రీం కోర్టులో సమీక్ష పిటిషన్ దాఖలు చేస్తామని, 'అప్పటి వరకు మాపై మీ నమ్మకాన్ని ఉంచండి' అని ముఖ్యమంత్రి అన్నారు. నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులను రెచ్చగొట్టడానికి ప్రయత్నించే వారి బారిన పడవద్దని మమత హెచ్చరించారు. 'నేను కోల్‌కతాలో ఉంటే, నేను కొన్ని సెకన్లలో సమస్యను పరిష్కరించగలిగేదాన్ని. మిమ్మల్ని రెచ్చగొట్టే వారి మాట వినవద్దు. రాష్ట్ర ప్రభుత్వం దానిని చూసుకోనివ్వండి' అని అన్నారు. ఉత్తరప్రదేశ్, త్రిపురలో ఇలాంటి పరిణామాలను మమతా బెనర్జీ ప్రస్తావిస్తూ ఆ రాష్ట్రాల్లో ప్రజలు భారీ సంఖ్యలో ఉద్యోగాలు కోల్పోయారు. వాటిని తిరిగి పొందలేకపోయారు. ఇక్కడ అలా జరగనివ్వకండని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత దాదాపు 26 వేల మంది బోధన, బోధనేతర సిబ్బంది ఆందోళనలు చేస్తున్నారు. మండే ఎండను సైతం లెక్క చేయకుండా రెండు వేల మందికి పైగా నిరసనకారులు డబ్ల్యూఎస్ఎస్‌సీ ప్రధాన కార్యాలయాన్ని చుట్టుముట్టారు. నిన్న సాయంత్రం నుంచి భవనం లోపల ఉన్న దాని చైర్మన్ సిద్ధార్థ మజుందార్ సహా అధికారుల ప్రవేశం, నిష్క్రమణను నిరాకరిస్తున్నారు. మెరిట్ ఆధారంగా నియమించబడిన అభ్యర్థుల జాబితాను, లంచాలు చెల్లించి నియామకాలు పొందిన వారి జాబితాను కమిషన్ ప్రచురించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రియాంక చోప్రాకు అరుదైన గౌరవం

ముంబై: బాలీవుడ్ హీరోయిన్ ప్రియాంక చోప్రా అరుదైన ఘనత దక్కించుకున్నారు. ప్రముఖ గోల్డ్‌హౌస్ గాలా సంస్థ అందించే గ్లోబల్ వాన్‌గార్డ్ హానర్ అవార్డ్‌కు ఆమె ఎంపికయ్యారు. ప్రియాంక చోప్రాతో పాటు హాలీవుడ్ రాపర్ మేగాన్ థీ స్టాలియన్, అకాడమీ అవార్డు దర్శకుడు ఆంగ్ లీ, చిత్రనిర్మాత జాన్ ఎంచు కూడా ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన లీడర్లకు అందించనున్నారు. మే 10న లాస్ ఏంజిల్స్‌లోని మ్యూజిక్ సెంటర్‌లో జరిగే గోల్డ్ హౌస్ గాలా నాల్గవ వార్షిక సమావేశంలో ప్రియాంక చోప్రాను ఈ అవార్డుతో సత్కరించనున్నారు. గోల్డ్ హౌస్ గాలా-ఏ100 జాబితాను వెల్లడించనుంది. సంస్కృతి, వ్యాపారంలో అత్యంత ప్రభావవంతమైన 100 ఆసియా పసిఫిక్ లీడర్లను ఏటా ఎంపిక చేస్తారు. ఈ సంవత్సరం ఏ100 జాబితా మే 1న వెల్లడించనున్నారు. ఈ వేడుకకు ముందు సినిమా, సాంకేతికత, మీడియా సహా వివిధ పరిశ్రమలకు చెందిన 600 మందికి పైగా అతిథులను ఆహ్వానించనున్నారు. కాగా... 2000లో మిస్ వరల్డ్ టైటిల్ గెలుచుకున్న ప్రియాంక చోప్రా... ఆ తర్వాత హిందీ సినిమాలో దాదాపు 25 ఏళ్ల తన కెరీర్‌లో రాణించారు. ఆ తర్వాత ప్రియాంక చోప్రా హాలీవుడ్‌లోనూ నటించారు. ప్రస్తుతం ఆమె జాన్ సెనా, ఇద్రిస్ ఎల్బాతో కలిసి హాలీవుడ్ చిత్రం 'హెడ్స్ ఆఫ్ స్టేట్'లో కనిపించనున్నారు.

రాష్ట్రాల వాటా లాక్కున్న కేంద్రం

పెట్రో ఉత్పత్తుల సెస్‌పై ఖడ్గే

న్యూదిల్లీ: ప్రపంచ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ పెట్రోల్, డీజిల్‌పై సెస్ విధించడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే మంగళవారం మోదీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. 2014 నుంచి రూ.38.89 లక్షల కోట్లు వసూలు చేసినప్పటికీ... రాష్ట్రాలతో వాటా పంచుకోకుండా, రాష్ట్రాలకు దక్కాల్సిన హక్కును 'తగ్గించింది' అని తెలిపారు. ఇది 'మోదీ ప్రభుత్వ 'సహకార సమాఖ్యవాదం'-సమాఖ్యవాదాన్ని నిలిపివేయడం' అని ఖడ్గే 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు 47 నెలల కనిష్ట స్థాయికి పడిపోయినప్పటికీ, మోదీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రూ.2 చొప్పున పెంచిందని తెలిపారు. ఈ సంవత్సరం మోదీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై మొత్తం సెస్ నుంచి రూ.1.47 లక్షల కోట్లు, రూ.2 కేంద్ర ఎక్సైజ్ సుంకం నుంచే రూ.28 వేల కోట్లు ఆర్జించనుందని ఆయన పేర్కొన్నారు. కానీ బీజేపీ పాలిత రాష్ట్రాలు సహా ఈ సెస్ నుంచి ఒక్క పైసా కూడా పొందలేవని ఆయన అన్నారు. రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం నుంచి విభజించదగిన నిధులలో ఎక్కువ వాటాను నిరంతరం డిమాండ్ చేస్తున్నాయి. '2014 నుంచి డిసెంబరు 2024 వరకు మోదీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, పెట్రోలియం ఉత్పత్తులపై పన్ను విధించడం ద్వారా రూ.38.89 లక్షల కోట్లు వసూలు చేసింది. మోదీ ప్రచారం చేసిన 'టీమ్ ఇండియా' నమూనాను అనుసరించడానికి బదులుగా, 2025-26 బడ్జెట్‌లో ప్రకటించిన రూ.12 లక్షల శ్లాబ్ వరకు వ్యక్తిగత ఆదాయపు పన్నుపై పన్ను రాయితీ ఇవ్వడంలో ప్రభుత్వం రూ.లక్ష కోట్ల ఆదాయాన్ని వదులుకుంది' అని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. 2019-20 నుంచి వివిధ సెస్‌లు, సర్‌చార్జీల ద్వారా సేకరించిన రూ.5.7 లక్షల కోట్లు మోదీ ప్రభుత్వం ఖర్చు చేయలేదని, ఖడ్గే పేర్కొన్నారు. 'ఇది రాష్ట్రాలకు సులభంగా బదిలీ అయ్యేది. కానీ మోదీ ప్రభుత్వం రాష్ట్రాలకు దక్కాల్సిన వాటాను లాక్కోవడంలో బిజీగా ఉంది' అని అన్నారు.

సమర్థ నేత చిరాగ్ పాశ్వాన్

ఎల్‌జేపీ ఎంపీ అరుణ్ భారతి



న్యూదిల్లీ: త్వరలో ఎన్నికలు జరగనున్న బీహార్‌లో పెద్ద బాధ్యత మోయడానికి తమ అధ్యక్షుడు, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ సిద్ధంగా ఉన్నారని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) మంగళవారం తెలిపింది. రాష్ట్రానికి పెద్ద ఎత్తుగడ, దీర్ఘకాలిక దార్శనికత కలిగిన శక్తిమంతమైన, దృఢమైన నాయకుడు అవసరమని పేర్కొంది. రాష్ట్ర రాజకీయ అంశాలపై పాశ్వాన్ సన్నిహితుడు, లోక్‌సభ ఎంపీ అరుణ్ భారతి పీటీఐతో మాట్లాడుతూ చిరాగ్ అన్ని కులాలు, వర్గాలలో దార్శనికత, ఆమోదయోగ్యత గల అరుదైన నాయకుడని అన్నారు. అందువల్ల బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్డీఏ) కలిసి కూర్చుని నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఇతర నాయకులకు దార్శనికత లేదా ఆమోదయోగ్యత లేదని లోక్‌సభలో పార్టీ చీఫ్ విప్ కూడా అయిన ఆయన అన్నారు. అయితే జేడీ(యూ) అధ్యక్షుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నాయకత్వంపై ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. పాశ్వాన్ బావమరిది భారతి మాట్లాడుతూ నితీశ్ కుమార్ నాయకత్వంలో బీహార్ 'అద్భుతమైన పని' చేసిందని, అయితే దాని అభివృద్ధి ప్రయాణం ఇప్పటికీ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ప్రతికూలంగా ఉందని సూచించారు. 'బీహార్ ఒక నమూనా మార్పు అంచున ఉంది. ఎన్నికల తర్వాత ఎవరు అధికారంలోకి వచ్చినా వారు రాబోయే 20 నుంచి 25 సంవత్సరాలు రాష్ట్ర ప్రయాణాన్ని నడిపిస్తారు, రూపొందిస్తారు. ఇది దార్శనికత, ఆమోదయోగ్యత గల నాయకుడికి మాత్రమే అది సాధ్యమవుతుంది. పాశ్వాన్ ఆరోగ్యంగా, సమర్థుడిగా ఉంటాడని, పెద్ద బాధ్యత మోయడానికి సిద్ధంగా ఉన్నాడని నా పార్టీ అభిప్రాయం' అని అన్నారు.

చిరాగ్ పాశ్వాన్‌కు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆకర్షణ ఉందని, ఎక్కడికి వెళ్లినా కనీసం 50 వేల మందిని ఆయన సంపాదిస్తారని భారతి పేర్కొన్నారు. ఎల్‌జేపీ (రామ్ విలాస్) ఎన్డీఏలో మూడవ అతిపెద్ద పార్టీ. ఇందులో బీజేపీ, జేడీ(యూ), కొన్ని చిన్న పార్టీలు ఉన్నాయి. బీజేపీ, పాశ్వాన్ సహా ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు నితీశ్ నాయకత్వంలో ఈ కూటమి ఎన్నికల్లో పోటీ చేస్తుందని తరచుగా చెబుతుండగా... రాష్ట్రంలో ఎక్కువ కాలం పనిచేసిన ముఖ్యమంత్రి ఆరోగ్యం చుట్టూ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రతిపక్ష పార్టీలు ఈ అంశాన్ని లేవనెత్తుతున్నాయి. బీహార్ రాజకీయాల్లో తాను భాగం కావాలని పాశ్వాన్ ఇటీవల అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ఇంకా ఆరు నెలల దూరంలో ఉన్నందున ఎల్‌జేపీ (రామ్ విలాస్) తన నాయకుడికి పెద్ద స్థానం కోసం చూస్తున్నట్లు కనిపిస్తోంది. జేడీ(యూ)తో ఆ పార్టీకి సంబంధాలు సరిగా లేవు. ఈ ఘర్షణ కారణంగానే 2020 ఎన్నికల సమయంలో బీహార్‌లో ఎన్డీఏ నుంచి పాశ్వాన్ బయటకు వెళ్లాల్సి వచ్చింది. జేడీ(యూ) పోటీ చేసిన నియోజకవర్గాలపై ఆయన దృష్టి సారించారు. ఇది తన సొంత పార్టీ ఒక సీటు మాత్రమే గెలుచుకోగలిగినప్పటికీ, దాని మొత్తం సంఖ్యను గణనీయంగా దెబ్బతీసింది.

రామ్‌దేవ్ బాబాపై దిల్లీ హైకోర్టు ఆగ్రహం



న్యూదిల్లీ: పతంజలి ఆయుర్వేద సంస్థ వ్యవస్థాపకులు రామ్‌దేవ్ బాబా చేసిన షర్బత్ జిహాద్ వ్యాఖ్య వివాదాస్పదమైంది. రూ అఫ్జా పానీయాన్ని ఉద్దేశించి షర్బత్ జిహాద్ అంటూ రామ్‌దేవ్ బాబా చేసిన వ్యాఖ్యలు ఏమాత్రం సమర్థనీయం కాదని దిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలు కోర్టును తీవ్రంగా ప్రభావితం చేశాయని వెల్లడించింది. రూ అఫ్జా పానీయం తయారీదారు హమ్‌దర్ద్ వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తమ కొత్త పానీయం రోజ్ షర్బత్ ప్రచారం కోసం రామ్‌దేవ్ బాబా ఇటీవల ఓ కొత్త వీడియో విడుదల చేస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'షెర్బత్ అమ్మగా వచ్చిన డబ్బుతో ఓ సంస్థ మసీదులు, మదరసాలు నిర్మిస్తోంది. మీరూ ఆ షెర్బత్ తాగితే మసీదులు, మదరసాలు నిర్మితమవుతాయి. కానీ మీరు పతంజలి రోజ్ షర్బత్ తాగితే గురుకులాలు, పతంజలి యూనివర్సిటీ నిర్మితమవుతాయి. లవ్ జిహాద్, వోట్ జిహాద్ లాగా షర్బత్ జిహాద్ కూడా కొనసాగుతోంది' అని రామ్‌దేవ్ బాబా అన్నారు. దీనిపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో తాను ఏ సంస్థ పేరు ప్రస్తావించలేదని రామ్‌దేవ్ బాబా వివరణ ఇచ్చారు. దీనిపై రూ అఫ్జా పానీయం తయారీదారు హమ్‌దర్ద్ సంస్థ కోర్టుకెక్కింది. ఆ వీడియోను తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది. మరోవైపు, పతంజలి తరపున విచారణకు హాజరైన ప్రాక్సీ కౌన్సెల్... ప్రధాన న్యాయవాది రానందున విచారణ వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే, కోర్టు ఇందుకు నిరాకరించింది. మధ్యాహ్నానికి కల్లా పతంజలి ప్రధాన లాయర్ కోర్టులో హాజరు కావాల్సిందేనని జస్టిస్ బన్సల్ స్పష్టం చేశారు.

లేకపోతే తీవ్రమైన ఆదేశాలు ఇస్తామని స్పష్టం చేశారు. ఆ తరువాత విచారణకు హాజరైన ప్రధాన లాయర్... పతంజలి సంస్థ ఆ ప్రకటనను ఉపసంహరించుకుంటుందని తెలిపారు. హమ్‌దర్ద్‌ను ఇబ్బంది పెట్టే ఇలాంటి ప్రకటనలను మరోసారి జారీ చేయబోమంటూ హామీ ఇవ్వాలని జస్టిస్ బన్సల్ ఆదేశించారు. వారంలోపల అఫిడవిట్ దాఖలు చేయాలంటూ విచారణను మే1కి వాయిదా వేశారు.

అమెజాన్, వాల్‌మార్ట్ కోసం

భారత్‌పై అమెరికా ఒత్తిడి

న్యూదిల్లీ: అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం కోసం రెండు దేశాల అధికారులు విస్తృతంగా చర్చిస్తున్నారు. ట్రంప్ 'పరస్పర సుంకాల' నిర్ణయంతో భారత్ అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి ప్రాధాన్యత ఇస్తోంది. ఇదిలా ఉంటే... అమెజాన్, వాల్‌మార్ట్ వంటి ఆన్‌లైన్ రిటైలర్లకు భారత మార్కెట్‌లో పూర్తి ప్రవేశం కల్పించాలని భారత్‌పై అమెరికా ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. డొనాల్డ్ ట్రంప్ ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్‌లు, లాబీయిస్టులు, అమెరికా ప్రభుత్వ అధికారులను ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ మంగళవారం ఈ మేరకు నివేదించింది. అమెజాన్, వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఫ్లిప్‌కార్ట్ భారతదేశంలో అతిపెద్ద రిటైలర్ అయిన ముకేష్ అంబానీ రిలయన్స్ గ్రూప్ వంటి భారతీయ పోటీదారులతో సమానస్థాయి కోసం పోటీ పడుతున్నాయి. భారతదేశంలో 125 బిలియన్ ఈ-కామర్స్ మార్కెట్‌లోకి ఎక్కువ యాక్సెస్ కావాలని న్యూదిల్లీపై వాషింగ్టన్ ఒత్తిడి చేస్తుంది. ప్రస్తుతం భారతదేశం విదేశీ యాజమాన్యంలోని ఆన్‌లైన్ రిటైలర్లపై ఆంక్షలు విధిస్తోంది. ఇన్వెంటరీ కలిగి ఉండటంతో పాటు వినియోగదారులకు నేరుగా అమ్మడంపై నిషేధాలు ఉన్నాయి. దీనికి విరుద్ధంగా రిలయన్స్ వంటి దేశీయ కీ ప్లేయర్లకు ఇలాంటి రూల్స్ ఏమీ ఉండవు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రిటైల్ రెంటింటిలోనూ వీరికి అనుమతి ఉంది. ఒకవేళ వాల్‌మార్ట్, అమెజాన్‌కు భారత్ మార్కెట్ పూర్తిస్థాయి అవకాశం కల్పిస్తే... ఇవి నేరుగా దుకాణాలు తెరిచి దేశవ్యాప్తంగా వినియోగదారులను చేరుకోవడానికి విస్తారమైన రిటైల్ నెట్‌వర్క్ ప్రారంభిస్తాయి. ప్రస్తుతం భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఆహారం, ఆటోమొబైల్స్ నుంచి డిజిటల్ ట్రేడ్ వంటి విస్తృత శ్రేణి రంగాలను కవర్ చేస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుత పరిణామాలపై అమెజాన్, వాల్‌మార్ట్ స్పందించలేదు.

బియ్యంలో ఆర్సెనిక్... కేన్సర్ ముప్పు

వాతావరణ మార్పులే కారణం: తాజా అధ్యయనం

న్యూదిల్లీ: వాతావరణ మార్పుల వల్ల బియ్యంలో ఆర్సెనిక్(విషపూరిత మూలకం) స్థాయిలు పెరుగుతున్నాయని, కేన్సర్‌కు ప్రధాన కారకాల్లో ఆర్సెనిక్ ఒకటి అని శాస్త్రవేత్తలు తెలిపారు. 2050 నాటికి ప్రపంచంలో ప్రతి ఐదుగురిలో ఒకరు తమ జీవితంలో ఏదో ఒక దశలో కేన్సర్ బాధితులవుతారని చెప్పారు. ఈ అధ్యయన నివేదిక లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ జర్నల్‌లో ప్రచురితమైంది. ప్రపంచ ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీల సెల్సియస్ పెరిగితే... నేల నిర్మాణంలో మార్పులు వస్తాయని, కార్బన్ డయాక్సైడ్ స్థాయిలు పెరుగుతాయని ఈ అధ్యయనం తెలిపింది. ఈ పరిస్థితుల్లో వరి మొక్కలకు ఆర్సెనిక్ పీల్చుకునే శక్తి పెరుగుతుందని వివరించింది. ప్రపంచవ్యాప్తంగా ఏటా 54 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతుంది. దీనిలో 27 శాతం భారత దేశంలో పండుతుంది. ఆర్సెనిక్ స్థాయిలు పెరగడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయి. కొలంబియా విశ్వవిద్యాలయం ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ ప్రొఫెసర్ లూయిస్ జిస్కా మాట్లాడుతూ ఆసియాలో, ముఖ్యంగా ఆగ్నేయాసియాలో వరి పండించే ప్రాంతాల్లో కాలుష్య కారకంగా ఆర్సెనిక్ అందరికీ సుపరిచితమేనని చెప్పారు. వాతావరణ మార్పులు ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయన్నారు. ఫలితంగా కేన్సర్, గుండె జబ్బులు వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. కలుషిత మట్టి, సాగునీటిలో ఆర్సెనిక్ ప్రధానంగా కనిపిస్తుంది. కార్బన్‌డయాక్సైడ్ స్థాయిలు పెరిగితే వరి మొక్కల నిర్మాణం మారుతుంది. ఆర్సెనిక్‌ను పీల్చుకునే శక్తి వాటికి పెరుగుతుంది. ఆర్సెనిక్‌తో కలుషితమైన నీటిని అన్నం వండటానికి ఉపయోగించడం వల్ల ముప్పు మరింత తీవ్రమవుతుంది. 2050 నాటికి ఆసియా దేశాల్లో లక్షలాది మంది ఊపిరితిత్తులు, ప్రొస్టేట్ కేన్సర్ వంటి కేన్సర్లతో బాధపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అదేసమయానికి చైనాలో 1.34 కోట్ల ఆర్సెనిక్ సంబంధిత కేన్సర్ కేసులు నమోదయ్యే అవకాశం ఉంది. గుండె జబ్బులు, మధుమేహం కూడా పెరగవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.

29న పెగాసస్‌పై సుప్రీం విచారణ

న్యూదిల్లీ: జర్నలిస్టులు సహా ఇతరుల నిఘా కోసం పెగాసస్ స్పైవేర్‌ను అనధికారికంగా ఉపయోగించారనే ఆరోపణలపై దర్యాప్తు కోరుతూ దాఖలయిన పిటిషన్లను ఈ నెల 29న విచారణ చేయాలని సుప్రీం కోర్టు నిర్ణయించింది. సమయం లేకపోవడంతో న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ తేదీకి విచారణను జాబితా చేసింది. కొంతమంది పిటిషనర్ల తరపున హాజరయిన సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ మాట్లాడుతూ గతంలో ఉన్నత న్యాయస్థానం సాంకేతిక ప్యానెల్ నివేదికలు అందించాలని ఆదేశించిందని, కానీ అలాంటి నివేదిక ఇవ్వాలేదని అన్నారు. 'మాకు నివేదికలు అందనందున ఈ కోర్టు కొన్ని ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుంది. దయచేసి దానిని అత్యవసరంగా వినండి' అని అన్నారు. దీంతో ధర్మాసనం ఈ విషయాన్ని వచ్చేవారం జాబితా చేయాలని ఆదేశించింది. ఆగస్టు 25, 2022న పెగాసస్ అనధికారిక వాడకంపై దర్యాప్తు చేయడానికి నియమించిన సాంకేతిక ప్యానెల్ పరిశీలించిన 29 సెల్‌ఫోన్లలో ఐదుగురిలో కొంత మాల్వేర్‌ను కనుగొన్నట్లు సుప్రీం కోర్టు పేర్కొంది. అయితే ఇజ్రాయెల్ స్పైవేర్ ఉపయోగించినట్లు నిర్ధారించలేకపోయింది. అత్యున్నత న్యాయస్థానం మాజీ న్యాయమూర్తి ఆర్‌వీ రవీంద్రన్ సమర్పించిన నివేదికను పరిశీలించిన తర్వాత... కేంద్ర ప్రభుత్వం పెగాసస్ దర్యాప్తునకు సహకరించలేదని సుప్రీం కోర్టు పేర్కొంది.

విశాలాంధ్ర హైదరాబాద్

మాజీ మంత్రి ఇంద్రారెడ్డి చిత్రపటానికి నివాళి

విశాలాంధ్ర-రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ సర్కిల్ డైరీఫార్మ్ చౌరస్థలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోలన్ సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో మాజీ మంత్రి పట్లోల ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ ఇంద్ర రెడ్డి తనయుడు పట్లోల కార్తీక్‌రెడ్డి నాయకులు కార్యకర్తలతో కలిసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రారెడ్డి రంగారెడ్డి జిల్లాలో చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థి దశ నుంచి బడుగు, బలహీన వర్గాలకోసం పోరాటం చేశారన్నారు. ఇంద్ర రెడ్డి ప్రజల గుండెలో చిరస్థాయిగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమం లో రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జైప్రకాష్, పోరెడ్డి ధర్మరెడ్డి, మాజీ కౌన్సిలర్ వెంకటేష్, వనం శ్రీరామ్ , రెడ్డి రావుల జంగయ్య, పచ్చ శ్రీనివాస్, చిత్తరి సోమా శ్రీనివాస్, జైపాల్ పంబాల, రాజు నాగని సురేష్, నరేష్ యాదవ్ సూర్యం వీర్లపల్లి నవీన్ పుప్పాల లక్ష్మణ్ కొత్త రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

అబ్దుల్ ఖాదర్‌కు సన్మానం :

విశాలాంధ్ర, హైదరాబాద్ : నూతనంగా నియమితులైన జలమండలి డైరెక్టర్ (పర్సనల్ అడ్మినిస్ట్రేషన్) అబ్దుల్ ఖాదర్‌కు హైదరాబాద్‌లో మంగళవారం జలమండలి ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగుళ్ల రాజిరెడ్డి, అధ్యక్షులు కె.రమణ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎల్.ప్రభాకర్ రెడ్డి, పి.జనార్దన్, అసోసియేట్ అధ్యక్షులు గుల్జార్ అహ్మద్, కె.కమాలాశ్రీ, బి.భీం సింగ్, బి.నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి ఏ.సావీర్ కుమార్, సంయుక్త కార్యదర్శులు ఏ.నవీన్, సిహెచ్.శంకరయ్య, కోశాధికారి బి.సాయి చరణ్ తదితరులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఫైనాన్స్ విభాగంలో ఆఫీసర్, సీనియర్ ఆఫీసర్, డిజిఎం, జీఎం ఉద్యోగుల పదోన్నతులు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయని, చాలామంది ఉద్యోగులు పదోన్నతులు పొందకుండానే ఉద్యోగవిరమణ చేసారని, దీంతో వారు నష్టపోయారని మొగుళ్ల రాజిరెడ్డి నూతన డైరెక్టర్ అబ్దుల్ ఖాదర్ దృష్టికి తీసుకెళ్లారు. జలమండలి ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ సిబ్బంది పోస్టుల అప్‌గ్రేడేషన్‌ను వేగవంతం చేసి, ఉద్యోగులకు అన్యాయం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తామని అబ్దుల్ ఖాదర్ హామీ ఇచ్చారని మొగుళ్ల రాజిరెడ్డి తెలిపారు.

బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులు పరిశీలన

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని సత్య రాఘవేంద్ర కాలనీలో సుమారు రూ.50 లక్షలతో కొనసాగుతున్న బాక్స్ డ్రెన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. రాబోయే వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కాలనీల్లో ముంపు సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ శ్రీకాంత్, వర్క్ ఇన్స్పెక్టర్ రజినీకాంత్, నాయకులు బాబు, నాగేష్, ఉదయ్ కుమార్, రణధీర్, రాజేందర్, ప్రకాష్, శివ, మునీర్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజితోత్సవ సభ విజయవంతం చేయండి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఈ నెల 27న వరంగల్ జరిగే రజితోత్సవ సభను విజయవంతం చేయాలని కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం గౌతమ్ నగర్‌లోని ఆమె కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వరంగల్‌లో జరిగే సభకు పార్టీ శ్రేణులు అభిమానులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్ళడానికి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దేశానికి తెలంగాణ దిక్సూచి : మహేష్ కుమార్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : అభివృద్ధిని మరిచి బీఆర్ఎస్ నేతలు కోడి గుడ్డ మీద ఈకలు లెక్కబెడుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ మండిపడ్డారు. నోటికి అదు అదుపు లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం బీఆర్ఎస్ నేతలకు అలవాటుగా మారిందని దుయ్యబట్టారు. కాని నేటికి తెలంగాణ ప్రజలు ఇంకా వారి పదేళ్ల పాలనలో రైతుల పట్ల వారు అనుసరించిన విధానాలు, రైతులు బేడీలు వేసిన ఘటనలు, లాఠీ చార్జీలను మరిచిపోలేదన్నారు. మంగళవారం నిజామాబాద్‌లో పర్యటించిన అయన అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నేడు దేశానికి తెలంగాణ దిక్సూచిగా మారిందన్నారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి పథకాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతుల పక్షపాతి ప్రభుత్వమని అందుకే రైతుల మేలు కోసం రైతు మహోత్సవ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇపుడు బీఆర్ఎస్ నేతలు రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని కాని పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాకు చేసింది శూన్యం అంటూ మండిపడ్డారు. చివరకు ప్రధాని నరేంద్ర మోదీ నల్ల చట్టాలు తెచ్చి రైతులను కష్టాలపాలు చేస్తుంటే వాటికీ బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిన విషయం మరిచిపోలేదని అన్నారు. రైతు చట్టాలను కేంద్ర వెనక్కు తీసుకునేలా కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమం చేసిందని గుర్తు చేశారు. సన్న బియ్యం పంపిణీతో యావద్దేశం తెలంగాణ వైపు చూస్తుందని, అన్నిటికీ మించి రాహుల్ గాంధీ ఆలోచన మేరకు కుల సర్వే నిర్వహించి దేశానికి ఆదర్శంగా నిలిచామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం రైతు సదస్సు ముఖ్య ఉద్దేశ్యం వ్యవసాయ రంగంలో మార్పులకు అనుగుణంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించడమే దీని వల్ల తక్కువ వ్యయంతో ఎక్కువ రాబడి రాబట్టేలా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. 1923లో 2 లక్షల 75 వేల ఎకరాల సాగు కోసం నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని, కాని కాల క్రమేనా సిల్ట్, పూడికతో నిజాంసాగర్ ప్రాజెక్టు దాదాపు 17 టిఎంసిల మేర కుదించకపోవడం జరిగిందన్నారు. 1970లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆయకట్టును మరో 2 మీటర్లకు పెంచడంతో దాదాపు 12 నుంచి 17 టీఎంసీల నీటి నిల్వ చేసేందుకు కృషి చేసిందన్నారు. ప్రస్తుతం నిజాంసాగర్ సిల్ట్, పూడిక తీస్తే మరో లక్ష ఎకరాలకు, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులో సిల్ట్, పూడిక తీస్తే అదనంగా మరో రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని మంత్రులకు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. దీని పై వారు కూడా సానుకూలంగా స్పందించారన్నారు. సన్న వరి సాగు రైతులకు ప్రతి ఎకరాకు రూ.500 బోనస్ చెల్లింపుతో రాష్ట్రంలో సన్నవరి సాగు 25 లక్షల ఎకరాల నుండి 40 లక్షల ఎకరాలకు పెరిగిందన్నారు. జిల్లాలో అధునాతన టెక్నాలజీతో ఇండోర్ గేమ్ స్టేడియం నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం నిజామాబాద్ పట్టణంలోని 40వ డివిజన్లో సన్న బియ్యం లబ్ధిదారులు దళిత బిడ్డ నరేందర్ లక్ష్మి దంపతుల ఇంట్లో సహపంక్తి భోజనం చేయడం జరిగింది. ధనిక పేద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ కడుపునిండా భోజనం చేయాలని ఉద్దేశంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీని ప్రవేశపెట్టిందన్నారు.

ఫెన్సింగ్ పనులు పూర్తిచేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : రూ.1200 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం అక్రమణకు గురి కాకుండా ఉండేందుకు హద్దులు నిర్ణయించి చేపట్టిన ఫెన్సింగ్ పనులను శనివారంలోగా పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 ఏసీబీ కార్యాలయం ముందు సర్వే నంబర్ 102/1లో రూ.1200 కోట్ల విలువగల 12 ఎకరాల ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఎలాంటి అక్రమణలు జరగకుండా ఉండేందుకు డీజీపీఎస్ సర్వే నిర్వహించి ప్రభుత్వ స్థలానికి హద్దులు నిర్ణయించి రూ.35 లక్షలతో జిఐ షీట్స్, ఐరన్ పోల్స్‌తో చేపట్టిన పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఎక్కువ మంది కూలీలను పెట్టి డే అండ్ నైట్ పనులు చేపట్టి ఫెన్సింగ్ పనులను శనివారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ స్థలంలో ఈ స్థలం ప్రభుత్వానిదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ స్థలమును ఎవరైనా కబ్జాకు, ఆక్రమణకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఫెన్సింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ ఆర్డిఓ సాయిరాం, షేక్‌పేట తహసిల్దార్ అనిత రెడ్డి, డి.ఈ సంజీవ్, ఏ.ఈ శ్రీధర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర - హైదరాబాద్ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గుర్తు చేశారు. మంగళవారం ప్రపంచ ధరత్రీ దినోత్సవం సందర్భంగా హైదరా బాద్ లో ఎర్త్ డే - స్టూడెంట్, యూత్ ఇన్ యాక్షన్ పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి సమస్త జీవరాశులకూ ఆధారమని పేర్కొన్నారు. పుడమి తల్లి మానవాళి జీవనానికి అవసరమై గాలి, నీరు, ఆహారం, ఉపాధి కల్పిస్తోందన్నారు. వాతావరణ మార్పులు వంటి ఇతరత్రా చర్యలతో ప్రకృతి వనరులు విధ్వంసానికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధనాలు, గ్రీన్‌హౌస్ వాయువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించుకోవాలని సూచించారు. అలాగే, సౌర-పవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధనాలను పెంచుకోవాలన్నారు. రానున్న రోజుల్లో భూమిని కాపాడుకునేందుకు సోలార్ ఎనర్జీ చాలా అవసరమని, సోలార్ ఎనర్జీని ప్రోత్సాహిం చేందుకు దేవాదాయ శాఖకు చెందిన భూముల వినియోగంపై చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి సురేఖ తెలిపారు. ప్రతి ఒక్కరూ సోలార్ ఎనర్జీని వినియోగించుకునే విధంగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాని ఆమె పిలుపునిచ్చారు.

భూభారతి చట్టంపై అపోహాలు వద్దు: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రభుత్వం రైతులకు, ప్రజలకు ఎలాంటి నష్టం కలిగించే చర్యలు తీసుకోదని, భూభారతి చట్టంపై మీరు ఏలాంటి అపోహాలు పెట్టుకోవద్దని, ఏవైనా సందేహాలు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చి నివృత్తి చేసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం స్పష్టం చేశారు. మంగళవారం శామీర్ పేట మండలంలోని తూంకుంట గ్రామంలో మొగుళ్ల వెంకట్రెడ్డి గార్డన్స్‌లో ఏర్పాటు చేసిన భూభారతి చట్టంపై అవగాహన సదస్సుకు కలెక్టరు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ భూభారతి పైరైతుల సందేహాలకు సమాధానమిస్తూ ప్రభుత్వం రైతులకు, ప్రజలకు ఎలాంటి నష్టం, కష్టం కల్పించే దిశగా చర్యలు తీసుకోదని, భూభారతి చట్టంపై మీరు ఏలాంటి అపోహాలు పెట్టుకోవద్దని, ఏవైనా సందేహాలు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. రైతులు ప్రైవేటు సర్వేయనర్లను నియమించవద్దని తెలుపగా వారికి సమాధానమిస్తూ భూమి కొనుగోలు అమ్మకాలప్పుడు రిజిస్ట్రేషన్ సమయంలో లైసెన్స్ సర్వేయర్లతో భౌతిక సరిహద్దుతో చేయించిన ల్యాండ్ మ్యాపులను ప్రభుత్వ సర్వేయర్లు మళ్లీ వాలిడేట్ చేసిన తరువాతే మీకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో ల్యాండ్ మ్యాపులు వస్తాయని, దీని వల్ల ఎవరికి నష్టం జరగదని ఇంకా పకడ్బందీగా మీ భూసరిహద్దులు ఉంటాయని, అది కూడా రైతు ఒప్పుకుంటేనే భూ సర్వే చేస్తామని కలెక్టరు తెలిపారు. ధరణి వల్ల పిఒబి సమస్యలు చాలా ఉన్నాయని, భూభారతి చట్టంలో పిఓబి రద్దుచేసే అధికారం కల్పించడం జరిగిందన్నారు. ఈ భూభారతి చట్టంలో ప్రతి సంవత్సరం డిసంబర్ 31న ఆ సంవత్సరంలో జరిగిన మార్పులు, చేర్పులను ఆన్‌లైన్‌లో ప్రింట్ తీసి ప్రతి గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులలో ప్రదర్శిస్తారని అందువల్ల మీకందరికి మీమీ భూముల రికార్డుల వివరాలు తప్పక తెలుస్తాయని కలెక్టరు వివరించారు. గ్రామ పంచాయతీ అధికారులను నియమించి ప్రతి గ్రామంలోని చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడమే కాకుండా ఏవైనా భూ వివాదాలు, తగాదాలు ఉంటే వాటిని తహసీల్దార్ల దృష్టికి తీసుకువెళతారని కలెక్టరు తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా రెవెన్యూ అధికారులపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని, ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ 1989 ఆర్ఓఆర్ చట్టంలోని అంశాలు భూభారతిలోని అంశాలు కొంత వరకు సిమిలర్‌గా ఉన్నాయని, అంతే కాకుండా రెవెన్యూ అధికారులకు ధరణీలో లేని అధికారాలు భూభారతిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింహాలు, జిల్లా గ్రంధాలయ సంస్థ కమిటి ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, శామీర్ పేట్ తహసీల్దారు యాదగిరిరెడ్డి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది,రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు అత్యంత ప్రాధాన్యత

విశాలాంధ్ర, హైదరాబాద్ : మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే హజ్ యాత్రకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అనుబంధ శాఖల అధికారులు మెరుగైన సదుపాయాలు చేపట్టాలని మైనార్టీ సంక్షేమ శాఖ సంచాలకులు షేక్ యాస్మిన్ భాష ఆదేశించారు. హైదరాబాద్ హజ్ హౌస్‌లో హజ్ యాత్రపై ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. హజ్ యాత్రలో భాగంగా తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర అలాగే మరి కొన్ని రాష్ట్రాల నుండి 11,000 మందికిపైగా హజ్ యాత్ర చేయనున్నట్లు తెలిపారు. ఎక్కడ సమస్యలు ఉత్పన్నం కాకుండా అన్ని శాఖల అధికారులు చేపట్టే అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం హజ్ యాత్రను అత్యంత ప్రాధాన్యత తీసుకుంటుందని ఆ దిశగా అధికారులు నిబద్ధత, సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా యాస్మీన్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని ప్రతి అధికారి నిబంధనలకు లోబడి పని చేయాలని హజ్ యాత్ర సందర్భంగా యాత్రికులకు హైదరాబాద్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ నుండి విమానాలు ఈ నెల 29 నుండి మే 29 వరకు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మదీనాకు ఏప్రిల్ 29 నుండి మే 13 వరకు అలాగే జిద్దాకు మే 16 నుండి మే 29 వరకు విమానాలు నడుస్తాయని తెలిపారు. జిద్దా నుండి తిరిగి వచ్చే విమానాలు జూన్ 12 నుండి జూలై 9, వరకు మధ్య నడుస్తాయని, 31 విమానాలు యాత్రికుల అందుబాటులో ఉంటాయని ఆమె పేర్కొన్నారు. యాత్రికులు తమ నిర్ణీత రిపోర్టింగ్ సమయాలను ఖచ్చితంగా పాటించాలని, విమాన షెడ్యూల్‌లో ఎటువంటి మార్పులు అనుమతించబడవని ఆమె తెలిపారు. టిజిఆర్‌టిసి రవాణా కోసం తగిన సంఖ్యలో బస్సులను సమకూర్చాలని, అత్యవసర పరిస్థితుల కోసం మరి కొన్ని వాహనాలను సిద్ధం చేయాలని సూచించారు. ఎస్‌బిఐ బ్యాంక్ రేట్లతో యాత్రికుల కరెన్సీ మార్పిడి సౌకర్యం కల్పించాలని, ఎస్‌బిఐ యాత్రికులకు బ్యాగ్ పౌచ్ మరియు కరెన్సీ సేవలను ఉపయోగించే వారికి 10 లక్షల రూపాయల యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ అందించనున్నట్లు తెలిపారు. వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న యాత్రికులు ధృవీకరణ తర్వాత ఎస్‌బిఐ కౌంటర్‌లో చెల్లింపులు చేయవచ్చని సూచించారు. సమయానికి వెళ్లలేని వారికోసం సౌత్ సెంట్రల్ రైల్వే అవసరమైన యాత్రికుల కోసం హైదరాబాద్ నుండి ఎంబార్కేషన్ పాయింట్లకు రైలు రిజర్వేషన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. హజ్ హౌస్‌లో ఏర్పాటు చేయనున్న స్టాల్స్ షామియానాలలో జిహెచ్‌ఎంసి సిబ్బంది చెత్త సేకరణ, పరిశుభ్రత కోసం డస్ట్‌బిన్‌లు అలాగే స్కావెంజింగ్ సేవలను నిరంతరం కొనసాగాలని సూచించారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి హజ్ హౌస్‌లోని 20 గదులకు నీటి సరఫరా మరియు సీవరేజ్ నిర్వహణను అందించాలని ఆదేశించబడింది. పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ జిల్లా స్థాయి డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్లు మరియు ఏరియా హాస్పిటల్స్‌లో వ్యాక్సినేషన్‌లను నిర్వహించాలని, హజ్ హౌస్‌లో హెల్త్ డెస్క్ ఏర్పాటు చేయాలని, ఆధునాతన అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ 24/7 నిరంతరం విద్యుత్ సరఫర, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు మరియు లిఫ్ట్ ఆపరేటర్లను సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. మెడికల్ శాఖ నుండి 24/7 సర్వీస్ అందించాలని మెడికల్ క్యాంపు నిర్వహణతో పాటు రెండు కొత్త అంబులెన్సును అందుబాటులో ఉంచాలని అలాగే గుర్తించిన ఆసుపత్రుల్లో బెడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సజ్జాద్ అలీ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఇర్ఫాన్ షరీఫ్, తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (టిజిఆర్‌టిసి), హార్టికల్చర్, పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, పోలీస్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి), సౌత్ సెంట్రల్ రైల్వే, తెలంగాణ స్టేట్ వక్ఫ్ బోర్డ్, రోడ్స్ అండ్ బిల్డింగ్స్, భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్‌ఎన్‌ఎల్), హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ (హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ), ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఅండ్‌పిఆర్), ఫైర్ సర్వీసెస్ తదితర డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

కోల్డ్ రూమ్ ప్రారంభం

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: సీనియర్ సిటిజన్లకు వంటకాలను తాజాగా తయారు చేయడానికి సీఆర్ ఫౌండేషన్ హోం ఫర్ ఏజ్డ్ వంటగదిలో కొత్తగా కోల్డ్ రూమ్‌ను ప్రారంభించడంతో నివాసితుల జీవన పరిస్థితులను మెరుగుపరిచే దిశగా ఒక ముఖ్యమైన అడుగు వేసింది. ఎస్‌బీహెచ్ స్టాఫ్ అసోసియేషన్ వెల్ఫేర్ ట్రస్ట్ వారి ఉదార ఆర్థిక సహాయం ద్వారా ఈ కోల్డ్ రూమ్ సాధ్యమైంది. కోల్డ్ రూమ్‌లో ఆహార పదార్థాలు కూరగాయలు ఉంచడం ద్వారా నివాసితులు తాజా మరియు పోషకమైన భోజనం పొందేలా చేస్తుంది. వృద్ధులకు సౌకర్యవంతమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో సీఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను ఎస్‌బీహెచ్ స్టాఫ్ అసోసియేషన్ వెల్ఫేర్ ట్రస్ట్ ట్రస్టీలు కొనియాడారు. కోల్డ్ రూమ్‌ను అసోసియేషన్ మేనేజింగ్ ట్రస్టీ శైలేంద్ర లిమాయే ప్రారంభించారు. ఆపరేటింగ్ ట్రస్టీ ఆర్ శ్రీకాంత్ రెడ్డి, ట్రస్టీలు కె నరహరి, వైయస్ నాగిరెడ్డి, ఆంధ్ర బ్యాంకు మాజీ డైరెక్టర్ బి ఎస్ ఆర్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, ట్రస్టీలను శాలువాలతో సత్కరించి వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాన్ని సిఆర్ ఫౌండేషన్ హెూమ్ ఫర్ ఏజ్డ్ డైరెక్టర్, ట్రెజరర్ వి చెన్నకేశవరావు నిర్వహించారు. సీఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు కంభంపాటి అజయ్ కుమార్, కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, వృద్ధాశ్రమ కమిటీ మెంబర్స్ ఎస్ రాజేంద్ర రావు, టి తాన్యా, డాక్టర్ గోపీచంద్, మల్లంపాటి వెంకటేశ్వర రావు, ఆశ్రమ వాసులు, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు చర్యలు : జూపల్లి

విశాలాంధ్ర - మహబూబ్‌నగర్ : ఎండాకాలంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను అదేశించారు. మంగళవారం నాడు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ధాన్యం అమ్మిన వెంటనే రసీదు ఇవ్వాలని, ధాన్యాన్ని మిల్లులకు తరలించే బాధ్యత రైతులది కాదన్నారు. అది మిల్లర్లు తీసుకోవాలని ఈ విషయంలో అధికారులు దృష్టి సారించాలని ఆయన సూచించారు. శిల్పారామంలో నాడు బలవంతంగా ప్లాట్లను ఓనర్స్ ద్వారా తీసుకున్నారని, అట్టి ప్లాట్లు శిల్పారామానికి అవసరమైతే తీసుకుని నష్టపరిహారం ఇవ్వాలని, శిల్పారామానికి అవసరం లేకపోతే వెంటనే ప్లాట్లను తిరిగి ఓనర్స్ అప్పజెప్పాలని ఆయన అధికారులను ఆదేశించారు. రెవెన్యూ భూములు అని అధికారులు చెప్పగా గత 15 సంవత్సరాల క్రితం లే ఔట్ చేసినప్పుడు రెవెన్యూ అధికారులు ఎందుకు ఊరుకున్నారని ఆయన ప్రశ్నించారు. వెంటనే మంత్రి కల్పించుకుని వారం రోజుల్లోపు శిల్పారామం ప్లాట్ల విషయం లో ఫిజికల్ గాను రికార్డు రూపంలోను నివేదిక ఇవ్వాలని మంత్రి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. 48.99 కోట్ల రూపాయలతో పెద్ద చెరువు దగ్గర ఐస్ లాండ్, సుందరీకరణ, నెక్లెస్ రోడ్ నిర్మాణం చేపట్టేందుకు గతంలో ఎస్టిమేట్స్ చేయగా 7కోట్ల రూపాయల పనులు పూర్తి చేయడం జరిగిందని, బిల్లులురాని కారణంగా పనులు ఆగిపోయాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా, స్థానిక ఎమ్మెల్యేతో కలిసి రీ ఎస్టిమేషన్ తయారు చేసి, 3 వారాల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎంతో ఖర్చు చేసి శిల్పారామం నిర్మించారని, కానీ ఫంక్షన్ హాలు నిరుపయోగంగా ఉందని దానిని ఉపయోగించుకోవాలంటే సౌండ్ ప్రూఫ్ కావాలని, మొన్న ఉగాది వేడుకలు నిర్వహించిన సందర్భంగా సౌండ్ ప్రూఫ్ లేకపోవడం చేత ఇబ్బందులు కలిగినట్లు ఎమ్మెల్యే గారు చెప్పారు. శిల్పారామం లో సౌండ్ ప్రూఫ్ కోసం ఎస్టిమేట్స్ ను వెంటనే తయారు చేసి నివేదిక ఇవ్వాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. మన్యం కొండ దగ్గర నిర్మించే హెూటల్ ను అన్ని రకాల వసతులు కల్పించాలని ఆయన కోరారు. అధికారులతో మిషన్ భగీరథ, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, గృహ జ్యోతి, కొత్త రేషన్ కార్డులు, రాజీవ్ యువ వికాసం, గ్యాస్ సిలిండర్లు తదితర అంశాలపైన మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మోహన్ రావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరిపించాలి : ఎంపీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్‌నగర్ జిల్లాలో సంచలనం రేపిన దేవరకద్ర కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి కొండా ప్రశాంత్ రెడ్డి హత్యకు కుట్ర వ్యవహారంపై మంగళవారం ఎంపీ.డికె.అరుణ డీజీపీని కలిశారు. ఈ సందర్భంగా ఈ కుట్రపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని అమె కోరుతూ మహబూబ్‌నగర్ పార్లమెంట్ కన్వినర్ డోకూర్ పవన్ రెడ్డి, కొండా ప్రశాంత్ రెడ్డితో కలిసి డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కొండా ప్రశాంత్ రెడ్డి హత్యకు కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. రూ.2కోట్ల 50లక్షల సుపారీ ఇచ్చి హత్యకు కుట్ర చేసినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని, ఇప్పటికే దేవరకద్ర, మహబూబ్ నగర్ పరిసరాల్లో ప్రశాంత్ రెడ్డి మూమెంట్స్ పై కొన్ని రోజులుగా రెక్కి నిర్వహిస్తున్నట్లు అమె తెలిపారు. ఇదిలా వుండగా ప్రస్తుతం భూత్‌పూర్ పోలీస్‌ల అదుపులో నలుగురు అనుమానితులు వున్నారని వారు ఎక్కడి నుంచి వచ్చారు? ఎవరు పంపారు? ఈ కుట్ర వెనుక ఎవరి హస్తం ఉంది అనే పలు కొనసాగుతున్న కోణాల్లో దర్యాప్తు చేశారు.

ఎస్టీక్యూసీ అమలులో స్పార్ష్ ముందంజ

విశాలాంధ్ర - హైదరాబాద్ : సీసీటీవి కెమెరాలు, ఎలక్ట్రానిక్ సెక్యూరిటీ సొల్యూషన్స్ మార్గదర్శక భారతీయ తయారీదారు అయిన స్పార్ష్, ఏప్రిల్ 9, 2025న ప్రభుత్వ నిబంధనల అమలు తర్వాత, అత్యంత విస్తృతమైన శ్రేణి సీసీటివి ఉత్పత్తులకు ఎస్టీక్యూసి (ప్రామాణిక పరీక్ష మరియు నాణ్యత ధృవీకరణ) సాధించిన మొదటి భారతీయ సంస్థగా నేడు భారత మార్కెట్లో తన నిరంతర నాయకత్వాన్ని ప్రకటించింది, ఇది ఇప్పుడు భారతదేశంలో విక్రయించబడే అన్ని సీసీటీవి కెమెరాలకు ఎస్టీక్యూసీ సర్టిఫికేషన్‌ను తప్పనిసరి చేస్తుంది. ఈ ముఖ్యమైన విజయం నాణ్యత, భద్రత మరియు 'ఆత్మనిర్భర్ భారత్' చొరవ పట్ల స్పార్ష్ యొక్క ప్రారంభ నిబద్ధతను నొక్కి చెబుతుంది. కొత్త నిబంధనల ప్రకారం ఇప్పుడు అన్ని సీసీటీవి కెమెరాలు చట్టబద్ధమైన అమ్మకాలకు ఎస్టీక్యూసీ సర్టిఫికేషన్ పొందాలని కోరినప్పటికీ, స్పార్ష్ యొక్క చురుకైన విధానం దాని భాగస్వాములు మరియు కస్టమర్‌లు ఎటువంటి అంతరాయం లేకుండా ఉండేలా సర్టిఫైడ్ సొల్యూషన్‌ల విస్తృత పోర్ట్‌ఫోలియోను అందించే మొదటి వ్యక్తిగా నిలిచింది.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ ఏ బ్లాక్‌కి చెందిన తెలుగుపాటి లక్ష్మీకి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.1,75,000 ఆర్థిక సహాయానికి సంబంధించిన మంజూరి పత్రాన్ని బాధిత కుటుంబానికి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్పవరమన్నారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని గాంధీ పునరుద్ఘాటించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య చికిత్సకి సహకారం అందించిన ఆరెకపూడి గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నామని బాధితుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలరాం యాదవ్, కాపూరి అనిల్, అష్రాఫ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

గంగాధర్‌రెడ్డి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఖాజాగూడలో గల సాయి ఐశ్వర్య కాలనీ లోనీ శ్రీ సాయి బాబా ఆలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ప్రత్యేక అర్చనలు నిర్వహించి స్వామి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలపై స్వామి వారి చల్లని చూపు ఉండాలని ప్రజలు సుఖ సంతోషాలతో ఆరోగ్యాలతో ఉండేలా చూడాలని వేడుకున్నానని తెలిపారు. ఆలయాలు మానసిక ప్రశాంతతకు ఎంతగానో దోహదపడతాయని, గచ్చిబౌలి డివిజన్‌లో ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి ఎల్లప్పుడూ చేస్తానని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అన్నారు. భక్తిశ్రద్ధలతో స్వామి వారి వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నందుకు ఆలయ కమిటీ వారిని అభినం దించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయ ఆలయ కమిటీ సభ్యులు రామ్ రెడ్డి,అశోక్ రాజు, రమణి, సీనియర్ నాయకులు సుమన్ అరుణ్ గౌడ్, స్థానిక నేతలు, దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు, సాయి ఐశ్వర్య కాలనీ వాసులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

విశాలాంధ్ర-రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ సర్కిల్ ఇందిరాగాంధీ సొసైటీలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్లను టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ సిబ్బందితో కలిసి పోలీస్ బందోబస్తు నడుమ కూల్చివేతలు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీధర్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు చేపట్టడం జరుగుతుందన్నారు.

లా ఎక్సలెన్స్ విజయ పతాకం

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : లా ఎక్సలెన్స్ ఐఏఎస్ అకాడమీ యూపీఎస్సీ 2024లో 78 ప్లస్ ఆల్ ఇండియా ర్యాంకర్లతో అద్భుత విజయం సాధించింది. రాజ్ కృష్ణ ఆల్ ఇండియా ర్యాంక్ 8, వెంకటేష్ 15, శ్రవణ్ కుమార్ రెడ్డి 62, వంటి ర్యాంక్‌లను విద్యార్థులు అకాడమీ మార్గదర్శనంతో రాణించారనీ లా ఎక్సలెన్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు పాలడుగు, అకడామిక్ డైరెక్టర్ రామ్మోహన్‌లు తెలిపారు. ప్రిలిమ్స్, మెయిన్స్ కోర్సులు, రాపిడ్ రివిజన్, డిగ్రీ ప్లస్ ఐఏఎస్ ప్రోగ్రామ్‌లు విద్యార్థులకు బలమైన పునాది ఇస్తాయన్నారు. ఆధునిక క్లాస్‌రూమ్‌లు, 24 గంటలు స్టడీ హాల్, లైబ్రరీ చదువును సులభతరం చేస్తాయన్నారు. యూపీఎస్సీ కలలు కనే వారికి లా ఎక్సలెన్స్ నమ్మకమైన గమ్యం స్థానం అని అన్నారు. యుపిఎస్సీ 2024లో విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు.



శ్రీ మేధా కాలేజీ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ సర్కిల్ అత్తపూర్ శ్రీ మేధా కాలేజీ విద్యార్థులు మంగళవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో విజయాకేతానం ఎగరావేశారని కాలేజీ ప్రిన్సిపాల్ సుజాత చైర్మన్ అయ్యన బాబు సంతోషం వ్యక్తం చేశారు. ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు సీనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థి అధితి జూనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థులు సైదా నిద శామీన్ భవేష్ శబణం భైర్వ కార్తీక్‌లకు శుభాకాంక్షలు తెలిపారు

గొప్ప విప్లవకారుడు లెనిన్ : బోస్

విశాలాంధ్ర కాప్రా : లెనిన్ ప్రపంచంలో ఎక్కడ దోపిడీ, పీడన ఉన్నా, శ్రామికవర్గాల ప్రజలకు అండగా నిలిచారని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. లెనిన్ 155వ జయంతిని ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ ప్రపంచ ప్రథమ సోషలిస్టు రాజ్యస్థాపకుడిగా మాత్రమే కాదు, ప్రథమ కమ్యూనిస్టు రాజ్యం వైపుగా ఆయన రష్యాను నడిపించారన్నారు. కార్ల్ మార్క్స్ కేవలం ఒక శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతాన్ని మాత్రమే ప్రతిపాదించగా, లెనిన్ దాన్ని ఆచరణ సాధ్యం చేసిన విప్లవనాయకుడన్నారు. జార్ చక్రవర్తి చేత పీడించబడే ఒక వెనుకబడిన రాజ్యంలో సాయుధ విప్లవాన్ని విజయవంతంగా నడిపించి శ్రామికరాజ్యాన్ని స్థాపించడమేగాక, త్వరలోనే కూలిపోతుందని కలలుగన్న శత్రువుల కుట్రను భగ్నంచేసి, దాన్ని సుస్థిరం చేసిన మేధావి లెనిన్ అన్నారు. ఇది సహించని రష్యా చుట్టూ ఉన్న 14 సామ్రాజ్యవాద దేశాల సైన్యాలు దురాక్రమిస్తూ, ఆధునిక ఆయుధాల వేగస్లతో, డబ్బు మూటలతో, రష్యాలోని స్వదేశీ విప్లవ ద్రోహుల్ని రెచ్చగొట్టి భయంకరమైన అంతర్యుద్ధానికి తెరతీయగా, దాన్నిరెడ్ ఆర్మీతో వార్ కమ్యూనిజంతో ఢీకొట్టి ఓడించిన ప్రజానాయకుడన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర,ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్,సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా, రాఘవేంద్రరావు, సుధాకర్ ఏఐఎస్ఎఫ్ నేతలు సతీశ్ కుమార్, మహేష్, అజీమ్ పాషా,సమీర్ పాల్గొన్నారు.

మళ్లీ మాదే అధికారం : కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : మూడేళ్లలో మళ్లీ బీఆర్ఎస్సే అధికారంలోకి వస్తుందన్న కేటీఆర్, రేవంత్ రెడ్డి ప్రైవేటు సైన్యంలాగా ఓవరాక్షన్ చేస్తున్న పోలీసు అధికారులను వదిలిపెట్టేది లేదన్నారు. రిటైరనా ఏ మూలలో దాక్కున్నా పట్టుకొచ్చి హిసాబ్ కితాబ్ బరాబర్ చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ నందీనగర్‌లో కేటీఆర్ ను కలిసిన లగచర్ల బాధితులను బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం లక్ష రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఆ తరువాత మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. లగచర్ల ఆడబిడ్డలపై లైంగిక వేధింపులు జరిగాయని, అక్కడ మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందన్న ఎన్.హెచ్.ఆర్. సి నివేదికతో అయినా సిగ్గు తెచ్చుకుని రేవంత్ రెడ్డి ముక్కు నేలకు రాయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డికి సిగ్గు,శరం ఉంటే దళిత గిరిజనులపై జరిగిన అరాచకాలు, లైంగిక వేధింపులకు బాధ్యత వహించి రాజీనామా చేసి క్షమాపణ కోరేవారన్నారు. ఎన్‌హెచ్‌ఆర్సీ నివేధిక తరువాతైన రేవంత్ సర్కార్ బాధ్యులైన పోలీసులను సర్వీసు నుంచి తొలగించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈవిషయంలో రేవంత్ ప్రభుత్వం స్పందించపోతే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. హైకోర్టు స్టే ఇచ్చినా భూసేకరణ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దానిని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లగచర్ల గ్రామస్తుల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాడుతుందంటూ అయన స్పష్టం చేశారు. ఇది రాజకీయ సభలకు సాధా రణంగా లభించే విరాళం కాదని వారి ఆత్మబ లమైన సంకేతంగా పేర్కొన్నారు. బీఆర్ఎస్ లాంటి పార్టీ మాకు అండగా ఉంది కాబట్టే మేము ఈ సహాయం చేస్తున్నాం అని ఆడబిడ్డలు పేర్కొనడం విశేషం. ప్రభుత్వం 40 మంది లగచర్ల రైతులను అరెస్టు చేసి జైళ్లలో చిత్రహింసలకు గురిచేసిందని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యంగా హీర్యా నాయక్ అనే రైతుకు గుండెనొప్పి వచ్చినప్పుడు కూడా పోలీసులు కట్టేసిన సంకెళ్లతోనే ఆసుపత్రికి తరలించారని, ఇది మానవత్వానికి వ్యతిరేకమని మండిపడ్డారు. లగచర్ల ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్, ఎస్సీ-ఎస్టీ కమిషన్‌లు స్పందించాయని, పోలీసులు అప్రజాస్వామికంగా ప్రవర్తించారని రిపోర్ట్‌లో పేర్కొన్నట్లు కేటీఆర్ వెల్లడించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చెట్ల నరకడం, లగచర్ల రైతులపై దాడి వంటి అంశాలపై సుప్రీంకోర్టు నియమించిన కమిటీ-, జాతీయ మానవ హక్కుల సంఘం తీవ్ర విమర్శలు చేసినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి నైతిక పరాభవంగా నిలిచిందన్నారు. రేవంత్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యేగా, హోంమంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉండడానికి అర్హత కోల్పోయారని వెంటనే సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. కొడంగల్ ప్రాంతంలోని ఆడబిడ్డలకు జరిగిన అవమానం వల్ల రేవంత్ రెడ్డి వారికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

గీత వృత్తిదారుల గ్రామ బహిష్కరణపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : నిజామాబాద్ జిల్లా, ఎరగడ్ల మండలం,తాళ్ళరాంపూర్ గీత వృత్తిదారులను గ్రామ బహిష్కరణ చేసిన విలేజ్ డెవలఫ్‌మెంట్ కమిటీ వారిపై తాటివనం ధ్వంసం చేసిన వారిపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోని, బాధితులకు ఆర్థిక సహాయం అందించాలని, తెలంగాణ రాష్ట్రంలో గీత వృత్తిదారులకు ఎక్స్‌గ్రేషియో రూ. 10 లక్షలకు, పెన్షన్ రూ. 5000 పెంచాలని, అర్హులైన గీతవృత్తిదారులందరికీ సేఫ్టీ కిట్స్ అందించాలని కోరుతూ తెలంగాణ బీసీ శాఖ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్, ఎక్సైజ్ శాఖా మాత్యులు జూపల్లి కృష్ణారావు తెలంగాణ గీత పనివారల సంఘం ప్రతినిధి వర్గం, రాష్ట్ర సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిల్ గౌడ్, కో ఆర్డినేటింగ్ సెక్రటరీ బొమ్మగాని నాగభూషణం, సంఘ ఉపాధ్యక్షులు కెవిఎల్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి డి.జి. నరేంద్ర ప్రసాద్‌తో కూడిన ప్రతినిధి వర్గం విజ్ఞప్తి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో గీత వృత్తిదారులకు పెండిరగ్‌లో వున్న ఎక్స్‌గ్రేషియో డబ్బు, పెన్షన్, బకాయిలు చెల్లించాలని, వన పెంపకానికి సహకార సంఘాలు, టిఎఫ్‌టిలకు 10 ఎకరాల భూమి ఇవ్వాలని, భర్త చనిపోయిన కార్మికిని భార్యకు విధిగా పెన్షన్‌ను కొనసాగించాలని, రాష్ట్రంలో గీత వృత్తిదారులకు ఆర్థిక సహకారం అందించేందుకు చర్యలు చేపట్టడం, స్కిల్ యూనివర్శిటీలో గీత వృత్తిదారులకు శిక్షణ ఇచ్చే అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి పత్రంలో పేర్కొన్నారు.

యాజమాన్య విధానాలు అప్రజాస్వామికం : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-కాప్రా : డబ్బుంటేనే అడ్మిషన్ ఇస్తామన్న సెయింట్ ఆన్స్ తీరును ప్రశ్నించిన యువజన సంఘ నేతను దుర్భాషాలాడిన యాజమాన్య విధానాలు అప్రజాస్వామికమని ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయని సెయింట్ ఆన్స్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలకు ఓపెనింగ్ పర్మిషన్స్ ఇస్తున్న విద్యాకాదికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ లోని సెయింట్ ఆన్స్ పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్‌లు మాట్లాడుతూ డబ్బుంటేనే అడ్మిషన్ ఇస్తామన్న సెయింట్ ఆన్స్ పాఠశాల తీరును ఏమిటని ప్రశ్నించిన యువజన సంఘ నేతను దుర్భాషాలాడిన యాజమాన్య విధానాలు అప్రజాస్వామికమని, ఒకవేళ విద్యాహక్కు చట్టంను సెయింట్ ఆన్స్ అమలు చేసినట్లయితే ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనారిటీ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు రాయితీతో అడ్మిషన్లు పొందేవారు కదా అన్నారు. సదరు పాఠశాలలో తమ పిల్లలను చదివించాలనే కోరిక,ఆశ తీరేదిగా అన్నారు. కానీ, సెయింట్ ఆన్స్ పాఠశాల యాజమాన్యం మాత్రం ధనార్జనే ధ్యేయంగా డబ్బులకే ప్రాధాన్యత ఇచ్చిందని, విద్యార్థులకు రాయితీ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తే యువజన సంఘ ప్రతినిధులను పనికి మాలిన వ్యక్తులుగా అభివర్ణించి, అప్రజాస్వామికంగా చేసిన మాటలు సరికాదన్నారు. నూతన పాఠశాలలకు మండల విద్యాశాఖ అనుమతులు ఇచ్చే క్రమంలో పూర్తి స్థాయి పర్యవేక్షణ చేసి, వాస్తవిక రిపోర్టును పై స్థాయి అధికారులకు ఇవ్వాలి, కానీ అవేమీ జరగకుండా కాసుల కక్కుర్తికి విద్యా శాఖ అధికారులు లొంగుతున్నారని, అందుకే యథేచ్ఛగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా మేడ్చల్ జిల్లాలో పూర్తి స్థాయిలో నిబంధనల కు విరుద్ధంగా ఓపెనింగ్ పర్మిషన్లు ఇస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు గిరి బాబు, శేఖర్, నదీమ్, సతీష్, అజీమ్, మురహరి, కీర్తన్, దీపిక్, మురళి పాల్గొన్నారు.

మంచి నీటి పైపులకు మరమ్మతులు

విశాలాంధ్ర, మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ కాలనీల్లో నీటి పైపుల లీకేజీల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిలో ఈ సమస్యను తుంగతుర్తి రవి మంగళవారం ఉదయం హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి పైపుల మరమ్మత్తు పనులను ప్రారంభించారు. ఈ పనుల పురోగతిని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి పరిశీలించారు. అధికారులు, పని చేసే సిబ్బందితో మాట్లాడి, పనుల నాణ్యతలను తెలుసుకున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, లేకేజీలు లేకుండా నీటి సరఫరా కొనసాగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమస్యపై స్పందించి మరమ్మతులు చేపట్టిన హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ మేనేజర్ తిరుపతికి, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఇంటికి అవసరమైన మేరకు నీరు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిం చారు. తాను ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తాను. వారి సమస్యలు నా సమస్యలుగా భావించి పరిష్కారానికి కృషి చేస్తాను అని తుంగతుర్తి రవి అన్నారు.

ఇంటర్‌లో శ్రీఅభిద విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ సర్కిల్ అత్తపూర్ లోని శ్రీఅభిద జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో అసాధారణ విజయాలు సాధించారు అని శ్రీ అభీదా కాలేజీ డైరెక్టర్ శ్రీనివాస్ రావు డీన్ రవికుమార్ ప్రిన్సిపాల్ నర్సింహారావు భార్గవి దేశపాండే లు వెల్లడించారు ముఖ్యంగా ఎంపిసి విభాగంలో గౌని యశశ్విని అనుగుండ రిషికా రెడ్డి మోతుకూరి సంజన సావంత్ ఉమిక వి. శ్రీరామ్ తలా 466/470 మార్కులు సాధించడం గర్వకారణం. వీరితో పాటు 25 మంది విద్యార్థులు 465/470, మరో 46 మంది విద్యార్థులు 464/470 మార్కులు సాధించారు.బైపిసి విభాగంలో ఆత్రేయ మనోజ్ అక్షర రెడ్డి శశికిరణ్ రెడ్డి తలా 435/440 మార్కులతో మెరిశారు. వీరితో పాటు 14 మంది విద్యార్థులు 434/440 మార్కులు సాధించారు. బైపిసి విభాగం విద్యార్థులందరూ 430 పైచిలుకు మార్కులు సాధించడం విశేషం అనిఅదేవిధంగా సీనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థులు కూడా ప్రతిభ చాటారు. ఎం పి సి విభాగంలో కావ్యఅమృత ఎం. కౌశిక్ 991/1000, త్రిశాల్ 990/1000 మార్కులు సాధించారు. బైపిసి విభాగంలో ఆకాంక్ష 990/1000 మార్కులు సాధించింది. అనేక మంది విద్యార్థులు 990కి పైగా మార్కులు సాధించడం గర్వకారణం అని ఈ అద్భుత ఫలితాల సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

ఇంటర్ ఫలితాలలో స్టేట్ ర్యాంకులు

విశాలాంధ్ర-బషీర్ బాగ్: నేడు విడుదలైన తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాలలో రాష్ట్ర స్థాయి మార్కులు సాధించడంపై తపస్య కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజిమెంట్ ఆనందం వ్యక్తం చేసింది. హైదరాబాద్ లక్డికపూల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో తపస్య ఫ్యాకల్టీ... ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను టపస్య విద్యా సంస్థల డిప్యూటీ డైరెక్టర్ ఓగూరి శ్రీహరి, అధ్యాపకులు అభినందించారు. అధ్యాపకుల సలహాలు, కృషి.. తల్లిదండ్రుల సహకారం వల్లనే ఈ ర్యాంకులు సాధించామని విద్యార్థులు ఓగూరి శ్రీహరి తెలియజేసారు. తపస్య విద్యార్థులు 131 స్టేట్ టాప్ మార్కులు సాధించారని, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంఈసీ విభాగంలో 496 మార్కులతో మానస, స్టేట్ ఫస్ట్ మార్క్ సాధించిందని సిఈసి లో పార్థసారథి 492 మార్కులు స్టేట్ ఫస్ట్ మార్కులు సాధించారని ఓగూరి శ్రీహరి తెలిపారు. నిరంతర పర్యవేక్షణ వల్లే వరుసగా 12వ సంవత్సరాలుగా తమ విద్యార్థులు రాష్ట్ర మార్కులు (మొదటి ర్యాంకులు) సాధిస్తున్నారని తెలిపారు. రెండోవ సంవత్సరంలో సీఈసీ విభాగంలో ఇద్దరు విద్యార్థులు అంకం శ్రీజ, శాఖమూరి జ్యోత్స్న 985 అత్యధిక మార్కులు సాధించారని వెల్లడించారు. రాష్ట్ర స్థాయి మార్కులు సాధించిన పలువురు విద్యార్థిని, విద్యార్థులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. తమకు మంచి మార్కులు రావడానికి కృషి చేసిన కళాశాల అధ్యాపకులు, యాజమాన్య కృషి వల్లే రాష్ట్ర స్థాయి మార్కులు సాధించామని విద్యార్థులు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సీట్లు బీసీలకు కేటాయించాలి

విశాలాంధ్ర - ఆమనగల్లు: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం హైదరాబాదులోని గాంధీభవన్‌లో రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, కల్వకుర్తి నియోజకవర్గ అసెంబ్లీ ఉపాధ్యక్షులు షాబుద్దీన్, యూత్ కాంగ్రెస్ నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవిస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అధిక మొత్తంలో బీసీలకు సీట్లు కేటాయించాలని కోరారు. యూత్ కాంగ్రెస్ నాయకులకు కూడా ఎక్కువ మొత్తంలో సీట్లు కేటాయించి యువకులను ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం సానుకూలంగా స్పందిస్తూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించమన్నారు. తప్పకుండా వచ్చే స్థానిక ఎన్నికలలో బీసీలకు ఎక్కువ సీట్లు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ నాయక్, శివ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు పరిశీలన

విశాలాంధ్ర-ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలో మంగళవా రం అధికారుల బృందం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణా న్ని పరిశీలించారు. ఇండ్ల పరిశీలన కోసం అధికారు లను నాలుగు బృందా లుగా ఏర్పాటు చేసి వెరిఫికేషన్ సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కుసుమా మాధురి చెప్పారు. అందులో భాగంగా చింతలపల్లిలో పర్యటించి ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి వినోద, కార్యదర్శి పవన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దీక్షను విరమించిన సిద్ధేశ్వర పటేల్

విశాలాంధ్ర-బషీర్ బాగ్: దేశ జనగణనతో పాటు కులగన చేయాలని, తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 42 శాతం బీసీ బిల్లులను పార్లమెంటులో ఆమోదించి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని ఢిల్లీ కేంద్రంగా నేటికీ 22 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న , ఆజాది జేఏసీ చైర్మన్ హిందూ బీసీ మహాసభ జాతీయ అధ్యక్షులు బత్తుల సిద్ధేశ్వర పటేల్ దీక్ష విరమింప చేసినట్లు ఓబిసి ఇంటలెక్షన్ ఫోరం జాతీయ అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ తెలిపారు. బత్తుల సిద్ధేశ్వర పటేల్ కు నిమ్మరసం ఇచ్చి దీక్షను , ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్, సూరజ్ మండల్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కాంగ్రెస్ పార్టీ నేషనల్ ఓబీసీ చైర్మన్ అనిల్ జైహింద్, సుప్రీంకోర్టు లాయర్ డాక్టర్ కె.ఎస్ చౌహన్, బీసీ ఆజాద్ ఫెడరేషన్ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ లు దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆజాది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగర నరహరి, రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, హిందూ బీసీ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి రామ్ నర్సయ్య, హిందూ బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల వెంకటస్వామి, విశ్వపతి, శివ, చతుర్భుజి, కమల్ ప్రసాద్ పాల్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: హిమాయత్ నగర్‌లోని ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్లో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాధికారత, పర్యావరణ నిర్వహణ పట్ల తన నిబద్ధతను ప్రదర్శించించారు. ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ చీఫ్ పాట్రన్, హిమాయత్‌నగర్, డెక్కన్ హెరిటేజ్ అకడమిక్ ట్రస్ట్ చైర్మన్, కరస్పాండెంట్ ఎం. వేదకుమార్ మాట్లాడుతూ పర్యావరణ సమస్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి సెనేటర్ గేలార్డ్ నెల్సన్ దీనిని ప్రారం భించారని తెలిపారు. దీనిని 190కి పైగా దేశాలలో జరుపుకుంటున్నారనీ, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద పౌర ఉత్సవాల్లో ఒకటిగా నిలిచిందన్నారు. ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్లో ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా చీఫ్ పాట్రన్ ఎం. వేదకుమార్ పాఠశాల బృందంతో కలిసి పాఠశాల ప్రాంగణంలో ఒక మొక్కను నాటారు. ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ 'ప్లాస్టిక్ ఫ్రీ జోన్' హోదాను నొక్కి చెప్పారు. పాఠశాల నిరంతర పర్యావరణ నిబద్ధతలో ఘన వ్యర్థాలను తగ్గించడం, నీరు, దాని పరిరక్షణ హేతుబద్ధ వినియోగం, పచ్చదనాన్ని పెంచడం, ఇ-వ్యర్థాలను తగ్గించడం జీవవైవిధ్యాన్ని ప్రోత్సహించడం, వాతావరణ మార్పు, వ్యర్థాల తగ్గింపు మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్, డీన్ రామాంజుల, సీబీఎస్‌ఈ ప్రిన్సిపాల్ రేఖా రావు, ప్రీ-ప్రైమరీ ప్రిన్సిపాల్ ఫాతిమా ఖాజీమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ 'రెసోనెన్స్' అత్యుత్తమ ఫలితాలు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాలలో 'రెసోనెన్స్' సత్తా చాటింది. జూనియర్ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. రాష్ట్రంలో అత్యధిక మార్కులు సాధించి టాప్ ఫైవ్లో 119 మంది, టాప్ టెన్లో 507 మంది విద్యార్థులు నిలిచారు. ఈ ఫలితాలలో అగ్రస్థానంలో నిలిచిన విద్యార్థులను రెసోనెన్స్ డైరెక్టర్ పూర్ణచంద్ర రావు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన ఈ విజయాలు చూస్తుంటే ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఈ ఏడాది అన్ని స్ట్రీముల్లో అద్భుతమైన ఫలితాలు సాధించారన్నారు. రెసోనెన్స్ దేశవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన ప్రీమియర్ ఇనిస్టిట్యూట్‌గా పేరు పొందిందన్నారు. ఐఐటీ, నీట్ ఎన్ఐటీ వంటి ఇంజినీరింగ్, మెడికల్ ప్రవేశ పరీక్షలలో అగ్రశ్రేణి ర్యాంకులను సాధించే విద్యార్థులను తయారు చేస్తుందన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు యేలకంటి వైశాలి (2559128100), బొల్లు శ్రీనిధి (2559129925), గూడే శ్రీనివాస కార్తికేయ (2560132589), ఎం సాయి శివాని (2559125774), పొలంపల్లి రక్ష మహి (2559253622), పోతన లలిత (2558277830).

ఉపాధి కోసం ఉద్యమిస్తాం

- జల్లి విల్సన్, తులసిరెడ్డి
- ముగిసిన కష్టజీవుల పాదయాత్ర

విశాలాంధ్ర-అనంతపురం: పేదలకు ఉపాధి కల్పించే మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే మోదీ సర్కారు ఆటలు సాగనీయబోమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ హెచ్చరించారు. ఉపాధి భృతిగా ప్రతి కూలీకి ఏడాదికి రూ.12 వేలు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టిన కష్టజీవుల పాదయాత్ర (21, 22 తేదీలు) ముగింపు బహిరంగ సభ మంగళవారం స్థానిక కృష్ణ కళామందిర్‌లో నిర్వహించారు. ఈ బహిరంగ సభకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, మాజీ ఎంపీ, ఏఐసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ , సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సీ జాఫర్, పుట్టపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి వేమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి పీ నారాయణస్వామి, సీ మల్లికార్జున, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బీ కేశవరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, ఏఐసీసీ మైనారిటీ విభాగం నేత దాదా గాంధీ, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు పాల్గొన్నారు. సభలో జల్లి విల్సన్ మాట్లాడుతూ... కష్టజీవులకు ఉపాధి కల్పించడం ద్వారా గ్రామీణ అభివృద్ధి కోసం ఉపాధి హామీ చట్టాన్ని యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. 2006 ఫిబ్రవరి రెండో తేదీన అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్ పర్సన్ సోనియాగాంధీ, ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా అనంతపురం జిల్లా నార్పల మండలం బండ్లపల్లి లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభించారని గుర్తు చేశారు. యూపీఏ హయాంలో ఉపాధి హామీ చట్టం విజయవంతంగా అమలైందని తెలిపారు. దీనివల్ల ఆనాడు గ్రామ సీమలో పేదోడి జేబులో డబ్బు ఉండేదని... ఫలితంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుండేదన్నారు, కేంద్రంలో బీజేపీ సర్కారు రావడంతో అంచలంచలుగా ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి పూనుకుందన్నారు. ఉపాధి హామీ నిధుల్ని వ్యవసాయ, ఇతర రంగాల్లోకి బదలాయించడం సరైంది కాదన్నారు. తులసిరెడ్డి మాట్లాడుతూ... 2006లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పథకాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కష్ట జీవులకు పాశుపతాస్త్రం లాంటిదన్నారు. ఈ పథకాన్ని కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లా నార్పల మండలం బండ్లపల్లి లో ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోడానికి ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఆవుల శేఖర్ మాట్లాడుతూ... ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించి వలసలు ఆపాలన్నారు. ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయరాదని డిమాండ్ చేశారు. మెటీరియల్ కాంపోనెంట్‌ను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, పథకం నిధులు పక్కదారి పట్టించరాదన్నారు.

ఇతర ముఖ్య అతిథులు మాట్లాడుతూ... కుటుంబ జాబ్ కార్డుతో నిమిత్తం లేకుండా ప్రతి వయోజనుడికి విడిగా జాబ్ కార్డు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి హామీలో యంత్రాలను, కాంట్రాక్టర్లను నిషేధించాలని వంద రోజులు పని పూర్తి చేసుకున్న ప్రతి గ్రూపునకు పథకంలో చూపెట్టిన విధంగా ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలన్నారు. పని ప్రదేశాలలో టెంట్లు, మెడికల్ కిట్లు, తాగునీరు, మజ్జిగ సరఫరా చేయాలన్నారు. రెండు పూటలా పని విధానం తీసి వేయాలని డిమాండ్ చేశారు. సమ్మర్ అలవెన్స్ పునరుద్ధరించాలని కోరారు. 10 వారాలుగా పెండింగ్ లో ఉన్న పాత బకాయిలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో ప్రమాదాల్లో కూలీ మరణిస్తే 10 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. వడదెబ్బ, గాయాల పాలైతే మెరుగైన ఆరోగ్య సేవలు అందించి కోలుకునే వరకు ఉపాధి వేతనాలు అందించాలన్నారు. ఉపాధి హామీలో పని చేసే క్షేత్రస్థాయి సిబ్బందిపై వేధింపులు ఆపాలన్నారు . వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులపై ప్రతి గ్రామంలో మైక్ ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి అలిపిర, శింగనమల నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి డీపెద్దయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, బుక్కరాయసముద్రం మండల కార్యదర్శి మర్రి స్వామి, నార్పల మండల కార్యదర్శి గంగాధర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగరాజు, కిష్టప్ప, సుబ్రహ్మణ్యం, ఎం. నబీరసూల్, సీహెచ్ ప్రభాకర్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు కుళ్లాయి స్వామి, శ్రీరాములు, కదిరప్ప, అప్పారావు, బాల యేసు, రామమూర్తి, తులసి రాజన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గొప్ప సిద్ధాంతకర్త లెనిన్: సీపీఐ నివాళి

న్యూదిల్లీ: రష్యా విప్లవయోధుడు వీఐ లెనిన్ 155వ జయంతిని పురస్కరించుకొని భారత కమ్యూనిస్టు పార్టీ విప్లవాంజలి ఘటించింది. దేశ రాజధాని దిల్లీలోని సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో మంగళవారం లెనిన్ విగ్రహానికి పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా పూలమాల వేసి నివాళులర్పించారు. లెనిన్ ఉద్యమ స్ఫూర్తిప్రదాతని శ్లాఘించారు. విప్లవకారుడిగా, సిద్ధాంతకర్తగా ఆయన సేవలను కొనియాడారు. విప్లవాత్మక సిద్ధాంతం-ఆచరణకు లెనిన్ ఆదర్శప్రాయమన్నారు. లెనిన్‌కు నివాళులర్పించిన వారిలో సీపీఐ కార్యదర్శులు పల్లబ్ సేన్ గుప్తా, రామకృష్ణ పాండా, డాక్టర్ గిరీశ్ చంద్ర శర్మ, ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య తదితరులు ఉన్నారు.

వేర్వేరు క్యాంపుల్లో ఎందుకున్నారు?

అజిత్-శరద్ పవార్ భేటీపై డి.రాజా

న్యూదిల్లీ: మహారాష్ట్ర ప్రయోజనాల కోసమే కలిశామనే చెప్పుకునే వీరిద్దరు రెండు వేర్వేరు క్యాంపుల్లో ఎందుకు ఉన్నారు? అసలు ఏం చేయాలని అనుకుంటు న్నారు? అని అజిత్- శరద్ పవార్‌ను సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రశ్నించారు. వాస్తవ ఉద్దేశం ఏమిటో మహారాష్ట్ర ప్రజలకు ఎన్‌సీపీ అధినేత అజిత్ పవార్, ఎన్‌సీపీ-ఎస్‌పీ అధినేత శరద్ పవార్ వివరించాలని ఆయన న్నారు. వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధ వినియోగంపై చర్చించేందుకు అజిత్, శరద్ పవార్ సోమవారం పూనేలోని షుగర్ కాంపెక్స్‌లో భేటీ అయ్యారు. పంట దిగుబడుల మెరుగుదల కోసం వ్యవసాయ రంగంలో ఏఐను పెంపొందించే దిశగా వీరిద్దరి మధ్య చర్చ సాగింది. 2022 జూన్‌లో ఎన్‌సీపీ చీలిక తెలిసిందే.

విశాఖ పోర్టు సందర్శించిన నేపాల్ బృందం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: నేపాల్ ప్రభుత్వ వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి డా.గోవింద్ ప్రసాద్ శర్మ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన నేపాల్ ప్రతినిధి బృందం మంగళవారం విశాఖపట్నం పోర్టులో పర్యటించారు. ఈ బృందంలో క్రిషి సమగ్రి కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సాల్ట్ ట్రేడింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ అసిస్టెంట్ సీఈఓ కూడా ఉన్నారు. పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దూబే, నేపాల్ బృందానికి హార్దిక స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోర్టులో ఉన్న మౌలిక సదుపాయాలు, నిర్వహణా సామర్థ్యం, కీలక వసతులపై పోర్టు అధికారులు ఒక సమగ్ర పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను అందించారు. గ్లోబల్ టెండర్ల ద్వారా యూరియా, డీఏపీ వంటి ఇతర ఎరువుల దిగుమతి అవకాశాలను అన్వేషించడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. ఇందుకు సంబంధించి భారతీయ పొటాష్ లిమిటెడ్ నేపాల్ ప్రభుత్వ సంస్థలకు ముఖ్య సరఫరాదారుగా ఉంది. ఇండో-నేపాల్ ఎరువుల సరుకు ఒప్పందంలో భాగంగా ప్రస్తుతం కోల్‌కతా పోర్టులో అమలవుతున్న విధంగా విశాఖపట్నం పోర్టు ద్వారా కూడా బల్క్ రవాణాకు అనుమతి కల్పించే ప్రతిపాదనపై చర్చ జరిగింది. దీని ద్వారా కనీసం రెండు లక్షల టన్నుల అదనపు ఎరువుల సరుకు రవాణా సాధ్యమవుతుందని అంచనా వేశారు. విశాఖ పోర్టుకు వాణిజ్య పరంగా విస్తృత అవకాశాలు ఉన్నాయని నేపాల్ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. మంచి వాణిజ్య వసతులు కల్పిస్తే ఒకటిన్నర నుంచి రెండు లక్షల టన్నుల సరుకులను ఈ పోర్టు నుంచి నిర్వహించే వీలు కలుగుతుందని పేర్కొన్నారు. ఈ వివరాలను పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు.

ఇంటి జాగా ఎప్పుడిస్తారు?

- పాలకులకు మహిళల సూటి ప్రశ్న
- విజయనగరంలో సీపీఐ భారీ ప్రదర్శన, ధర్నా

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది నెలలు గడిచినా పేదలకు ఇంటి స్థలాల మంజూరుకు సంబంధించి ఒక్క అడుగు ముందుకు వేయకపోవడంతో సీపీఐ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు చేస్తున్న సంగతి విదితమే. ఇందులో భాగంగా మంగళవారం సీపీఐ జిల్లా సమితి అధ్వర్యంలో విజయనగరంలో అర్జీలు పెట్టుకున్న మహిళలంతా భారీ ర్యాలీ నిర్వహించి... కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం డీఆర్‌ఓకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జీ ఈశ్వరయ్య మాట్లాడుతూ కార్పొరేట్లకు లక్షల ఎకరాల భూమి ధారాదత్తం చేస్తున్న కూటమి పాలకులకు పేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చేందుకు మనసు రావడం లేదన్నారు. పేదలకు ఇళ్ల నిర్మాణం, స్థలాల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోలేదని మండిపడ్డారు. సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునే వారికి ప్రభుత్వం సాయం అందిస్తే ఎన్నో కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. సర్వేల పేరుతో ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందనే విమర్శలు విన్పిస్తున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ సక్రమంగా ముందుకు సాగలేదని... కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ సాయం పెంచడంతో ఇళ్లు కట్టుకునేందుకు సొంత స్థలం ఉన్నవారు చాలా మంది ముందుకొస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఇంకా గృహ నిర్మాణాలకు సంబంధించిన ప్రక్రియ మొదలు కాలేదని అధికారులు చెబుతున్నారన్నారు. గత టీడీపీ పాలనలోనూ ఇదే పరిస్థితి నెలకొందన్నారు. పట్టణ ప్రాంత పేదలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలని గతంలో అనేకసార్లు అర్హులైన వారితో వ్యక్తిగత అర్జీలు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలలో భాగంగా కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడుస్తున్నా ఇళ్ల స్థలాల పంపిణీ గురించి పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. గత ఐదేళ్లు పాలించిన జగన్ రెడ్డి రాష్ట్రంలో 30 లక్షల ఇల్లు నిర్మిస్తామని...రాబోయే కాలంలో ఇంటి స్థలాలు, ఇల్లు అడిగే పేదవారు లేకుండా చేస్తానని హామీలు గుప్పించి చేతులెత్తేశారని విమర్శించారు. పేదలను మరింత పేదవారిని చేసి గద్దె దిగిపోయారన్నారు. ఇప్పటికైనా పేదలకు ఇళ్ల స్థలాల విషయంలో కూటమి ప్రభుత్వం కళ్లు తెరవాలని హితవు పలికారు. పేదలకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చేవరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.రంగరాజు, కోట అప్పన్న, ఎన్.నాగభూషణం, జిల్లా సమితి సభ్యులు పొందూరు అప్పలరాజు, కండేపిల్లి భీముడు, తాడంగి ఎండుదొర, కె.అప్పలరాజు, ఉల్లకుల నీలకంఠేశ్వర యాదవ్, సామిరెడ్డి. అప్పలనాయుడు, మొయిద పాపారావు, బూర వాసు, కాళ్ళ కృష్ణ, లెంక లక్ష్మి, కె.స్రవంతి, ఉంగరాల జయలక్ష్మి, పెంకి లక్ష్మి, ఏఐటీయూసీ నాయకులు పొడుగు రామకృష్ణ, అల్తి మరయ్య, ఇళ్లస్థలాల కోసం అర్జీలు పెట్టుకున్న మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

తప్పు చేస్తే చర్యలు తప్పవు

పీఎస్సార్ అరెస్టుపై హోంమంత్రి అనిత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ ప్రభుత్వ హయాంలో తప్పుడు పనులు చేసిన అధికారులే ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. తాడేపల్లిలోని విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో మంత్రి మంగళవారం శాఖా సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టుపై మంత్రి మాట్లాడారు. మేం చాలా సందర్భాల్లో ప్రతిపక్షంలో ఉన్నాం. అప్పుడు మాపై కేసులు నమోదయ్యాయి. మా వల్ల ఏ అధికారీ ఇబ్బంది పడిన పరిస్థితి లేదు. గత వైసీపీ పాలనలో టీడీపీ నాయకులను వేధించడానికి సీఐడీని పూర్తిస్థాయిలో వినియోగించారని వైసీపీ అధినేతపై మంత్రి ధ్వజమెత్తారు. మా కూటమి ప్రభుత్వంలో సాక్ష్యాలు లేకుండా పోలీసులు ఏ కేసులోనూ ముందుకెళ్లడం లేదని స్పష్టం చేశారు. తప్పు చేసిన వారిని పారదర్శకంగానే శిక్షిస్తున్నాం. వైసీపీ ప్రభుత్వంలో వారికి అనుకూలంగా ఏకపక్షంగా పనిచేసిన అధికారులే ఎం దుకు అరెస్టు అవుతున్నారో వారే ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకే డోర్ డెలివరీ హత్య కేసుపై పునర్వి చారణ జరుగుతోందని మంత్రి తెలిపారు.

మోడల్ స్కూళ్ల టీచర్లకు షోకాజ్ నోటీసులు విరమించాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ద్వితీయ సంవత్సర ఇంటర్ ఫలితాల్లో 75 శాతం కంటే తక్కువ వచ్చిన 55 మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు, ఉపాధ్యాయులకు జారీ చేసిన షోకాజ్ నోటీసులను వెంటనే విరమించుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, మల్లు రఘునాథ రెడ్డి, ఏపీ మోడల్ స్కూల్స్ స్టేట్ టీచర్స్ యూనియన్ (ఏపీఎంఎస్-ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షులు పి.మోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు టీవీ మార్కండేయ, హనుమంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 12 ఏళ్లుగా 10వ తరగతి, ఇంటర్‌లో మోడల్ స్కూళ్లు సుస్థిరమైన ఫలితాలు నమోదు చేస్తున్నాయని తెలిపారు. గత ఏడాది ఫలితాలతో పోలిస్తే... ఈ సంవత్సర ఫలితాలు ప్రభుత్వ యాజమాన్య కళాశాలలలో మెరుగయ్యాయని, సాక్షాత్తు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్... ఇంటర్ ఫలితాలు విడుదల సందర్భంగా 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 163 మోడల్ స్కూళ్లకు గాను 108 స్కూళ్లు 75 శాతం కంటే అధిక ఫలితాలను నమోదు చేసి మెరుగైన ఫలితాలు సాధించాయని వివరించారు. కేవలం 55 మోడల్ స్కూళ్లు మాత్రమే 75 శాతం కంటే తక్కువ ఫలితాలు నమోదు చేశాయని, వాటిలో 20 పాఠశాలలు 70 శాతానికి పైగా, దాదాపు 30 స్కూళ్లు 50 శాతానికి పైగా ఫలితాలు నమోదు చేశాయని వివరించారు. కేవలం 5 పాఠశాలలు మాత్రమే 50 శాతం కంటే తక్కువ ఫలితాలు వచ్చాయన్నారు. అంతేకాకుండా 10వ తరగతి తెలుగు మాధ్యమంలో చదివి మోడల్ పాఠశాలల్లో వచ్చి ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు రాయటానికి ఇబ్బంది పడుతున్న విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులు కాలేకపోతున్నారని తెలిపారు. మోడల్ పాఠశాలల రెసిడెన్షియల్ స్కూళ్లు కాకపోయినప్పటికీ తరచూ రెసిడెన్షియల్ పాఠశాలల ఫలితాలతో పోలుస్తూ మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులను 100 శాతం ఫలితాల కోసం వేధిస్తున్నారని తెలిపారు. ఆయా విషయాలను పరిగణనలోనికి తీసుకుని మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాల్స్, పీజీటీలను వేధించకుండా మరింత ఉత్తీర్ణతా సాధనకు ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

డిస్కమ్‌ల ఆర్థిక సవాళ్లు అధిగమించాలి

కేంద్ర మంత్రి శ్రీపాద్ యెస్సో నాయక్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను అధిగమించడమే ప్రధాన లక్ష్యంగా చర్యలు చేపట్టాలని కేంద్ర విద్యుత్, ఇంధన శాఖ మంత్రి శ్రీపాద్ యెస్సో నాయక్ అన్నారు. విజయవాడ నోవోటెల్‌లో విద్యుత్ రంగ సంస్కరణలపై మంత్రుల బృందం (జీఓఎం) 4వ సమావేశం నిర్వహించారు. దీనికి మంత్రి శ్రీపాద్ యెస్సో నాయక్ అధ్యక్షత వహించారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాల నుంచి ఇంధన శాఖ మంత్రులు, సీనియర్ అధికారులు హాజరయ్యారు. శ్రీపాద్ మాట్లాడుతూ, డిస్కమ్‌లపై రుణ భారాల తగ్గింపులో భాగంగా ఆర్ఈసీ, పీఎఫ్‌సీ అందించే వడ్డీ రేట్లను తగ్గించడం, ముందస్తు చెల్లింపు జరిమానాల మినహాయింపునకు చర్యలు చేపడతామన్నారు. నెట్‌వర్క్‌లను ఆధునీకరించడంలోను, సేవల పంపిణీని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్న పునరుద్ధరించబడిన పంపిణీ రంగ పథకం (ఆర్‌డీఎస్ఎస్) అమలును వేగవంతం చేయాలని, అన్ని రాష్ట్రాల పంపిణీ దారులను కోరారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ... పంపిణీ రంగంలో అర్థవంతమైన సంస్కరణలను అమలు చేయడంలో రాష్ట్రం తిరుగులేని నిబద్ధతను పునరుద్ఘాటించారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకుగాను ముందుచూపుతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ఇంధన శాఖ మంత్రులు అరవింద్ కుమార్ శర్మ, హీరాలాల్ నగర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్షన్... టెన్షన్

రెండు వేల మందితో కర్రెగుట్టల జల్లెడ

విశాలాంధ్ర-చింతూరు: తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలో భారీ సంఖ్యలో మావోయిస్టులు తలదాచుకున్నారనే సమాచారంతో భద్రతా దళాలు చుట్టుముట్టాయి. మావోయిస్టులు కాల్పులకు దిగగా... ఛత్తీస్‌గఢ్ వైపు నుంచి సీఆర్‌పీఎఫ్ బలగాలు ప్రతి కాల్పులకు దిగడంతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. కర్రెగుట్ట అటు ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ పరిధిలో... ఇటు తెలంగాణలోని ములుగు వాజేడు మండలం పరిధిలోకి వస్తోంది. అయితే... కర్రెగుట్టల దండకారణ్యం వైపు రావొద్దంటూ ఆ మధ్య మావోయిస్టులు బెదిరింపు లేఖ విడుదల చేశారు. దీనిని ములుగు పోలీస్ ఉన్నతాధికారులు ఖండించారు. ఈ క్రమంలోనే మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసులు బచావో కర్రెగుట్టల పేరుతో జాయింట్ ఆపరేషన్ చేపట్టారు. సుమారు రెండు వేల మంది భద్రతా బలగాలతో కర్రెగుట్టలను చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. ప్రధానంగా హిడ్మా దళం కర్రెగుట్టల్లో సంచరిస్తున్నట్లుగా కేంద్ర సాయుధ బలగాలకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. దీంతో అప్రమత్తమైన బలగాలు సోమవారం అర్ధరాత్రి నుంచే గాలింపు ముమ్మరం చేశాయి. వెంకటాపురం మండల పరిధిలో ఉన్నతాధికారులు భారీగా సాయుధ బలగాలను మోహరించి అణువణువు గాలిస్తున్నారు. దీంతో ఆ రీజియన్‌లో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. కర్రెగుట్టకు సమీపంలో గల పెనుగోలు, కొంగాల, అరుణాచల పురం, బొల్లారం గ్రామాలు, వెంకటాపురం మండలంలో గల సరిహద్దు గ్రామాలు పెంక వాగు, మల్లాపురం, కర్రెవానిగుప్ప, లక్ష్మీపురం, ముత్తారం, పెంకవాగు కలిపాక, సీతారాం పురం గ్రామాల్లో, కర్రెగుట్టపైన ఉన్న పామ నూరు, ముకునూరు, చెలిమెల, తడపల, జెల్ల గ్రామాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఎదురు కాల్పుల్లో మావోయిస్టు మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మంగళవారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెందాడు. బస్తర్ రేంజ్ డీఐజీ(ఆపరేషన్) సుందర్ రాజ్ పట్నా, డీఐజీ కమలోచన కశ్యప్, బీజాపూర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం బీజాపూర్ జిల్లా బేధర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేరపి-తొండసం పార గ్రామాల మధ్య అడవుల్లోని గుట్టలపై మావోయిస్టులు దాగి ఉన్నారన్న పక్కా సమాచారంతో భద్రతా బలగాలు గాలింపు చేపట్టాయి. ఈ సందర్భంగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతిచెందాడు. అతనిని గుండెపూడి ఆర్‌పీసీ మిలిషియా ప్లాటూన్ కమాండర్ వెల్లవాచమ్‌గా గుర్తించారు. ఇతనిపై రూ.3 లక్షల రివార్డు ఉంది. ఘటనా స్థలంలో 315 బోర్ రైఫిల్, ఒక పౌచ్, మందుగుండు సామగ్రి లభించాయి. బీజాపూర్ జిల్లాలో ఇప్పటివరకు 112 రోజుల్లో 87 మంది ఎదురుకాల్పుల్లో చనిపోయారు. 213 మందిని అరెస్టు చేయగా... 179 మంది లొంగిపోయారు. మావోయిస్టుల ఏరివేతకు నిరంతరం గాలింపు ప్రక్రియ కొనసాగుతుందని పోలీసు అధికారులు తెలిపారు.

ఉర్సా ప్రకంపనలు

- దాని వెనుక శక్తి టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని
- మాజీ ఎంపీ కేశినేని నాని సంచలన వ్యాఖ్యలు
- సీఎం చంద్రబాబుకు బహిరంగ లేఖ, ట్వీట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉర్సా కంపెనీకి అడ్డగోలుగా, కారు చౌకగా ఎకరా 99 పైసలకే భూములు కట్టబెట్టాలన్న ప్రతిపాదనలు కూటమి ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహానికి గురి చేస్తున్నాయి. ఈ ప్రతిపాదనను విపక్షాలు తూర్పారబడుతున్నాయి. విశాఖపట్నంలో డేటా సెంటర్ ప్రాజెక్టు కోసం కొత్తగా ఏర్పడిన ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 60 ఎకరాల భూమిని... ఎకరా 99 పైసల చొప్పున కేటాయించడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమయింది. విశాఖపట్టణంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)కు భూమిని కేటాయించిన సీఎం చంద్రబాబు నిర్ణయాన్ని ఒక వైపు స్వాగతిస్తూనే... మరోవైపు రూ.5,728 కోట్ల విలువైన డేటా సెంటర్ ప్రాజెక్టు కోసం ఉర్సాకు 60 ఎకరాలు కట్టబెట్టే నిర్ణయం ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. ఇదే వ్యవహారంపై విజయవాడ మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) చేసిన వ్యాఖ్యలతో కూటమి ప్రభుత్వం ఇరకాటంలో పడింది. ఉర్సా సంస్థ... విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ రూపొందించిన బినామీ, మోసపూరిత పథకంగా కేశినేని నాని 'ఎక్స్' వేదికగా సీఎం చంద్రబాబును ట్యాగ్ చేస్తూ తన సోదరుడిపై ఆరోపణలు చేశారు. సీఎం చంద్రబాబుకు ఒక బహిరంగ లేఖ కూడా రాశారు. 'ఉర్సా క్లస్టర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ... భూమి కేటాయింపునకు కొన్ని వారాలా ముందు స్థాపించబడింది. దీనికి గత అనుభవం లేదు. విశ్వసనీయ నేపథ్యం లేదు. సంస్థ డైరెక్టర్లలో ఒకరైన అబ్బూరి సతీశ్... విజయవాడ ఎంపీకి అత్యంత సన్నిహితుడు. ఇంజినీరింగ్ కళాశాల క్లాస్‌మేట్. గతంలో ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే అపఖ్యాతి పాలైన కంపెనీలో అతను మాజీ వ్యాపార భాగస్వామి. ఈ కంపెనీ ప్రజల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి చాలా మంది అమాయక కొనుగోలుదారులను మోసగించి, మూసివేసింది' అని కేశినేని నాని పేర్కొన్నారు. ఇక కేశినేని శివనాథ్ (కేశినేని చిన్ని) స్వయంగా ఉర్సా వెనుక దాగి ఉన్న శక్తి. పెట్టుబడి ముసుగులో ఈ భూమి ఒప్పందాన్ని ముందుకు తీసుకురావడానికి ఎంపీగా, ఆంధ్ర ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తన ప్రభావాన్ని ఉపయోగించారు. ఎంపీ కేశినేని చిన్నికి ఇసుక, బూడిద, కంకర మైనింగ్, రియల్ ఎస్టేట్ మాఫియాలలో లోతైన ప్రమేయం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పనుల్లో మంత్రి నారా లోకేశ్ పేరును బహిరంగంగా దుర్వినియోగం చేస్తున్నారు. అవినీతి ప్రయోజనాల కోసం మీ నాయకత్వాన్ని, పార్టీ పేరును దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోండి' అంటూ సీఎంకు లేఖ రాయడం చర్చనీయాంశమైంది.

ఎలాంటి చరిత్ర లేని ఉర్సా...

హైదరాబాద్‌లో రెండు నెలల క్రితం డొల్ల కంపెనీగా ఉర్సా క్లస్టర్ అనే ఐటీ కంపెనీ రిజిస్టర్ అయింది. దీనికి ఎలాంటి వ్యక్తిగత చరిత్ర లేదు. ఇలాంటి కంపెనీకి విశాఖ ఐటీ సెజ్ మధురవాడ హిల్-3లో రూ.3 వేల కోట్ల విలువైన భూముల కేటాయింపునకు ప్రతిపాదించారు. దాదాపు రూ.3 వేల కోట్ల విలువైన 60 ఎకరాల భూమిని కేవలం ఎకరా 99 పైసలకే విక్రయించేందుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. కనీసం కార్యాలయం, ఫోన్ నంబర్, ఒక ఉద్యోగి గానీ లేని ఉర్సా కంపెనీకి విశాఖలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో వేల కోట్ల రూపాయల విలువైన భూమిని కేటాయించడంపై తీవ్ర విమర్శలున్నాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.